# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:15 సంచిక:6 172 జూన్ 2025 హైదరాబాద్

- తెలంగాణ 'కల' సాకారమైందా?
- భారతదేశ జల విధాన రూపకర్త-డా. బి.ఆర్ అంబేద్కర్
- "పేద, మధ్యతరగతి జీవితాల్లో ఆశించినమేరా మార్పులు కనిపించటం లేదు"
- అక్షరానికి కమిటైన అధ్యాపకుడి అంతరంగం
- విశ్వనాథవారి విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు-విద్యా మూల్యాంకనం
- తెలుగు సాహిత్యం - సాంకేతిక ప్రగతి



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

జూన్ 2025

సంచిక : 6

సంపుటి : 15



గౌరవ సంపాదకులు

ప్రొ॥ అడపా సత్యనారాయణ

సలహా మండలి

అల్లం నారాయణ

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

ప్రొఫెసర్ గణేష్

ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు

స్నేహలత ఎం.

సంపాదకవర్గం

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : శేషు



రచనలు పంపాల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్-500 007.

మెయిల్: nadusthunnatelangana@gmail.com

ఫోన్ నెం.: 9290745490


## సంపాదకుని ఉత్తరం

అమరత్వం

నిర్ణయమయ్యాక

ఆయుధాన్ని కౌగిలించుకున్నవాళ్లు

ఈ కాలం కథానాయకులు

కొన్ని సన్నివేశాల్లో

వీరుల త్యాగం కూడా

అసమ్మతి ప్రకటననే

30 జూన్ 2025


*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| తెలంగాణ 'కల' సాకారమైందా? | **ప్రొఫెసర్ చింతకింది కాశీం** | 5 |

**ప్రొఫెసర్**

| | | |
|---|---|---|
| కవితా జీవనది జూకంటి జగన్నాథం | **ప్రొఫెసర్ చింతకింది కాశీం** | 6 |

**సామాజికం**

| | | |
|---|---|---|
| భారతదేశ జలవిధాన రూపకర్త డా.బి.ఆర్.అంబేద్కర్ | **డా. గాదె వెంకటేశ్** | 9 |

**తొవ్వముచ్చట**

| | | |
|---|---|---|
| "పేద, మధ్యతరగతి జీవితాల్లో ఆశించిన మార్పులు " కనిపించటం లేదు" –డా.చిట్టెడి కృష్ణారెడ్డి | **బి.మహేష్** | 12 |

**సాహిత్య పరిశోధన**

| | | |
|---|---|---|
| ముందడుగు నాటకం–తెలంగాణ జీవన చిత్రణ | **డా.వి.వెంకటేశ్** | 20 |
| కోయ తెగ సంస్కృతి–సంప్రదాయాలు | **అరెం అరుణ్‌కుమార్** | 23 |

**విమర్శ**

| | | |
|---|---|---|
| గోరటి వెంకన్న ప్రాకృతికత | **డా.దుగ్గి గాయత్రి** | 26 |
| విశ్వనాథవారి 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' విద్యా మూల్యాంకనం | **డా.బోలుగద్దె అనీల్‌కుమార్** | 28 |
| సుధలొలికించే సాహిత్యం–సుకవి జాషువా కవిత్వం | **డా.పోతుల వెంకటేశ్వర్‌రెడ్డి** | 32 |
| తెలుగు సాహిత్యం–సాంకేతిక ప్రగతి | **మ్యాడం అభిలాష్** | 36 |
| విల్సన్ సుధాకర్ కవిత్వం–సామాజిక వాస్తవికత | **పల్లిపట్టు నాగరాజు** | 40 |

**పుస్తక సమీక్ష**

| | | |
|---|---|---|
| రాళ్లసీమను వెలిగించిన సింగిడి | **డా.శివరాత్రి సుధాకర్** | 42 |
| అక్షరానికి కమిటైన అధ్యాపకుడి అంతరంగం | **డా.మెంతబోయిన సైదులు** | 46 |

**పరిశోధన పరిచయం**

| | | |
|---|---|---|
| తెలంగాణ భాషా స్వరూపం | **డా. రాగుల సుధాకర్** | 49 |

# తెలంగాణ 'కల' సాకారమైందా?

ప్రొఫెసర్ చింతకింది కాశీం

జూన్ 2, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజు. తెలంగాణ శబ్దమే అపురూపమైనది. సౌందర్యాత్మకమైనది. కుతకుత ఉడికిన జీవితాల ప్రతిబింబం తెలంగాణ. కనీసం 1000 సంవత్సరాలు తలెత్తుకుని నిలబడిన చరిత్ర తెలంగాణది. సమ్మక్క, సారక్క, ప్రతాపరుద్రుడు, శైవ సాహిత్యాన్ని ఆకాశమంత ఎత్తుకు పద్యగానం చేసిన పాల్కురికి సోమనాథుడు. కవిత్వాన్ని రాజుకు అంకితం చేయకుండా నిటారుగా నిలబడిన కవి పోతన నడిచిన నేల. సర్వాయి పాపన్న గౌడ్ గోల్కొండ రాజ్యం మీద సవాల్ విసిరిన నేల. ఆదివాసుల ఆత్మబంధువు కొమురం భీమ్. జల్, జంగల్, జమీన్ కోసం పోరు చేసిన నేల. ఈ భూమి మాది, ఈ అడవి మాది, ఈ నేల మాది, ఈ ప్రకృతి మాది, అని ఎలుగెత్తి చాటి, నైజాం ప్రభుత్వానికి సవాల్ విసిరి, హెూరాహెూరి పోరాటం చేసిన కొమురం భీమ్ నడిచిన నేల. నైజాం, నిజాం రజాకార్ల సైన్యాన్ని ఎదురొడ్డి భుజాల మీద నాగండ్లను మోసిన రైతుల నేల. ఆయుధాలను మోసి, తెలంగాణాకి స్వేచ్ఛావాయువులను ఇచ్చిన నేల. తెలుగు నేల మీద అపురూపమైన చరిత్రని లిఖించిన చాకలి ఐలమ్మ పుట్టిన నేల. తన పంట మీద దొరల గద్దలు వాలితే తన పంటను రక్షించుకోవడానికి గుత్పలను చేతబట్టి పోరాటం చేసిన చాకలి ఐలమ్మ పౌరుషాల నేల. దొడ్డి కొమురయ్య, విసునూరి రామచంద్రారెడ్డి దొరతనపు గడీలను కూల్చినవాడు. ఇలా ఎందరెందరో ఈ నేల మీద నడియాడారు. తెలంగాణ వికాసాన్ని ప్రపంచమంతా విరజిమ్మిన సురవరం ప్రతాపరెడ్డి, ప్రజల మనిషి ఆవిష్కరించిన వట్టికోట ఆళ్వారుస్వామి, "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని పలికిన దాశరథి. తెలంగాణ గొడవను తన గొడవ చేసుకున్న కాళోజి. ఇలా ఎందరో.

పాట. పాట అంటే జీవితం. శ్రమ జీవితం. పని పాటలో జీవితం. పాటని ప్రపంచమంతా విస్తరింపచేసిన ది గ్రేట్ లెజెండ్, మన కాలపు యుగకర్త గద్దర్ నడయాడిన నేల. ఇట్లాంటి తెలంగాణ, 60 ఏళ్లుగా స్వరాష్ట్రం కావాలని కొట్లాడి కొట్లాడి, యాతనపడి, సంవాదం నడిపి చర్చలు చేసి, పోరాడి ఒరిగిపోయి, కన్నీళ్లు, నెత్తురు పులుముకొని జీవితమే పోరాటమైంది. 370 మంది బిడ్డలు 1969లో తెలంగాణ నేలకోసం అపురూపమైన వారి జీవితాలని అర్పించారు. 1990లో మరొక్కసారి ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష ఎజెండా మీదికొచ్చింది.

తెలంగాణ జన సభ, తెలంగాణ ఐక్యవేదిక, తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య, తెలంగాణ రచయితల వేదిక, తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్, తెలంగాణ కళా సమితి ఇలా ఎన్ని పేర్లు అయినా చెప్పొచ్చు. ఈ అన్ని పేర్లు తెలంగాణ కోసమే. తెలంగాణ పోరాటం కోసమే. ప్రజలలో తెలంగాణ ఆకాంక్ష ఆరిపోకుండా నిలబెట్టి దోసిళ్ళుబట్టి దీపాన్ని వెలిగించిన తెలంగాణ. 2009 లో విద్యార్థులు చేసిన మహెూత్తర పోరాటానికి సాక్షం ఈ జూన్ 2. ఆర్ట్స్ కాలేజ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా 2009 నుంచి 2014 వరకు 5 సంవత్సరాలు అద్భుతమైన పోరాటాన్ని నడిపి తెలంగాణను సాధించుకున్నాం. అప్పుడు తెలంగాణ అంతా రోడ్డుమీదికొచ్చింది. సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగర హారం, బతుకమ్మ. రోడ్డు రోడ్డంతా బతుకమ్మ ఆడింది. వంటావార్పు, సహాయ నిరాకరణ, ఇలా జాతీయోద్యమంలో ఎన్ని రకాల పోరాట రూపాలు పాటించామో అంతకన్నా ఇంకా ఎక్కువ పోరాట రూపాలని ఇక్కడ ఆచరించింది తెలంగాణ. 2014, జూన్ 2 తారీఖు నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.

11 సంవత్సరాలు గడిచింది. అమరుల ఆకాంక్షలు ప్రజల ఆలోచనలు ఇవన్నీ ప్రతిబింబించవలసిన తెలంగాణ. తెలంగాణ అంటే, విద్యను సుసంపన్నం చేసుకోవడం. నీళ్ళను వరిమడులకు, ఎండిపోయిన బీళ్ళకు పారించుకోవడం. తెలంగాణ అంటే, సాంస్కృతిక వికాసాన్ని పెంపొందించుకోవటం. తెలంగాణ అంటే, ప్రజల శ్రమ జీవితపు పని పాటల సాహిత్యాన్ని వికసింపజేసుకోవడం. తెలంగాణ అంటే, ప్రతి ఇంటిలో రోగగ్రస్థుడైన మనిషికి వైద్యం అందించటం. తెలంగాణ అంటే, తలెత్తుకొని నిలబడి భారత రాజ్యాంగం హామీపడిన స్వేచ్ఛాసమానత్వ భావనని అమలుచేసుకోవడం.

ఆ భావన కోసం 11ఏళ్లు గడిచింది. నడిచింది. ఇంకా నడవవలసి ఉంది. చాలా ఉంది. ఈ నేల మీద 1400 మంది బిడ్డలు ప్రాణలర్పించారు. చెట్టుకువేలాడారు. వేగంగా దూసుకు వస్తున్న రైలుకు ఎదురెళ్లి రక్తపు ముద్దలయ్యారు. రకరకాల పద్ధతుల్లో తమ నిరసనని ప్రకటించారు. ఆత్మబలిదానాలు చేసుకున్నారు. తెలంగాణ వచ్చింది. ఆ తల్లుల కడుపు శోకం మిగిలే ఉంది. కనుక ఈ తెలంగాణాలో నాణ్యమైన విద్య, పంటపోలలాకు నీళ్ళు, భూమి లేనివాళ్ళకు భూమి, ఉద్యోగం లేనివాళ్ళకు ఉద్యోగం, రోగగ్రస్థులైన వారికి నాణ్యమైన వైద్యం అందడం కోసం మనమందరం ఆలోచిద్దాం. చర్చిద్దాం. సారవంతమైన తెలంగాణాను, సారవంతమైన చదువులద్వారా నిర్మాణం చేసుకుందాం. మీ అందరికీ ఈ సందర్భంగా తెలంగాణ ఆవిర్భావ శుభాకాంక్షలు. జ్ఞానవంతమైన తెలంగాణ నిర్మాణంకోసం మీ మెదళ్ళకు పదును పెడతారని నమ్ముతూ... T

# కవితా జీవనది జూకంటి జగన్నాథం

**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

కవిత్వం అంటే ప్రాకృతిక సౌందర్యం. ప్రకృతిని అక్షరాలతో దర్శించడమే కవితా శిల్పం. మనిషి జీవితం ఎంత అందంగా ఉంటుందో కవిత్వమే ఆవిష్కరిస్తుంది. శబ్దాల సమూహమే కవిత్వం. కనుక ప్రతి శబ్దానికి కవులు స్పందిస్తారు. కవుల భావనా ప్రపంచంలో రూపొందిన అద్భుత కళాఖండం కవిత్వం. అందుకే ఉప్పొంగుతున్న భావాల సవ్వడి కవిత్వంగా భాషిస్తుంది. ఈ భావాలన్నీ రూపొందబానికి కవికి ఒక మూర్త ప్రపంచం ఆలంబనగా ఉంటుంది. కనుక తమ లౌకిక ఆవరణలోని కళ్లముందరి కాలాన్ని కవులు అక్షరాలతో వ్యక్తం చేస్తారు. ఈ క్రమంలో మనుషులు జీవితాన్ని అందంగా ఆవిష్కరించడానికి అవిశ్రాంతంగా పెనుగులాడుతారు. తమ చుట్టూ ఉన్న సమాజంతో సంవాదం నడుపుతారు. దృగ్గోచర ప్రపంచంలో అందం, సుఖం మాత్రమే కాకుండా దు:ఖం కూడా మనిషిని వెంటాడుతుంది. మనుషులు కొన్నిసార్లు మాత్రమే అమూర్త భావనలో ఉండగలుగుతారు. ఎక్కువ మేరకు వాస్తవ ప్రపంచంలోనే జీవిస్తారు. కన్నీళ్లను అనుభవించిన మనుషులు అక్కడితో ఆగిపోకుండా దు:ఖ హేతువులను అన్వేషిస్తారు. కవి కూడా మొదట మనిషియే. సహృదయ పాఠకుడే.

ప్రియురాలు మునివేళ్లను, తేనె తెట్టులో మకరందాన్ని, మల్లెపువ్వులో సువాసన దగ్గరే ఆగిపోకుండా పగిలిన వరిమడిని, వేపచెట్టుకు వేలాడుతున్న రైతు శవాన్ని, దగ్ధమవుతున్న అంటరాని పూరి గుడిసెను, ఒరిగిపోతున్న ఆదివాసీ వీరుడిని, కుతకుత ఉడుకుతున్న తెలంగాణ అస్తిత్వాన్ని, గ్లోబల్ ఖడ్గానికి మౌనంగా తెగిపడుతున్న మానవ సంబంధాలను అక్షరాలతో పుటం పెడుతున్న ఏకైక సృజనకారులు కవులు. ఇలాంటి లెగసిని కొనసాగిస్తున్న అపురూపమైన కవి జూకంటి జగన్నాథం. ఆయన మౌనంగా ఉంటాడు, అంతర్ముఖుడు, మెరుపుల ప్రపంచానికి దూరంగా ఉంటాడు, పల్లెను మోసుకు తిరుగుతాడు, మాయిముంత వాసనేస్తాడు, అల్పాక్షరాలలో వ్యక్తమవుతాడు, ఆయన కవి, ఆయన సిరిసిల్ల, ఆయన జగిత్యాల. ఆయన మానేరు, ఆయనొక నిరంతరం ప్రవహించే కవితా జీవనది. ఆయన ఇపుడు ఏడు పదులలోకి ప్రవేశించాడు. అర్థశతాబ్దంగా కవిత్వమే జీవితంగా రాస్తున్నాడు.

జూకంటి జగన్నాథం దేశం స్వాతంత్ర్యం పొందిన తొలినాళ్లలో ఈ భూమి మీద పడ్డాడు. అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యాన్ని శాసిస్తున్న కాలంలో కష్టజీవికి ఇరువైపుల ఉన్నవాళ్లే కవులనే భావన విస్తారంగా వ్యాపించి ఉండింది. కానీ ఆ కవులే కలాన్ని దించి అంతర్ బహిర్ యుద్ధరావానికి విరామం ప్రకటించారు. ఆ కాలంలోనే అగ్నిగోళంలా మండుతున్న ప్రపంచంలో విస్మరణకు గురైన సమూహాల నుంచి అనేక ప్రశ్నలు ఉదయించాయి. భారత సమాజం ఈ క్రమానికి మినహాయింపు కాలేకపోయింది. నల్లమందు మింగి మత్తుగా ఉన్న కవి వర్యున్ని యువకవులు ప్రశ్నించారు. సామాన్యుని ఆర్తిని ఆకాశమంత ఎత్తుకు అరిచిన కాలంలో జూకంటి బాల్య దశను దాటి యవ్వన కాలాన్ని అందుకోవడానికి 'ఆకాశానికి నిచ్చెనవేసాడు'. అడపాదడప ఉత్పత్తి శక్తుల గొంతులో సుడి తిరిగిన యక్షగాన పద్యాలను వింటూ సాహిత్య రసానందాన్ని పొందాడు. భారతదేశాన్ని వసంత కాలపు చిరుజల్లులు తడిపి ముద్దచేసాయి. ఆ వర్షంలో తడిసిన జూకంటి ఈ ప్రపంచాన్ని నూతనంగా దర్శించాడు. ప్రగతి భావన ఆయన యవ్వన కాలపు స్వప్నాలను తట్టిలేపింది. సిరిసిల్ల సమీపంలోని సినారె ప్రభావం కంటే జగిత్యాల జైత్రయాత్ర మట్టిమనుషులే ఆయనను అమితంగా ఆకర్షించారు.

జూకంటి మాతామహుల ఇంటినుంచి సిరిసిల్లకు రావటం వలన అరుదైన కవిగా రూపొందడానికి మొదటి పునాది పడింది. సిరిసిల్ల ఆంధ్ర మహాసభల ద్వారా వెల్లివిరిసిన అక్షర చైతన్యం ఆ ప్రాంతాన్ని ఆవరించింది. పౌరగ్రంథాలయాలు ఏర్పడడానికి దారి దొరికింది. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అలంకారికుల భావనలు కావచ్చు కాని, అవి ఏ కవికైనా అబ్బవలసిన ప్రాథమిక నియమాలు. నిరంతర అధ్యయనమే మనిషిని సానపడుతుందని చెప్పడానికి

జూకంటియే నమూనా. సిరిసిల్ల పౌర గ్రంథాలయంలో దొరికిన ప్రతీ పుస్తకాన్ని తిరిగేసిన అనుభవమే ఆయనలోని వ్యుత్పత్తి వికాసానికి మూలం. నిరంతర అభ్యాసన వలన జూకంటిలోని ప్రతిభ రాణించింది. అధ్యయన సంస్కారం మనిషిలో స్పష్టమైన ప్రాపంచిక దృక్పథాన్ని రూపొందిస్తుంది. పెద్దపల్లి, కరీంనగర్ పట్టణాలను తన జ్ఞానం, బోధన ద్వారా ప్రభావితం చేసిన నిజాం వెంకటేశంతో స్నేహం జూకంటిని మరో తలంలోకి తీసుకెళ్లింది. ఆయన పరిచయం చేసిన కమ్యూనిస్టు మేనిఫెస్టో జూకంటిలో అలజడిని రేపింది. అప్పటికే చదివివున్న పొట్లపల్లి రామారావు, వట్టికోట ఆళ్వారుస్వామి సాహిత్య దృక్పథం అర్థం కావడానికి మార్క్సి భావుకత తోడ్పడింది.



ఎమర్జెన్సీ కాలానికి జూకంటి రెండు పదులలోకి ప్రవేశించాడు. నిండు జవ్వనంబుతో కవిత్వాన్ని అల్లటం ప్రారంభించాడు. ఆ వయసులో సృజనకాలాన్ని కాంక్షించాడు. కానీ సంకెళ్లకాలం అంతర్ముఖున్ని చేసింది. అలాగని జూకంటి పలాయనవాది కాదు, ఆ కాలంలో పదునెక్కిన యవ్వనకలం. ఎమర్జెన్సీ, దళిత అస్తిత్వ వేదన, మండల్ కమీషన్ ఉద్యమం, ప్రపంచీకరణ, ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష ఇలా తన కాలపు జన సందోహాలన్నింటిని జూకంటి అక్షరబద్ధం చేసాడు. ఈ కవి చుట్టూ నిండైన సామాజిక చలనాలు రూపొందాయి. ఈ యాభై ఏళ్ల కాలానికి ఆయనొక కాపలాదారుగా ఉన్నాడు. 'లారీ కాలు కింది నుంచి తప్పించుకొన్న బక్కచిక్కిన కుక్కబతుకు'ను చూడగలిగిన కవి నేత్రం ఆయనకు ఏర్పడింది. అలాగే తూర్పు ఆకాశంలో ఎర్రని శిశువు అరుపును కూడా జూకంటి విన్నాడు. ఆయన విన్నవి కన్నవి విన్నవించగపోతే సిరిసిల్లలోనో, జగిత్యాలలోనో చౌరస్తా ఎర్రని చొక్కా ధరించి గుండీలు సర్దుకుంటుంది.

జూకంటి తాను దర్శించిన ముడిపదార్థాన్ని సౌందర్యాత్మకం చేసిన కొత్త కవితా శిల్పంతో మనల్ని అబ్బురపర్చుతాడు. ప్రతి కవి కవిత్వానికొక డిక్షన్ ఉంటుంది. మెటఫర్ ఉంటుంది. అలాంటి తనదైన ముద్రతో తెలుగు కవిత్వంలోకి జూకంటి ప్రవేశించాడు. వాస్కోడిగామా డాట్ కామ్‌ను గ్లోబలైజేషన్ తొలి రోజుల్లోనే కవిత్వం చేసిన క్రాంతదర్శి ఆయన. ఇండియా తమకు శిరస్సు వంచి స్వాగతం పలుకుతుందని రాయగలిగిన దృక్పథమే కాదు, సాహసం కావాలి. తెగిన చెవుల గురించి కాకుండా చెవి కమ్మల గురించి ఏడ్చే లోకం మీద జాలి చూపాడు. ఏలిక అనుకుంటే ఏదైనా జరగవచ్చును, అది రాజపత్రంగా రూపొందుతుంది. రాజ్యాలు లేని రోజుల్లో రాజదర్పం, రాజపత్రం ఉండటమే వింతల్లోకెల్లా వింతగా కవి భావించాడు. 'ఊళ్లకూళ్లు కూలగొట్టి కడుపులు కాలబెట్టి'న రాజపత్రం గురించిన చిలక రహస్యాన్ని కవి చెప్పాడు. రాజ్యం అణిచివేత సాధనం, రాజకీయార్థశాస్త్రం తెలిసిన వారందరికి అర్థమయ్యే పెట్టుబడి సత్యాన్ని ఎన్నిసార్లు ఆవిష్కరించిన ఆయన కవిత్వంలో కొత్తగానే వ్యక్తమవుతుంది. అది కవి ప్రతిభ ద్వారా వ్యక్తమైన శిల్పనైపుణ్యం. దొపిడి విశ్వమంతా వ్యాపించి ఉంది. నిరసన కూడా ఎల్లలు దాటింది. ఈ చారిత్రక విభాత సంధ్యను జూకంటి దర్శించిన తీరు తాజాగా ఉంటుంది. సముద్రం మౌనంగా ఉందని మనం అనుకునేలోపు అదొక ఝంఝు మారుతంలా చుట్టేస్తుందనే ప్రమాద హెచ్చరికను ఈ కవి చేయగలడు. అగ్నిపర్వతం మీది నుంచి కవితాగానం సంధిస్తున్నాడు. త్యాగాన్ని రాజద్రోహంగా భావించిన కవితా శిల్పం జూకంటిది. జీవితం లోతుల్లోకి వెళ్లి పాతాళ గరిగెతో

సమస్త దు:ఖాన్ని తవ్వితీసి ఒడ్డుకు వేసే పనిలో ఆయన నిమగ్నమయ్యాడు.

జూకంటి నిత్యయవ్వనుడు. కానీ పట్నం రావాలంటే భయపడుతాడు. రాజ్యానికి దూరంగా ఉంటాడు. ఏలికగా చాలా ఎడంగా ఉంటాడు. అక్కడక్కడే ఆ సిరిసిల్ల సాంచల మధ్య తచ్చాడుతుంటాడు. ఆ ముతక గుడ్డలకు అంటిన నెత్తురు గురించి కలత చెందుతుంటాడు. దారపు పోగుల మధ్య అర్థరాత్రి ఆగిపోయిన ప్రాణాన్ని పోస్ట్‌మార్టం చేస్తుంటాడు. కానీ గ్లోబల్ దృశ్యాన్ని ఎప్పటికప్పుడు అక్షరబద్ధం చేస్తాడు. పరుగెత్తుతున్న కాలాన్ని అంతే వేగంగా అందుకుంటాడు. అందుకే ఆయన కవితా నవయవ్వనుడు.

'కిటికీలు దర్వాజలు తీసుకుపోగా

దూలానికి వేలాడిన గుక్కపట్టిన ఉయ్యాల

కన్నీటి జోలపాటకు తల ఊగుతుంది' వర్తమానంలో నిర్వాసితుల దు:ఖాన్ని ఈ పద్యం ఆవిష్కరించింది. నది ఏదైనా, ఊరు ఏదైనా గాయం ఒకటే. అలాగే తెలంగాణ గురించి ఈ కవి కలగన్నాడు. బాల్యంలో కోరుకున్నాడు, యవ్వనంలో ఆశించాడు, వృద్ధాప్యంలో నెరవేర్చుకున్నాడు. కానీ సంధించిన ప్రశ్నలు వడిపెడుతుంటే ఎవర్ని అడగాలో తెలియక మానేరు నదితో ఒంటరిగా సంభాషిస్తున్నాడు.

ఇవ్వాళ దేశభక్తి ఒక రాజతంత్రం, అధికార సౌధం. దేశాన్ని తాకట్టు పెట్టడమే దేశభక్తి అయినచోట 'నేను రూపాయికి బంధించబడ్డ దేశభక్తుడిని' అని ఆవేదన చెందుతున్నాడు. జూకంటి కవిత్వంలో విస్తారమైన ఇతివృత్త వైవిధ్యం ఉంది. కన్నతల్లి, తండ్రి, మనుమరాండ్లు, స్నేహితులు, సెల్‌ఫోన్, పేపర్‌బాయ్, మిల్క్‌బాయ్, మానేరు, సిరిసిల్ల, తెలంగాణ, విప్లవం, అమరులు, గ్లోబలైజేషన్. ఇలా తన చుట్టూ ఆవరించిన ఇతివృత్త సముదాయమంతా ఆయన కవిత్వంలో ఉంది. తెలంగాణ జీవద్భాష కలిగి ఉండటం చూస్తే స్థానీయత మీద ఆయనకుండే మమకారం తెలుసుకోవచ్చు. తెలంగాణ మట్టిలో నుంచి ఆయన వ్యక్తమవుతాడు. మనిషితనం, మంచితనం అతడి కవితా సారాంశంగా భావించవచ్చు.

కవి మౌనంగా ఉంటే వ్యవస్థ కురచగా మారిపోతుందనే ఎరుక జూకంటికి ఉంది. సంవిధానం, ప్రజాస్వామ్యం వికసించాలంటే ప్రశ్న మనుండాలని కోరుతున్నాడు. 'సంఘర్షించాల్సిన సమయంలో మౌనంగా తలవంచుకుంటే చావడానికి ఇలా ఎన్నెన్నో ఉటంకింపులు' ఉంటాయని హెచ్చరిస్తున్నాడు. 'చీకటి గురించి అడుగు/ వెలుగుకు అంటిన/నల్లని మరకల గురించి అడుగు' అప్పుడే కవి సజీవ దృశ్యంగా ఉంటారని జూకంటి రాసాడు. కవులు అనధికారిక శాసనకర్తలని ఆంగ్లంలో ఒక మాట ఉంది. కనుక వారి కలం, వారి గొంతు ప్రజాపక్షమే. ఏలికలో భాగమైన కవిలో సృజనాత్మకత ఒట్టిపోతుంది. ప్రపంచీకరణ పతాక స్థాయికి చేరుకున్న కాలంలో విధ్వంసమవుతున్న మానవ విలువలు కవిని పాలక కొసకు చేర్చుతున్నాయనే న్యాయమైన ఫిర్యాదు జూకంటికి ఉంది. సచివాలయ గుమ్మానికి కవులు స్వచ్ఛందంగా తమ శిరస్సులను వేలాడదీసుకున్నారని బాధపడుతున్నాడు. రాజ్యం కోసం అక్షరం సొట్టపడకూడదని నెత్తి నోరు మొత్తుకొని బామాడుతున్నాడు. కవి కూడా మట్టిలో కలిసిపోవచ్చు. కానీ జీవనది లాంటి అక్షరం మాత్రం గొంతు లేనివారికి ఆసరా కావాలని కవి అయిన ప్రతీ ఒక్కరు ఆలోచించాలి. ఏడు పదులు పూర్తి చేసుకుంటున్న జూకంటి అర్థశతాబ్దం కవితా ప్రవాహం 18 సంపుటాల్లో, 1745 పేజీల్లో నిక్షిప్తమైంది. కనుక ఈ ఒక్క వ్యాసంలో ఆయన కవితా ఆత్మను ఆవిష్కరించడం సాధ్యమయ్యే పనికాదు.

T

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.**

**వెబ్ పేజీ:** https://nadustunnatelangana.com

# భారతదేశ జలవిధాన రూపకర్త డా.బి.ఆర్.అంబేద్కర్

డా. గాదె వెంకటేశ్

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తన నిమ్న జాతి ప్రజల సమానత్వం, ప్రయోజనాల కోసం ఎంతగా శ్రమించాడో, దేశ భవిష్యత్ నిర్మాణానికి ఆపేక్షితమైన అంతకంటే ఎక్కువ సమయం, జ్ఞానం ధారపోశాడు. శాస్త్ర, సాంకేతిక సమస్యల పట్ల ఆయనకు ఉన్న లోతైన పట్టు, విస్తృత అవగాహనను, అలాగే తాను నిర్వహించిన పాత్రను, అంతర్లీనంగా పరిశీలించినప్పుడే పూర్తి స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. చరిత్రను రచించాలన్నా, సమకాలీన సమస్యలకు పరిష్కారాలను అన్వేషించాలన్నా, ప్రతి సందర్భంలో అంబేద్కర్ పోషించిన గణనీయమైన, మార్గదర్శకమైన పాత్ర స్పష్టంగా ప్రతిఫలిస్తుంది.

అటువంటిదే "1942 నుండి 1946 వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక, పబ్లిక్ వర్క్స్ మంత్రిత్వ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో, నేటి జాతికి వెన్నుముకగా నిలిచిన రెండు కీలక సాంకేతిక సంస్థలను స్థాపించాడు. ఒకటి నేటి "సెంట్రల్ వాటర్ కమిషన్"కు ఆదిగా ఏర్పడిన సెంట్రల్ వాటర్వేస్, ఇరిగేషన్ అండ్ నావిగేషన్ కమిషన్ (CWINC), మరొకటి సెంట్రల్ టెక్నికల్ పవర్ బోర్డ్ (CTPB), ఇది తరువాత సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (CEA)గా రూపాంతరం చెందింది.

బాబాసాహెబ్ చేపట్టిన ప్రాజెక్ట్ అనుకున్నది అనుకున్నట్టుగా నిర్మించడం జరిగింది. అంతేకాకుండా ఇంటిగ్రేటెడ్ అప్రోచ్‌కి అంబేద్కర్ నాంది పలికాడు. జలమార్గాల ఆవశ్యకత నదుల అనుసంధానం అవసరాన్ని (పర్యావరణానికి నష్టం లేకుండా), జల విధానం (వాటర్ పాలసీ)ను, దామోదర్ లోయ, హిరాకుడ్, సోనీ నదులపై నిర్మించిన ప్రాజెక్టుల నిర్మాణంలో తాను చూపించిన దార్శనికత, చౌరవ తర్వాత వచ్చిన బహుళార్థక ప్రాజెక్టుకి ఆదర్శంగా నిలిచాయి అనడంలో ఎలాంటి అతిశేయోక్తిలేదు. (Dr. Ambedkar memorial lecture in 2014 at Vigyan Bhawan Shri Pranab Mukharjee, President of India). వైస్రాయి (గవర్నర్ జనరల్) అంబేద్కర్ అనుభవం మరియు జ్ఞానం ప్రభుత్వానికి, దేశ నిర్మాణానికి అవసరమని భావించి, ఆయనను కార్మిక, పబ్లిక్ వర్క్స్ మంత్రిత్వ శాఖ మంత్రిగా నియమించడమేకాక, బ్రిటిష్ ప్రభుత్వంతో కూడా ఆమోదింపజేశాడు.

రెండవ ప్రపంచ (Second world war) యుద్ధం తరువాత ఆ యుద్ధంలో పాల్గొన్న ఎన్నో దేశాలు నష్ట నివారణ, పునర్నిర్మాణ చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. ఇండియా దాదాపు అదే పరిస్థితిలో ఉన్నది. ఈ పునర్నిర్మాణంలో భాగంగా ప్రాజెక్ట్ నిర్మాణం దేశ అవసరాల రీత్యా అనివార్యమైంది. ఈ సందిగ్ధ పరిస్థితిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాజెక్టులు నిర్మించే విషయంలో అప్పటివరకు ఉన్న "వరద నివారణకు" మాత్రమే అన్నట్లుగా ఉండే మూస ధోరణిని కాదని, బహుళార్థక ప్రాజెక్టుల నిర్మాణానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రణాళికలు రూపొందించారు. అలా ప్రతిపాదించిన పథకాల (స్కీమ్స్)లో దామోదర్ వ్యాలీ స్కీం ఒక మైలురాయి (Mile Stone)గా నిలిచింది.

1942లో, భారత ప్రభుత్వ చట్టం (1935) ప్రకారం నీరు, విద్యుత్తు Provinces, princely states కింద ఉండేవి అందువల్ల కేంద్రానికి నీటి, విద్యుత్ లాంటి విషయం లోపాలన పరమైన నిర్ణయాలు తీసుకోవడానికి పరిమితులు ఉండేవి. కానీ దేశ పునర్నిర్మాణ కార్యక్రమంలో అందించిన వెసులుబాటును డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చక్కగా ఉపయోగించుకొని, చిన్న చిన్న ఆనకట్టల స్థానంలో బహుముఖ ప్రయోజనాలున్న పెద్ద ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాడు.

భారతదేశ ఆర్థిక అభివృద్ధిపై బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్‌కు లోతైన దార్శనిక స్పష్టత ఉండేది. ఆర్థిక స్థితిగతుల పురోగతికి సహజ వనరుల సమృద్ధి కీలకమని ఆయన విశ్వసించాడు. నీటిని ఆయన జాతీయ సంపదగా పరిగణించాడు. సహజ వనరులను సమర్థవంతంగా, సమతుల్యంగా వినియోగించుకోవాలని ఆకాంక్షించాడు. ఈ దృష్టితోనే ఆయన రాజ్యాంగంలో పర్యావరణ పరిరక్షణకు మౌలిక పునాదులను వేసాడు. ఇవే తరవాత కాలంలో వివిధ పర్యావరణ చట్టాల రూపంలో అభివృద్ధి చెందాయి. అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా భూమిని, జీవనాధారాలను కోల్పోయే పేదల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో ఇవి ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి."

అదే సమయంలోనే బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం దామోదర్ నది వరద సమీక్షా కమిటీ వేసింది. 3 జనవరి 1944 నాడు బెంగాల్ సచివాలయం దీనికి సంబంధించి ఒక కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి దానికి అంబేద్కర్‌ను ఆహ్వానించింది. దీనిలో పాల్గొన్న బాబాసాహెబ్ అంబేద్కర్, భారత ప్రభుత్వం జల వనరుల రక్షణ, సద్వినియోగం చేసుకోవడం కోసం ఒక జాతీయ విధానాన్ని తీసుకొచ్చే యోచనలో ఉందనీ, దాని అవశ్యకతను వివరించాడు. నదులను, అడవులను కేంద్రం పరిధిలోకి తేవడం ద్వారా అంత: రాష్ట్రాల మధ్య సంభవించే నష్టాలను, భూసారని (Soil) రక్షించడం లాంటి సమస్యలను పరిష్కరించడం ఎలా తేలిక అవుతుందో వివరించాడు.

వివిధ దేశాల్లో జరుగుతున్న పరిణామాలు, భారతదేశ భౌగోళిక, పర్యావరణ తెల్సిన వాడిగా భవిష్యత్లో తలెత్తే నీటి కొరతను అధిగమించేందుకు ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించాడు అంబేద్కర్. నదుల్లో నీటిని వడిసి పట్టుకోవడం వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల్లో త్రాగు, వ్యవసాయ అవసరాల కొరతను అధిగమించమించవచ్చు అని వివరించాడు. ఇదే నేటి తరానికి అవసరం. కానీ, ఈ ప్రాజెక్టు వల్ల పర్యావణానికి ఎంత ముప్పు వాటిల్లుతుంది కూడ ముఖ్యం. ఎందుకంటే అభివృద్ధి, పర్యావరణం ఒక నాణెనానికి రెండూ ముఖాలాంటివి. ఏ వైపూ చెడిన అది చెల్లదు. కావున, ఈ లోతైన అవగాహనతో అంబేద్కర్ ఈ రెండు సబ్జెక్ట్స్‌ని (అడవులు, నీళ్ళు) రాజ్యాంగంలో ఉమ్మడి జాబితా (Article 262) 7వ Scheduleలో మొదటి (I) జాబితాలో 56వదిగా చేర్చడం జరిగింది. అంతేకాక, ప్రాజెక్టులు వరదల నుంచి రక్షణ కోసం లేదా వ్యవసాయ, విద్యుత్ అవసరాల కోసం మాత్రమే కాకుండా, జల మార్గాలను అభివృద్ధి చేయడానికి కూడా ఉపయోగించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించాడు. రైల్వేల మాదిరిగా దేశంలో వాటర్‌వేస్ (జల మార్గాలు) కూడా అభివృద్ధి చేయాలని ఆయన ఒక సమావేశంలో నూతన దృష్టి కోణాన్ని ప్రతిపాదించాడు.

దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు నిర్మాణం కోసం కేవలం WYC, CWINC, CTPB వంటి సంస్థలే కాకుండా, స్థానికంగా తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక టెక్నికల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి Mr. మాన్సింగ్ గారు నాయకత్వం వహించారు. ఇరు రాష్ట్రాల నుంచి సభ్యులు ఇందులో భాగమయ్యారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మార్గదర్శకత్వంలో, బెంగాల్, బీహార్ రాష్ట్రాలు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నాయి. ఫలితంగా, దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు భారతదేశంలో తర్వాతి బహుళార్థక ప్రాజెక్టులకు ఆదర్శంగా, దిక్సూచిగా నిలిచింది.

అంతేకాక, జలవనరులను జాతీయ పరిధిలోకి తీసుకురాకపోతే, నీటి, విద్యుత్ వినియోగంలో రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను అప్పుడే గమనించిన అంబేద్కర్, ఆ కాన్ఫరెన్స్‌లో దీనిని స్పష్టంగా వివరించాడు. అంతర్ రాష్ట్ర ప్రాజెక్టుల నిర్మాణంలో పెట్టుబడులు, లాభాల బేరీజు కారణంగా రాష్ట్రాలు ఉమ్మడి ప్రాజెక్టులపై ఆసక్తి చూపకపోవచ్చని, తద్వారా ఇలాంటి వివాదాలను రాజకీయ లబ్ధికోసం రాష్ట్రాలు వినియోగించుకొని ప్రాంతాల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రమాదం ఉందని అంబేద్కర్ హెచ్చరించాడు. ఆయన చేసిన ఈ విశ్లేషణను సమావేశపు మినిట్స్‌లో స్పష్టంగా చూడవచ్చు.

ఇది దేశ ఐక్యతకు ముప్పు కలిగిస్తుందని అప్పుడే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హెచ్చరించాడు. ఇటువంటి వివాదాలు నెలకొన వద్దంటే అడవులు, నదుల వంటి సహజ వనరులు జాతీయ పరిధిలో ఉండాల్సిన అవసరముందని ఆయన స్పష్టంగా పేర్కొన్నాడు. అయితే, అప్పట్లో ఆధిపత్య వర్గాల మనస్తత్వం వల్ల సహజ వనరులు కేంద్రీకృతమై ఉన్నదీ మరిచిపోలేం. అందుకే అనంతర రాజ్యాంగ రచనలో, అంబేద్కర్ తన దూరదృష్టిని చూపిస్తూ అడవులు, అంతర్ రాష్ట్ర ప్రాజెక్టులను 7వ షెడ్యూల్ (ఉమ్మడి జాబితా)లో చేర్పించాడు.

మార్చి 1944లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆమోదించిన సెంట్రల్ వాటర్‌వేస్ అండ్ ఇరిగేషన్ కమిషన్ (CWINC)ను, ఆయన వైస్రాయ్ ఆఫ్ ఇండియా చేత కూడా ఆమోదింపజేసి, 1946 ఏప్రిల్ 5వ తేదీ నుంచి అధికారికంగా స్థాపించారు. దామోదర్ వ్యాలీ, సోనీ నది వంటి బహుళార్థక ప్రాజెక్టులలో తలెత్తే సమస్యలను పరిష్కరించి, ఈ సంస్థ ద్వారా వాటి నిర్మాణాన్ని అంబేద్కర్ ముందుకు నడిపించాడు. దేశ అభివృద్ధికి ఒక ప్రఖ్యాత ఇంజనీర్‌లా తన శక్తి యావత్తూ ధారపోశాడు. అయినప్పటికీ, దేశ సమగ్రాభివృద్ధికి ఇంతగా కృషి చేసిన బాబాసాహెబ్‌ను ఈ దేశ అధికార వర్గాలు, సంస్థలు, చరిత్రకారులు కేవలం పీడితుల నాయకుడిగా మాత్రమే గుర్తించి, జాతీయ నాయకుడిగా (Statesman) గుర్తించడానికి మనసొప్పలేదు. అయితే, ప్రపంచం మాత్రం ఆయన గౌరవాన్ని సమగ్రంగా గుర్తించింది.

తరువాత తలపెట్టిన బహుళార్థక హిరాకుడు ప్రాజెక్టు నిర్మాణానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎంతో మద్దతు ఇచ్చాడు. 1858లో అర్థర్ కాటన్ ఒరిస్సాలోని మహానదిని సందర్శించి, వరదల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు ఇచ్చాడు. 1928 నుండి 1935 వరకు అనేక కమిటీలు ఈ అంశంపై రిపోర్టులు అందించాయి.

చివరికి, 1937లో ప్రముఖ ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య (Sir. M.V.)కు హిరాకుడు ప్రాజెక్టు రిపోర్టును రూపొందించే బాధ్యత అప్పగించారు. 1938లో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రాథమిక రిపోర్టు సమర్పించారు. అనంతరం, ఆయన రెండు మధ్యంతర (Interim) రిపోర్టులు ఇచ్చి, చివరకు 1945లో తుది రిపోర్టును సమర్పించారు. అప్పుడు ఒరిస్సా ప్రభుత్వం, ఆ రాష్ట్ర ప్రముఖ జాతీయ నాయకుడు "హెచ్. కే మహాటాక్" కూడా అంబేద్కర్‌ని కలిసి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందిగా కోరారు. వాళ్ళ అభ్యర్థన మేరకు 8 నవంబర్ 1945లో మినిస్టర్ ఆఫ్ లేబర్ డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ద్వారా ఓ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశాడు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఈ ప్రాజెక్టును ఏ కోణంలో చూడాలో, సైట్ లొకేషన్ ఎంపికకు ప్రధాన కారణాలు ఏమిటో, అలాగే ఒరిస్సాలో పేదరిక నిర్మూలనకు ఇది ఎలా దోహదం చేస్తుందో స్పష్టంగా వివరించాడు. అందుకే, ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆయన ఆ సభలో హృదయపూర్వక విజ్ఞప్తి చేశాడు. డాక్టర్ అంబేద్కర్ చొరవతో నిర్మాణం పూర్తయిన ఈ ప్రాజెక్టు 1953లో తుదిదశకు చేరుకొని, 1957లో అధికారికంగా ప్రారంభించబడింది.

సెంట్రల్ గవర్నమెంట్ లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లోని సోనే నది లోయ ప్రాజెక్టు పూర్తి చేయబడింది. సోనే నది మధ్యప్రదేశ్‌లో పుట్టి, ఉత్తరప్రదేశ్‌లో గంగా నదిలో కలుస్తుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలోని లేబర్ డిపార్ట్‌మెంట్ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఇచ్చి, నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. రాష్ట్రాలు పరస్పర సహకారంతో చేపట్టిన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అంబేద్కర్ విజ్ఞప్తి చేశాడు. వ్యవసాయేతర అవసరాలకు నీటి వినియోగం విషయంలో సెంట్రల్ యుటిలైజేషన్ బోర్డ్ / కమిషన్ విచారణలు, అలాగే CWINC మరియు CTBP వంటి సంస్థల ప్రణాళికలను త్వరితగతిన అమలు చేయాలని అంబేద్కర్ సూచించాడు.

CWINC మరియు CTBP స్థాపన భారతదేశపు జలవనరులను రక్షించి, పొదుపుగా వినియోగించి, భవిష్యత తరాలకు అందించేందుకు వేసిన మొదటి అద్భుతమైన అడుగు. నీటి కొరత సంభవించే పరిస్థితిని ముందుగానే ఊహించి, నదులపై బహుళార్థక ఆనకట్టల నిర్మాణం, భూసార పరిరక్షణ, నీటి సమర్థ వినియోగంపై ఒక ఇంజనీర్, శాస్త్రవేత్తలా ఆలోచించి అమలు చేసినవాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్.

అయితే... ఇంజనీరింగ్ రంగంలో దేశపు అత్యున్నత సంస్థగా పరిగణించబడే ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, ఇండియా (IEI) ఏనాడు అంబేద్కర్ సేవలను గుర్తించి; ఆయనకు సంబంధించిన స్మారక ఉపన్యాసాలు – Memorial Lectures) నిర్వహించి గౌరవించాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉన్నది.

అభివృద్ధికి సహజ వనరులకు అవినాభావ సంబంధం ఉందని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఆనాడే గుర్తించి చెప్పారు. Guiding principlesలో ఆయన సూచించినట్లుగా, ప్రభుత్వం ట్రస్టీగా మాత్రమే ఉండాలి, అంటే ప్రజల ప్రయోజనాలను సమగ్రంగా చూసే బాధ్యత ప్రభుత్వం మీదనే ఉంటుంది. వర్గాలుగా, కులాలుగా, మతాలుగా విభజించబడిన ప్రజలను సామాన్యంగా ఒక సమాన ఆర్థిక స్థితికి తీసుకు రావడం కష్టం. అయితే, జల వనరుల సమర్థ వినియోగం (సహజ వనరులు) ద్వారా, జల మార్గాల ఆధారంగా ఖచ్చితమైన ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మి, ఈ విధానాన్ని అచరించి అమలు చేసిన జాతీయ జల విధానాన్ని రూపకల్పన చేసిన దార్శనికుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్.

## References:


1. Dr. Babasaheb Ambedkar (1989), Writings and Speeches, States and Minorities, Government of Maharashtra, Vol 1, 1989.
2. M.L.Ranga (1994), B.R. Ambedkar, Work and Relevance, Nagpur.
3. http://www.news18.com/news/politics/dr-ambedkar-also-the-architect-of-water-rivernavigation-policy-modi-1229581.html.
4. Ambirajan, S. (1999), Dr. Ambedkar's Contributions to Indian Economics, Economic and Political Weekly (EPW), November, 20.
5. K. Sateesh Reddy &P.Ramaiah(Ed), (1994), Dr. B.R. Ambedkar's Economic Philosophy, Delta Publishing House, New Delhi.
6. Dr. NarendraJadhav (1991), Dr. Ambedkar's Economic Thought and Philosophy, Popular Prakashan, Mumbai.
7. SukhadeoThorat (1998), Ambedkar's Role in Economic Planning and Water Policy, Shipra Publications, New Delhi.
8. http://www.urbannewsdigest.in/?p=21434.
9. Times of India, Dec.07, 2016. New Delhi
10. http://presidentofindia.nic.in/speeches-detail.htm?327


T

# పేద, మధ్యతరగతి జీవితాల్లో ఆశించిన మార్పులు కనిపించటం లేదు - డా. చిట్టేడి కృష్ణారెడ్డి

ఇంటర్వ్యూయర్: బి. మహేష్

*మన జీవితాల్లో లెక్కలు ఎలా ముడిపడి ఉంటాయో, అలాగే మన జీవనవిధానంలో మిళితమై ఉండే ఆర్థికపాఠాలు అంతే ముఖ్యమైనవి. తెలంగాణ అంటేనే అక్షరాస్యతలో వెనుకబాటుతోపాటు, కుటుంబాలు ఆర్థికంగా చితికి ఉంటాయి. అలాంటి ఆర్థిక పాఠాలను జీవితంలో భాగం చేసుకుని, నేడు ఆర్థికశాస్త్రంలోనే అంతర్జాతీయస్థాయిలో నిపుణులైన డాక్టర్ చిట్టేడి కృష్ణారెడ్డితో నడుస్తున్న తెలంగాణ మాస పత్రిక తరుపున బి. మహేష్ నిర్వహించిన ముఖాముఖి...*

**1. నమస్తే సర్, మీ కుటుంబ, విద్యాభ్యాస నేపథ్యాలను వివరించండి.**

నాపేరు చిట్టేడి కృష్ణారెడ్డి. చిట్టెడ్డి బుచ్చిరెడ్డి-పుష్పమ్మలకు రెండవ సంతానం నేను. మాది యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామం. సాధారణ రైతు కుటుంబంలో పుట్టాను. పాఠశాల విద్యాభ్యాసం మొత్తం పులిగిల్ల ప్రభుత్వం పాఠశాలలోనే పూర్తి చేశాను. తర్వాత ఇంటర్మీడియట్ ప్రగతి జూనియర్ కళాశాల, డిగ్రీ శ్రీలక్ష్మీనరసింహస్వామి కళాశాలలో చదువుకున్నాను. ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ ఆర్థికశాస్త్రం, ఎం.ఫిల్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, పీహెచ్డీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ-సిడిఎస్ ద్వారా సాధించాను.

ప్రస్తుతం యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ లో ఆర్థికశాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. అంతకుముందు తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఐఎంటీ హైదరాబాద్‌లో, కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకుడిగా సేవలందించాను.

భారతీయ అర్థగణిత సంఘం (The Indian Econometric Society), న్యూఢిల్లీవారు నేను ఆర్థికశాస్త్రంలో చేస్తున్న పరిశోధనలను గుర్తించి, ప్రొఫెసర్ ఎం. జె. మనోహర్ రావు యంగ్ ఎకనమిస్టు అవార్డు (2015)ను అందించారు. అలాగే, కేరళలోని డెవలప్‌మెంట్ స్టడీస్ సెంటర్ వారు ప్రొఫెసర్ కె. ఎన్.రాజ్ టీచర్ ఫెలోషిప్ (2016)ను మంజూరు చేయడం నాలో మరింత ఉత్సాహం కలిగింది.

అంతర్జాతీయ ఖ్యాతిగల జర్నల్స్, కాన్ఫరెన్స్ ప్రొసీడింగ్స్‌లో అనేక పరిశోధనా వ్యాసాలను ప్రచురించాను. నేను రాసిన మూడు గ్రంథాలు ప్రచురితమయ్యాయి. ఇండియాతోసహా ఫ్రాన్స్, రష్యా, టర్కీవంటి దేశాల్లో జరిగిన జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో నేను చేసిన పరిశోధనలను సమర్పించాను. నా వ్యాసాలకు ఇప్పటివరకు 2150కుపైగా ఉల్లేఖనలు (citations) లభించాయి.

ప్రస్తుతం South Asian Journal of Managementకు అసోసియేట్ ఎడిటర్‌గా, అనేక జర్నల్స్‌కు ఎడిటోరియల్ బోర్డ్ సభ్యుడిగా, రివ్యూయర్‌గా సేవలందిస్తున్నాను. నా దగ్గర నాలుగు పీహెచ్‌డీ, రెండు ఎంఫిల్ విద్యార్థులకు గైడ్‌గా పనిచేశాను. అలాగే, యాభైమంది మాస్టర్స్ డిసర్టేషన్లకు మార్గదర్శకత్వం వహించాను. విద్యా, పరిశోధనా రంగాలలో విస్తృత అనుభవంతో దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ సంస్థల్లో 200కి పైగా ఆహ్వానిత లెక్చర్లు ఇచ్చాను. వివిధ పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా కూడా సేవలందిస్తున్నాను. అంతేకాక, తెలుగు ప్రముఖ దినపత్రికలకు కాలమిస్టుగా రచనలు చేస్తూ, ప్రస్తుత ఆర్థిక, సామాజిక అంశాలపై టీవీ చర్చల్లో తరచుగా పాల్గొంటున్నాను.

ఇండియన్ ఎకనోమెట్రిక్ సొసైటీ, ఇండియన్ అసోసియేషన్ ఫర్ ఎనర్జీ ఎకనామిక్స్, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ సస్టైనబిలిటీ (ISDS), వరల్డ్ ఎకనామిక్ అసోసియేషన్ వంటి పలు గౌరవనీయ సంస్థలకు జీవితకాల సభ్యుడిగా ఉన్నాను. ప్రస్తుతం 20కిపైగా అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్‌కు సమీక్షకుడిగా (reviewer) పనిచేస్తూ, 9 అంతర్జాతీయ జర్నల్స్‌కు ఎడిటోరియల్ బోర్డ్ సభ్యుడిగా ఉన్నాను.



**2. సాంకేతిక వినియోగంలో ప్రజలమధ్య వ్యత్యాసాలు ఏర్పడితే, అది ఆర్థికవ్యత్యాసాలకు దారితీస్తుందా?**

చాలా మంచి ప్రశ్న ఇది. ఈ మధ్యకాలంలోను గ్రామీణ ప్రాంతాలకి, పట్టణ ప్రాంతాలకి మధ్య ఈ సాంకేతిక వినియోగంలో అసమానతలున్నాయి. నేడు పల్లెల్లో అక్షరాస్యత పెరగడం వల్ల సాంకేతికతను అధికంగానే వినియోగించు కొంటున్నారు. కానీ పట్టణాలతో పోల్చినప్పుడు కాస్త అసమానతలు ఉన్న మాట వాస్తవమే. నగరాలు కొత్త సాంకేతికను అందుకోవడంలో ఎప్పుడు ముందే ఉంటుంది. సాంకేతిక విషయంలో రాబోవు రెండు, మూడు సంవత్సరాలలో పెనుమార్పులు రాబోతున్నాయి. యువత సాంకేతిక పరిజ్ఞానం అందుపుచ్చుకునే సమయంలో ఆ టెక్నాలజీ మారిపోయి, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం మార్కెట్లోకి వచ్చేస్తుంటాయి. వాటిని అందుకోవటంలో కూడా వెనకబాటుతనం కనిపిస్తుంది. ఈ 'టెక్నాలజీకల్ డివైడ్' అనేది దేశంలో ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగానూ, అసమానతలను పెంచడంలోనూ కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఏ యంత్రం ఒక దశాబ్దంపాటు మార్కెట్లో వినియోగంలో ఉండలేని పరిస్థితులున్నాయి. నేటికీ ప్రధానంగా ఉపయోగిస్తున్న మొబైల్, కంప్యూటర్‌వర్క్‌లో కూడా ఆధునాతనమైన సౌకర్యాలతో అందుబాటులోకి వచ్చినప్పటికీ, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించు కోవడంలో వెనక బడిపోయారని చెప్పటంలో ఎటువంటి సందేహం లేదు. వాటిని అందుకోవడంలో గ్రామీణ – పట్టణవాసుల మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఈ టెక్నాలజికల్‌లో వస్తున్నటువంటి నూతన ధోరణులను విద్యద్వారా యువకులకి అవగాహనను, నైపుణ్యాలను కల్పించినట్లయితే కాస్త సాంకేతిక అసమానతలు తగ్గే అవకాశం ఉంటుంది. సంప్రదాయ ఇంటర్నెట్, మొబైల్, కంప్యూటర్ బేసిక్ ప్రోగ్రామ్‌లే కాకుండా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రోబోటిక్ టెక్నాలజీ. బ్లాక్‌చైన్ టెక్నాలజీలతోపాటు ఇంకా కొత్తకొత్త కోర్సులను ప్రవేశపెట్టాలి. వీటివల్ల ఉద్యోగకల్పన, వ్యాపారధోరణి. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడంవంటి స్థూల మార్పులద్వారా ఆర్థికఅక్షరాస్యత పెంపొందించబడుతుంది.

**3. కెరియరిజం, కన్జ్యూమరిజంవల్ల యువత సామాజికస్పృహ కోల్పోతున్నారన్న వాదన ఉంటూ వస్తుంది. అది ఎంతమేరకు వాస్తవం?**

సమాజంలో వినియోగప్రవృత్తిని పెంచడంకోసం, ఉత్పత్తిదారులు వినియోగదారులను ఆకర్షించుట కోసం మనం తినే ఆహారం దగ్గర్నుంచి, అన్ని రకాల వస్తువులను, సులభ వాయిదా పద్ధతుల్లో కొనుగోలు చేయడానికి అవకాశం ఇస్తున్నారు. తద్వారా ప్రజలు అనేక రకాలైన వస్తుసేవలను నేటికాలంలోనే వినియోగించుకోవడం కోసం, భవిష్యత్తు

ఆదాయ అంచనాలు వేసి, బ్యాంకులోనుంచి రుణ సదుపాయాన్ని పొందుతున్నారు. తద్వారా వినియోగ ఆధారితప్రవృత్తి తీవ్రంగా పెరుగుతుంది.

గతంలో మనం చూసుకున్నప్పుడు ఒక 100 రూపాయలు సంపాదిస్తే, దాదాపు యాభై రూపాయలు పొదుపు చేసుకునే అవకాశం ఉండేది. ఎంత ఆదాయం వచ్చిన ఆ పొదుపు పెట్టుబడుల రూపంలో ఎక్కడో ఒకచోట పెట్టుబడి పెట్టుకొని ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉండేది. కానీ నేడు మారిన జీవన పరిణామ పరిస్థితులవల్ల లేకుంటే సమాజంలో వస్తున్న పోటీ ప్రపంచంవల్ల, వినియోగదారులను ఒక మాయలో ముంచేసి పూర్తిగా పొదుపురేటు తగ్గడంతోపాటుగా ముఖ్యంగా ఆ ప్రస్తుత సమయానికి వినియోగించే వస్తువులపైనే విపరీతమైనటువంటి వ్యామోహాన్ని మార్కెటు వ్యాపారవర్గాలు తీసుకువస్తున్నాయి. ఇవాళ పూర్తిగా మనకు కొత్తగా పెట్టుబడి పెట్టడానికి వనరులు లేకపోవడం. కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కాకపోవడం ప్రధాన కారణంగా చూడవచ్చు. మనం వీటికి ఎక్కడో పెద్దపెద్ద నివేదికలు పరిశీలించాల్సిన అవసరం లేదు. మన గ్రామీణ ప్రాంతాలు చూసుకున్నప్పటికీ ఇవాళ వచ్చినటువంటి ప్రతి ఆదాయాన్ని ఆహారపదార్థాలపైన లేకుంటే వివిధ రకాల మత్తుపానీయాలు, లైఫ్‌స్టైల్‌వంటి విలాసాలకు ఖర్చైపోవడం జరుగుతువుంది. వచ్చే ఆదాయాన్ని ఆ సంవత్సరము, ఆ నెలలోనే ఖర్చు చేసేవిధంగా వ్యాపార ప్రకటనలు, సామాజిక పరిస్థితులు వచ్చేశాయి. ఈ కన్జూమరిజం పెరగడంవల్ల రాబోయే రోజుల్లో మరింత గడ్డుపరిస్థితి రాబోతుంది. ఎందుకంటే ఒక కష్టకాలం కుటుంబానికి ఆర్థికంగా వచ్చినప్పుడు నిలదొక్కుకోవడానికి ఏ రకమైన పొదుపు లేకపోవడం ప్రధాన సమస్య. ప్రజలకు కొంత అవగాహన కల్పించేటువంటి బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇన్స్టిట్యూషన్స్, స్థానికప్రభుత్వాలు, రాష్ట్రప్రభుత్వాలు అవగాహన తీసుకొచ్చే కార్యక్రమాలు చేసినట్లయితే కుటుంబాలను ఆదుకోవడంతోపాటు, కేంద్రరాష్ట్రాలు ఆర్థికపరిస్థితిని నిలదొక్కుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఇప్పుడు అమెరికాలో చూసుకున్నట్లయితే అమెరికాకు ఉన్నటువంటి అప్పులు ప్రధానంగా ఆ దేశంలో ఉన్న ప్రజలనుంచి అప్పులు తీసుకొని పెట్టుబడులు పెడుతున్నటువంటి క్రమాన్ని చూస్తున్నాం. ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో రుణభారం భారంగా మారినప్పుడు, రుణాలన్నీ కూడా దేశీయ మార్కెట్లోనుంచి పొందడంద్వారా ఒత్తిడి ఉండదు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎక్కువగా అంతర్జాతీయ రుణాలపై ఆధారపడడంతో, విపత్కర పరిస్థితుల్లో అవి మరింత ఇబ్బంది కరంగా మారి ఆర్థికవ్యవస్థ ఒడిదుడుకులు ఎదుర్కోవడానికి ప్రధాన కారణం అవుతుంది. మనదేశంలో పొదుపు ప్రవృత్తి పెంచి వినియోగప్రవృత్తిని కొంత తగ్గించే విధంగా కట్టుదిట్టమైనమైన చర్యలు తీసుకురావాల్సిన అవసరం అయితే నేడు కనపడతా ఉంది.

**4. ఒకప్పుడు బంగారం కొనడం ఆర్థికవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపేది. ఇప్పుడు అదే అనుకూల ప్రభావం చూపుతుంది. దీనికి గల కారణం?**

మనందరికీ తెలుసు. బంగారానికి అంతర్జాతీయంగా తరిగిపోని విలువ ఉంటుంది. సాధారణంగా కొంతమందికి తెలిసి ఉండొచ్చు, కొంతమందికి తెలియకపోవచ్చు. బంగారం అంటే మన గ్రామీణప్రాంతాలలో ఏమనుకుంటారంటే ఆభరణాల కోసం మాత్రమే వినియోగించేదనే అపోహ ఉంటుంది. కానీ ఇవాళ మనం తీసుకున్నటువంటి మైక్రోచిప్స్, మొబైల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలలో సైతం బంగారం వినియోగిస్తారు. బంగారంద్వారా వివిధ రకాలైనటువంటి కాంతిప్రవాహాలు, విద్యుత్‌ప్రవాహాలు, రేడియేషన్స్ ఏవైతే ఉంటాయో అవన్నీ చాలా ఈజీగా వెళ్లేటువంటి అవకాశం ఉంటుంది. బంగారం అనేది ఎలక్ట్రానిక్ ప్రపంచంలో అత్యంత డిమాండ్ ఉన్నటువంటి లోహం. భారతదేశంలో సగటు కుటుంబం 50 నుంచి 200 గ్రాముల వరకు బంగారాన్ని ఆభరణాల రూపంలో ఉంచుకోవడానికి ఎంతో మక్కువ చూపిస్తారు. బంగారాన్ని ధరించడం సామాజిక గౌరవమే కాకుండా క్లిష్ట సమయాలలో ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి, అత్యవసర పరిస్థితుల్లో బంగారాన్ని అమ్మి తమ జీవితాలను కాపాడుకుంటున్నారు.

బంగారు మీద రుణాలను బ్యాంకులు అతి సులువుగా ఇవ్వటమే కాకుండా, అతి తక్కువ వడ్డీరేటు ఇవ్వటంతో అనేకమంది బంగారాన్ని కూడా కుదువ పెట్టడానికి ఎంతగానో ఆసక్తి కనబరుస్తున్నారు. కష్టకాలంలో బంగారం నిలువలు ప్రతి కుటుంబానికి ఎంతో బలాన్ని ఇస్తున్నాయి.

అదేవిధంగా రిజర్వ్‌బ్యాంక్ మనకు గతకాలంలో చాలా బంగారు నిలువలను పెంచుకోవడం జరిగింది. బంగారం సామాజికంగా, అవసరాల నేపథ్యంలో ప్రముఖపాత్రను పోషిస్తుంది. ఆర్థికంగా అత్యవసరకాలంలో కచ్చితంగా ఆదుకోవడానికి ఒక సాధనంగా ఉపయోగపడుతుంది.

**5. ఆర్థికపురోగతికి, సామాన్యుల అస్తిత్వానికి మధ్య వివాదం నెలకొని ఉన్నప్పుడు వాస్తవంగా ఎటువైపు నిర్ణయం తీసుకోవాలి?**

మనకు ఎప్పుడైనా, ఏ ఆర్థికాభివృద్ధయినా సామాన్యుడికి ఆర్థికంగా బలోపేతాన్ని చేకూర్చలేనప్పుడు ఆ వృద్ధికానీ, అభివృద్ధికానీ దేనికి పనికిరానిదని చెప్పవచ్చు. ముఖ్యంగా భారతదేశంలాంటి దేశంలో దాదాపుగా 60% నుంచి 70% వరకు ప్రజలు తక్కువ మధ్యస్థాయి ఆదాయాలు కలిగినటువంటి వాళ్లే. ఐదవస్థానంలో మన ఆర్థికవ్యవస్థ నెలకొందని చెప్పుకుంటున్నప్పటికీ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో ఆశించినమేరా మార్పులు కనిపించటం లేదు. అంటే కనీస విద్యా, వైద్య, గృహాలాంటి సౌకర్యాలు ఒక పద్ధతిగా బ్రతకగలిగేటువంటి ఆర్థికవనరులు పొందేవిధంగా అవకాశాలు లేనప్పుడు, ఆ వృద్ధిరేటు సాధారణంగా హర్షించదగ్గది కాదు. ఇవాళ మనం చైనాలాంటి దేశంలో అదే చూస్తున్నాం. ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోయాయి. వృద్ధిరేట్‌లో అది ప్రపంచ దేశాలలోనే అగ్రగామిగా ఉన్నప్పటికీ అసమానతల విషయంలో కూడా చాలా భారీగా ఉన్నది. భారత్, చైనాలాంటి దేశంలో వృద్ధిరేటు అత్యధికంగా పెరుగుతున్నప్పటికీ, ఆదాయ అసమానతలు కూడా అదేస్థాయిలో పెరుగుతూ ఉండటం కొంత ఆందోళన కలిగించే అంశం. థామస్ పికటి, ఆక్స్ఫామ్‌లాంటి అధ్యయనాలు కూడా భారత్ మరియు ఇతర అభివృద్ధి చెందిన దేశాల రిపోర్ట్‌లో ప్రజలమధ్య అసమానతలు చాలా పెరిగిపోయినటువంటిది స్పష్టంగా పేర్కొనడం జరిగింది.

భారతదేశంలో ఈ అసమానతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వృద్ధిరేట్ పెరుగుదలతోపాటుగా ఈ క్రోని క్యాప్టలిజం గతంలో కేవలం కొంతమంది క్యాప్టలిస్ట్‌ల చేతుల్లో ఉండేది. ఇవాళ గ్రూప్ ఆఫ్ క్యాప్టలిస్ట్‌లు తయారయ్యారు. అప్పుడు ఒక 10 మంది ఉంటే ఇప్పుడొక 500 మంది క్రోని క్యాప్టలిస్ట్‌లు తయారయ్యారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైనటువంటి పరిస్థితి నెలకొంది. ఇలాంటివన్నీ ఏ దేశంలో ఆర్థికస్థిరత్వాన్నికానీ, ఆర్థిక సమృద్ధిని కానీ ఇవ్వవు. ఎందుకంటున్నానంటే ఈ మాట ఈ మధ్యకాలంలో చాలా నివేదికలు చూశాం. ఈ దేశంలో ఉన్నటువంటి సంపన్నవర్గాలు, వ్యాపారవర్గాలు ఈ దేశం వదిలి ఇతర దేశాలకు వెళ్ళి పోతున్నారు. మరి రాబోయే రోజుల్లో మిగిలిన రెండునుంచి మూడు శాతం సంపన్నవర్గాలు ఏ కారణాలరీత్యాయినా దేశాన్ని వదిలి వెళ్ళిపోతే, మరి వాళ్ళ ఇంత సంపద కేంద్రీకృత మైనటువంటి వీళ్ళు వెళ్లిపోతే భారతదేశం పరిస్థితి ఏంటి? వారు పెట్టిన పెట్టుబడులు, వ్యాపార సామ్రాజ్యం, వారికి వ్యక్తిగతంగా వచ్చే నష్టంకన్నా దేశానికి జరిగేటువంటి నష్టం భారీగా ఉంటుంది. ఈ అసమానతలను తగ్గించాలి. ఆర్థికసమానత్వం అనగానే కొంతమందిలో వాదన వస్తుంది. మాకు మేము కష్టపడి పనిచేస్తున్నాం. మా పేదోడికి మాకు ఒకే రకమైనటువంటి జీవనవిధానం ఎలా ఉంటుందంటే ఇక్కడ సమానత్వం అనగానే ఆ అసమానత్వం కాకుండా కనీస సౌకర్యాలు, అవసరాలు ఉంటాయో వాటిని తీర్చుకోగలిగే ఒక పద్ధతిగా తమ శక్తితో బతకగలిగే జీవనప్రమాణాలని అందించగలడం. ఆ దాంట్లో రిలేటివ్ వేరియేషన్స్ ఉంటే ఉండొచ్చు. కానీ కనీస భద్రత, కనీస జీవనప్రమాణాలు ఉంటాయో దాన్ని కోరుకుంటాం. దేశ ఆర్థికాభివృద్ధిలో మనం సమానత్వానికి కృషి చేయడానికి కావాలసిన ఆలోచనలు, ప్రణాళికలు చేయవలసిన అవసరం ఉంది. నేడు ప్రభుత్వాలు సంపదకి కేంద్రీకృతం కావడంద్వారా సంపదను సృష్టించిన తర్వాత పంచుతామని చెబుతున్నప్పటికీ, సంపద, పంపిణీ అనేటువంటిది ఆశించినస్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు. అందుకనే భారతదేశంలో చెప్తున్న నివేదికలు దాదాపుగా ఒక 60 నుంచి 70 కోట్ల మందికి మేము పిడిఎస్‌ద్వారా రేషన్ ఇస్తున్నామని చెప్తున్నా ఇవాళ రాష్ట్రప్రభుత్వాలు కోటి నుంచి రెండు కోట్ల మందికి ఆహారభద్రత కల్పిస్తున్నామని చెప్తుండడం ఆహ్వానించదగ్గదే అయినా లోతుగా ఆలోచించినప్పుడు వీళ్ళంతా కూడా పేదోళ్లేనా? ఇన్ని సంవత్సరాల దేశ ఆర్థికాభివృద్ధిలో ఇంకా ఇంతమంది ఆహారభద్రతకార్డుల కోసం ఎదురుచూస్తూ ప్రభుత్వాలు ఇచ్చే సాయాన్ని పొందుతూ జీవనప్రమాణాలు కొనసాగిస్తుండటం కొంత ఆందోళన కలిగించే ఇబ్బందికరమైన పరిస్థితి. అందువల్ల పరిస్థితులలో మార్పులు రావాలి. ప్రజలను కార్యోన్ముఖులను చేసి ఉత్పత్తిలో, ఉత్పాదకతలో పాలుపంచుకునే విధంగా కార్యక్రమాలు చేయాల్సినటువంటి అవసరం ఉంది.

**6. రాజీవ్‌గాంధీ పిరియడ్‌నుంచి ఆర్థికవేత్తలకు పెద్దపీట వేస్తూ వస్తున్నా, పి.వి. నరసింహారావునుంచి ఆర్థికవేత్తలు తీసుకుంటున్న నిర్ణయాలు దేశభవిష్యత్‌కు ఉపయోగపడుతున్నయేనా? ఈ ఆర్థిక నిర్ణయాలు ప్రపంచదేశాలతో పోటిపడగలిగే విధంగానే ఉన్నాయా?**

ఎప్పుడైతే ఆ సబ్జెక్ట్‌లో నిష్ణాతులచేత ఆర్థికప్రణాళిక, ఆర్థిక రచనలు చేయగలిగి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్ళగలిగినప్పుడు సత్ఫలితాలను ఇస్తాయి. 1991లో లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్ తీసుకొచ్చిన సందర్భంలో అనేక

విమర్శలు ఉన్నవి. ఉద్యోగాలు కోల్పోతాము. పేద దేశాలు కాబట్టి పరిశ్రమలు లేదా కుటీర పరిశ్రమలన్ని మూతపడి పోతాయనేటటువంటి భయాందోళనలు వ్యక్తమయ్యాయి. తర్వాత కొద్దికాలంలోనే అవన్నీ పటాపంచలు అయిపోతూ ఉపాధి అవకాశాలను పెంచింది. ఆర్థికాభివృద్ధిని తీసుకొచ్చింది. ప్రజల సగటు జీవనప్రమాణం పెరిగింది. దానితోపాటు అసమానతలు పెరిగాయి. కానీ మనకు ముఖ్యంగా వీటిలో చూడాల్సిందేందంటే ఆర్థికవేత్తలను కాలక్రమేనా కేవలం ఉత్సవ విగ్రహాలుగా రాజకీయపక్షాలు చేస్తూ ఉండడం మనం గమనిస్తున్నాం. కేవలం ఓటుబ్యాంకు ఆధారిత రాజకీయాలకే పెద్దపీట వేస్తున్నారు. ఇప్పుడు ఏమవుతుందంటే చాలామంది ఎలక్షన్స్ స్ట్రాటజీల పేర్లతో ప్రజల బలహీనతలపైన, ప్రజలు ఏ అంశాలను స్పృశిస్తే ఎక్కడైతే ప్రకటనలు, ఆర్థిక వనరులు ఇస్తామని చెప్తే ఓట్లు వేయగలుగుతారనే వాటిపైన ఫోకస్ చేస్తూ చేయడంద్వారా ఆశించినమేరకు ఫలితాలు రావట్లేదు. గతంలో మనకు ఆర్థికమూలాలపైన ఆర్థిక అవసరాలపైన ప్రభుత్వాలు బడ్జెట్లో ప్రవేశపడితే నేడు కేవలం ప్రతి బడ్జెట్లో ఎన్నికల రూపంలో ప్రజలను ఏ విధంగా ఆకర్షించాలి, ఆ ఆకర్షణలలో ఆచరణకన్నా, మభ్యపెట్టడానికి అత్యంత ప్రాధాన్యత రాజకీయపరంగా ఇవ్వాల్సిన నేపథ్యంలో ఆర్థికవేత్తల అవసరాలు పూర్తిగా తగ్గిపోతున్నట్టుగా లేకుంటే వారి ఆలోచనలు కావచ్చు లేదంటే వాటిన్నంటిన్ని కూడా ఆచరణలో పెట్టే పరిస్థితి నేడు పూర్తిస్థాయిలో అంతగా కనిపించట్లేదు. ఇవన్నీ కూడా ప్రజలు గమనించాల్సిన అవసరం ఉంది. రాజకీయ నాయకులు చేసే ఎత్తుగడలున్నాయి. ఆర్థికవేత్తల సలహాలు, సూచనలు చేయగలరేకానీ, దాని అమలుచేయాల్సిన అవసరం పూర్తిగా రాజకీయ నాయకుల చేతుల్లో, ప్రభుత్వ అధికారుల చేతుల్లో ఉంటుంది. ఉదాహరణకు ఇవాళ తెలుగు రాష్ట్రాలలో చూసుకున్న ముఖ్యంగా తెలంగాణలో కూడా ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రస్థాయిలో ఉన్నటువంటి ఆర్థికసంఘంగానీ, రాష్ట్రస్థాయిలో ఉన్న ప్రణాళికసంఘాలుగానీ పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. గత పది, పదిహేను సంవత్సరాలకాలంలో రాష్ట్రాలు ఏర్పడి విభజన జరిగిన తర్వాత ఎక్కడ కూడా ఉన్నటువంటి మేధావులచేత సరైన సూచనలు, సలహాలు తీసుకొని ఆర్థికప్రగతిని, రాష్ట్ర పురోగతిని ప్రణాళికలు చేయడానికన్నా, రాజకీయ నాయకుల ఆలోచనలకు ప్రతిరూపంగానే వాటిని ఆచరణలోకి తీసుకురావడంద్వారా స్వల్పకాలిక ఉపశమనమే తప్ప దీర్ఘకాలికంగా ప్రజలకు ఉపశమనాన్ని కలిగించే పథకాలుగానీ, ప్రయోజనాలుగానీ కనపడటం లేదు. ఎం.ఎస్. స్వామినాథన్ కమిటీ ఇచ్చిన నివేదికలు మనకు రెండు దశాబ్దాలు కావస్తున్న ఇప్పటికీ ఆ సంస్కరణలు నేటికి పూర్తిగా అమలు చేయలేదు. అలాంటి కమిటీలు మళ్లీ ఇప్పుడు మారిన జీవనపరిస్థితులు, ప్రపంచీకరణ, వ్యవసాయరంగం, కుటీర పరిశ్రమలు, పారిశ్రామికరంగంలో అనేక మార్పులు వస్తున్నటువంటి నేపథ్యంలో పూర్తిస్థాయి విశ్లేషణ చేయాలి. ముఖ్యంగా రాష్ట్రాలు, దేశాలు చేస్తున్న అప్పులపైన, పూర్తిస్థాయిలో నిపుణుల కమిటీల ఆధ్వర్యంలో ప్రమాదకరస్థాయిలో ఉన్నామా ఉంటే ఏ రకంగా తగ్గించుకోవచ్చు. ఏ విధంగా దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లగలుగుతున్నమనేటువంటిది కావాలి. రాజకీయాలతో సంబంధం లేనటువంటి నిపుణుల కమిటీద్వారా కొన్ని సలహాలు, సూచనలు తీసుకొని ఇటు కేంద్రంగానీ, రాష్ట్రంగానీ చేసినట్లయితే భారం తగ్గి, లాభాలుగానీ, ఫలితాలు ఎక్కువ రావడానికి అవకాశం ఉంది.

**7. సాంకేతికత సామాన్యుని చెంతకుచేరి, స్టాక్‌మార్కెట్ దరికి వచ్చింది. ఇది మంచి పరిణామమేనా?**

సాంకేతిక పరిజ్ఞానం భారీగా పెరిగిపోవడంతో సామాన్యులకు సైతం చాలా మార్కెట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులోకి వచ్చింది. బ్యాంకులు మరియు ఇతర ఆర్థికసంస్థల ప్రచారము మరియు అవగాహన కార్యక్రమాలతో స్టాక్‌మార్కెట్లో పెట్టుబడి పెట్టడానికి అవగాహన కార్యక్రమాలకు అనేకమంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఎప్పుడైతే సామాన్య రిటైల్ ఇన్వెస్టర్ పాక్షికంగా చదువుకున్నవాళ్ళుకానీ లేకుంటే ఒక పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసిన వాళ్లు సైతం మార్కెట్ అర్థం చేసుకునే పరిస్థితి అనేది ఇప్పుడున్న పరిస్థితులలో పూర్తిగా లేదు. మార్కెట్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టండి. మాకు మార్కెట్‌లో పెడితే మీకు రిటర్న్స్ ఎక్కువగా ఉంటాయన్నప్పటికీ, నేటికి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. మార్కెట్‌పైన పూర్తిగా అవగాహన లేకపోవడంతో భారీగా నష్టాలు చూస్తున్న పరిస్థితి నెలకొని ఉన్నది. ఈ ఆర్థిక అక్షరాస్యతనేది పెంచాలి. ఔత్సాహికమైన పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఆర్థికనిధులు మార్కెట్‌ద్వారా సమీకరించుకోవడానికి ఆస్కారం ఉంటుంది. బ్యాంకులాంటి ఇంటర్మీడియట్ వ్యవస్థ లేకుండా నేరుగా ఎవరైతే ఉత్పత్తి చేయాలనుకుంటున్నారో వారికి నగదు లభిస్తుంది. అదేవిధంగా పెట్టుబడి పెట్టుకున్న వాళ్ళ మార్కెట్లో పెట్టుబడిద్వారా కొంత అధిక ఆదాయాన్ని

ఆర్జించడానికి అవకాశం ఉంటుంది. కానీ నేడు ఉన్నటువంటి పరిస్థితులలో ఫైనాన్షియల్ అక్షరాస్యత ఇంకా పెద్దఎత్తున అవగాహన తీసుకురావాలి. మార్కెట్‌పైన పూర్తిస్థాయి అవగాహన కలిగిస్తే ఖచ్చితంగా ప్రజలు ఇంకా ఎక్కువగా మార్కెట్లోకి గనుక రాగలిగితే కచ్చితంగా దేశానికి, అదేవిధంగా ఔత్సాహికమైన యువపారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

**8. మార్కెట్‌పైన సరైన అవగాహనలేనివారు సాంప్రదాయికమైన భూమి, రియల్‌ఎస్టేట్, గోల్డ్ మీద ఇంకా వేరే వాటిపైన ఒకప్పుడు పెట్టుబడి పెట్టేది. ఇప్పుడు మ్యూచువల్‌ఫండ్స్ రూపంలో ప్రోత్సాహిస్తున్నారు. ఇది సరైనదేనా?**

ఉన్నటువంటి ఆదాయంలో ఒక కుటుంబానికిగానీ, ఒక వ్యక్తికిగానీ వచ్చే ఆదాయంలో కొంతమేరకు 20 నుంచి 25%పైన పెట్టుబడి పెట్టుకోవాలిగానీ, పూర్తిగా ఏ అసెట్‌లో కూడా తెలివైన ఇన్వెస్టర్ కావచ్చు లేదా ఒక రేషనల్ ఇన్వెస్టర్ కావచ్చు ఫోర్ట్‌ఫోలియో పెట్టుబడులు పెట్టొచ్చు. మనం పూర్తిగా గోల్డ్‌లో, రియల్‌ఎస్టేట్లో పెట్టుబడి లేకుండా కేవలం మార్కెట్లోనే పెడతాం. అక్కడే రేట్ ఆఫ్ రిటర్న్స్ ఎక్కువగా ఉంటాయను కోకూడదు. ఏ రోజైనా అంతర్జాతీయ కారణాలవల్లగానీ, దేశీయ కారణాలచేత మార్కెట్లో తీవ్రమైన నష్టాలుంటాయి. ఎందుకంటే మార్కెట్ వ్యాపారంలో రిస్క్ అనేది ఎప్పుడు నడుస్తుంది. ఎలా ఉంటుందనేది చెప్పడం కొంత కష్టం. ఆ ఒడిదుడుకులు ఉండే నేపథ్యంలో మ్యూచువల్‌ఫండ్స్‌లో ఇన్వెస్ట్మెంట్ చేయడం మంచిది. నేరుగా స్టాక్‌మార్కెట్లో పెట్టడంకన్నా మ్యూచువల్‌ఫండ్స్‌లో పెట్టడం కొంత రిస్క్ తక్కువ. కాబట్టి ఏదిఏమైనా మొత్తంమీద ఒక వంద రూపాయలు వస్తే 25% మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టుకొని మిగతా వాటిల్లో కూడా పెట్టుకోవడం ఉత్తమం. ప్రపంచదేశాలలో చూస్తే అమెరికాలాంటి ఆర్థికంగా బలోపేతమైన దేశాలు, ఉన్నతవిద్య కలిగిన దేశాల్లో సైతం మార్కెట్లో పూర్తిస్థాయిలో కాకుండా అనేక రకాలుగా ఫోర్ట్‌ఫోలియోలలో పెట్టుబడులు పెట్టుకున్నప్పుడే మనకు భయం తగ్గి రిటర్న్స్ వస్తాయి. ఏదో అవకాశాలవల్ల ఒకసారి రిటర్న్స్ వచ్చాయని చెప్పేసి భారీగా ఉన్న ఆదాయాన్ని అంతా ఒకే అసెట్‌పై పెట్టినప్పుడు నష్టాలు, ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. గతంలో ఎప్పుడు మార్కెట్‌వైపు చూడనివాళ్ళు కూడా ఇప్పుడు మ్యూచువల్‌ఫండ్స్‌వైపు చూడటం మంచి పరిణామం. అది రాబోయే రోజుల్లో కొనసాగాలి. ఇంకా ఎక్కువమంది ప్రజలు కొంత అవగాహన పెంచుకోవాలి. అవగాహన లేకుండా మాత్రం పెట్టుబడి పెట్టకూడదు. మ్యూచువల్‌ఫండ్స్ ఏంటి? స్టాక్స్ ఏంటి అని తెలుసుకోవాలి. అవి ఎలా ట్రేడవుతున్నాయి. ధరల్లో ఎలాంటి మార్పులుచేర్పులు వస్తున్నాయి. ఎప్పుడు అమ్మితే లాభం. ఎప్పుడు అమ్మితే నష్టం. ఏ విధంగా రియల్‌ఎస్టేట్, గోల్డ్‌పైన ఒక అవగాహన ఉంటుందో వీటిపైన కూడా అవగాహన పెంచుకున్న తర్వాతనే పెట్టుబడి పెడితేనే ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలుంటాయి.

**9. NRIల సంపాదన భారతదేశానికి తిరిగివస్తుందా? లేక వారి సంపాదన ఇతర దేశాల్లో పెట్టుబడిగా మారుతుందా?**

మన భారతదేశంలో పెట్టుబడి పెడుతున్న NRIలుగానీ, ఇక్కడున్న కుటుంబాలకు డబ్బులు పంపించడాన్ని రెమిటెన్స్ కింద చూస్తాం. మనకు ఆదాయం రావడం, పోవడం చూసుకుంటే భారతదేశానికి విదేశాలనుంచి పెట్టుబడులు వస్తున్నాయి. భారతీయులుకూడా విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఈ రెండిటిని తీసివేస్తే కేవలం 0.5% మాత్రమే ఉంది. కేవలం ఒక పాయింట్ ఒక శాతంకన్నా తక్కువ నిధులను మనం విదేశాలనుంచి ఆకర్షించగలుగుతున్నాము. ఇవన్నీ కొంత ఆర్థికంగా ఇబ్బందులు కలిగించే అంశం. ఎందుకంటే ఈ దేశంలో ఉన్న పెట్టుబడిదారులకు ఈ దేశంపైన అవగాహన, ఇక్కడి పరిస్థితులపైన అవగాహన ఉన్నపుడు ఈ హెచ్‌ఎన్‌ఐలు ఇక్కడ పెట్టుబడి చేయకుండా విదేశాలకు వెళ్లడమే కొంత ఆందోళన కలిగించే అంశం. ఎందుకంటే ఇక్కడ ప్రాంతీయ కారణాలు కావచ్చు. రాజకీయ, సామాజిక, అవినీతి కారణాల నేపథ్యంలో కొంత ఇన్వెస్టర్లు ఇబ్బందులకు, ఒడిదుడుకులకు గురవుతుంటారు. ఇంకా భారతదేశంలో నరనరాన జీర్ణించుకుపోయిన సమస్యలు ఏవైతే ఉన్నాయో, అవన్నీ కూడా కొంత పెట్టుబడిదారులు దేశంనుంచి వెళ్ళే ప్రయత్నం జరుగుతుంది. విదేశాలనుంచి ఆకర్షించడానికి ఆస్కారం తక్కువ జరుగుతుంది. హెచ్‌ఎన్‌ఐల రూపంలో కొంతవరకు ప్రయోజనం ఉన్న విషయం మనదందరికి తెలుసు. ఇది మేధోమదన వలస. వాళ్లే ఈ దేశంలోనే ఉండి, అంతటి మేధోసంపద కలిగినటువంటి మేధావులు ఈ దేశంలో ఉండి సేవ చేసినట్లయితే కార్పొరేట్‌సంస్థలు స్థాపించిగానీ లేదా ఇక్కడున్న సంస్థల్లో పనిచేసినట్లయితే వారిచే రెమిటెన్స్‌కన్నా ఇంకా ఎక్కువ ప్రయోజనాలుంటాయి. కనీసం వాళ్ళు అక్కడికి వెళ్ళినవారు రెమిటెన్స్ రూపంలో స్వదేశానికి ఈరోజు వరకు కూడా కొంత ఆశాజనకంగానే ఉండటం మనము పాజిటివ్‌గానే చూడొచ్చు. దానికోసం భారతప్రభుత్వం ఇంకా కొన్ని చర్యలు చేపట్టగలగాలి. వారిని ఇక్కడి పెట్టుబడులు ఆకర్షించడంగానీ,

భారత్‌కు రావడానికి సౌకర్యాలు కల్పించాలి. అటు కార్పొరేట్ సంస్థలకు కొంతమేరకు రాయితీలను ఇచ్చినట్లయితే హెచ్‌ఎన్‌ఐలు కూడా భారత్‌కు వచ్చి ఇక్కడికి కేవలం డబ్బులు పంపడమే కాదు వ్యాపారాన్ని కొనసాగించే అవకాశం ఉంటే దేశం మరింత వేగంగా ముందుకెళ్ళే ఆస్కారం ఉంటుంది.

**10. ఆర్థికాభివృద్ధిలో ఇంకా వెనుకబడిన రంగాలు ? ప్రస్తుతం రాణిస్తున్న రంగాలు?**

పారిశ్రామిక, సేవరంగాలనేవి బాగా ముందుకెళ్ళాయి. సేవారంగం నేడు దేశ జిడిపిలో సింహాభాగంగా దూసుకెలుతుంది. ఎటొచ్చి మనకు వెనుకబడుతున్న రంగమంటే వ్యవసాయరంగమే. అందులో జనాభా రేట్ తగ్గకపోవడం ఒకటి. ముఖ్యమైన కారణాలు ఆలోచించినప్పుడు సేవారంగం, పారిశ్రామికరంగం ఈ రెండు రంగాలలో సాంకేతిక పరిజ్ఞానంగానీ, విదేశీ పెట్టుబడులు కావచ్చు. పూర్తిస్థాయిలో అనుమతించడంవల్ల ఆ రంగాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కానీ వ్యవసాయరంగాన్ని ఒక రకమైనటువంటి సైకాలజికల్ ఫ్యాక్టర్స్‌ద్వారా రైతులు భూమి యాజమాన్యహక్కులు కోల్పోతారనో లేకుంటే ఇదోక ప్రత్యేకమైన పరిస్థితిని వ్యవసాయరంగంలో సాంకేతిక పోకడలు తీసుకురావడానికికానీ, పెట్టుబడులను ఆకర్షించడానికిగానీ, ఈ రంగాన్ని దూరంగా పెట్టడమనేటువంటిది భారతదేశంలో నేటికీ ఉన్నటువంటి కొరత. తద్వారానే ఇవాళ అమెరికాలాంటిదిగానీ, బాగా వేగంగా అభివృద్ధి చెందినటువంటి దేశాలలో ఉన్న వ్యవసాయ తీరుతెన్నులు అక్కడ ఉన్నటువంటి వ్యవసాయ విధానాలు, వ్యవసాయ పరికరాలు మనదేశంలో చూసినప్పుడు చాలా వ్యత్యాసము ఉంది. సర్వీస్ ఇండస్ట్రి రంగాల్లో వారితో పోటీపడగలుగుతున్నాం. వారిని తలదన్ని ముందుకెళ్లే పరిస్థితి భారతదేశంలో ఉంది. వ్యవసాయరంగంలో మాత్రం ఇంకా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. 75 సంవత్సరాల భారతంలో ఆశించిన ఫలితాలు లేకపోవడానికి, కల్పించిన భయంభ్రాంతులద్వారా ఈ రంగాల్లో పెట్టుబడులద్వారాగానీ, సాంకేతికాన్ని తీసుకరావడంలో వెనుకబడిపోయింది. ఇప్పటికైనా ప్రజలు ముందుకు ఆలోచించాలి. పంటల మార్పిడి విషయంలో, యంత్రాలను, యంత్రపరికరాలను ఉపయోగించడంలో, సహకార వ్యవసాయం చేసుకోవడంలో కావచ్చు. ఇలా మార్కెట్‌లో వస్తున్న కొత్త రకాల నూతన వ్యవసాయ పద్ధతులను అర్థం చేసుకొని ఆహ్వానించే పరిస్థితి ఉండాలి. దానికి స్వచ్ఛంధసంస్థలు, స్థానిక రాష్ట్రప్రభుత్వాలు కీలకపాత్ర పోషించాలి. వీటిపై రైతులకు కొంత అవగాహన కల్పించగలిగి, వారికి భరోసాను, భద్రతను కల్పిస్తూ ఈ మార్పులు చేసినట్లయితే వ్యవసాయరంగం నిలదొక్కుక్కోగలుగుతుంది. ఎందుకంటే ఇప్పటికీ 50% - 55% ప్రజలు ఈ రంగంపైన ఆధారపడినవారున్నారు. వ్యవసాయరంగం ఇస్తున్నటువంటి సహాయసహకారాలు జీడీపీ చూసుకున్నట్లయితే 15నుంచి 16%కే ఉండటమనేది చాలా ఇబ్బందికరమైనటువంటిది. ఒక దేశం దృష్టిలో కావచ్చు, సమాజంలో ఉన్నటువంటి ప్రజల దృష్టిలో కావచ్చు ఇది ఇబ్బందికరం. వ్యవసాయరంగంలోనే విప్లవాత్మకమైన మార్పులకు సాంకేతికతను జోడించి తీసుకరావాల్సిన అవసరం ఉంది. దీంట్లో విపరీతమైన పెట్టుబడులను ఆకర్షించేవిధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**11. రెండు తెలుగు రాష్ట్రాలను ఇతర రాష్ట్రాలతో పోల్చి చూసినప్పుడు ఆర్థిక అక్షరాస్యత ఎలా ఉంది?**

మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాలలో ఆర్థికఅక్షరాస్యత బాగానే ఉంది. దేశంలో టాప్ 10లో ఉంటాము. కానీ మనదగ్గర ఈ రెండు రాష్ట్రాల్లో వచ్చిన ముఖ్యమైన ఒక పరిమితి ఏంటంటే, విపరీతమైనటువంటి రుణాలు. గత పదేళ్ళకాలంలో ప్రభుత్వాలు చేస్తున్న రుణాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపైనే కొంత భయాందోళనలకు గురిచేస్తున్నటువంటి నేపథ్యం ఉంది. అక్షరాస్యత విషయంలో ప్రజలకు ఉన్న అవగాహన మిగతా రాష్ట్రాలతో పోల్చినప్పుడు చాలా బాగానే ఉన్నాం. అందులో ఎటువంటి సందేహం లేదు.

**12. ఈ EMIల రూపంలో ఈజీగా లోన్లు రావడం సామాన్యులకు ఎంతవరకు మంచిదంటారు?**

ముఖ్యంగా EMIల సంప్రదాయం అనేది వినియోగవస్తువులకు ఇవ్వడమనేది చాలా ఇబ్బందికరమైన పరిస్థితి కుటుంబాల్లో చూస్తున్నాం. ఇవాళ ఒక మిక్సీ, గ్రైండర్, సోఫా, టీవీ కావాలన్న ఈ EMIల రూపంలోనే ఇస్తున్నారు. మిక్సీలనే కాదు మంచాలు, కుర్చీలు సైతం EMIల రూపంలో ఇస్తుండంతో ప్రజలు వారి భవిష్యత్తు అవసరాలను ఇప్పటికోసం కన్స్యూమ్ చేస్తూ ఆర్థికంగా చితికిపోయి నిజమైన అవసరాలను తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులున్నాయి. కొంతమంది మంచి పాఠశాలలకు పంపించలేక, ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యమయిన నేపథ్యంలో పిల్లలని వారి

భవిష్యత్తుకు ప్రవేటు పాఠశాలవైపు కుటుంబాలు చేస్తుండటం నాణ్యమైన వైద్యాన్ని పొందడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి కనబడుతుంది. ఎందుకంటే ఒక కుటుంబంలో అన్నిరకాల వస్తువులు సమకూర్చుకున్నప్పుడు ఇంకో కుటుంబానికి పోలికలు ఏర్పడిపోయాయి. వాళ్లకు అన్ని ఉన్నాయి. మనకు ఏమి లేవు. ఇవాళ టూ వీలర్ కావచ్చు, గతంలో ఉన్న సైకిల్స్ పూర్తిగా వెళ్ళిపోయి టూ వీలర్‌ను నడపడానికి కుటుంబపైన ఆర్థికంగా భారం పడుతుంది. వెహికల్ కొనడం ఒక భారమైతే దానికి పెట్రోల్, డీజిల్ రూపంలో మరొక భారం మోపబడుతుంది. అదేవిధంగా అనేక రకాలుగా విద్యుత్ వినియోగాన్ని ఉపయోగించే పరికరాలు పెరిగిపోవడంతో విద్యుత్‌చార్జీల రూపంలో సామాన్యులకు భారం పడుతుంది. ఈ వినియోగప్రవృత్తిని కొంతమేరకు కట్టడి చేయాలి. ఈ EMIల పరిస్థితులను తగ్గించినట్లయితేనే ప్రజలు ఆశించే ఆర్థికపరిపుష్టి వస్తుంది తప్ప ఈఎంఐ సంస్కృతిద్వారా ప్రజలకు నష్టాలే కనపడుతున్నాయి తప్ప ఫలితాలైతే పెద్దగా లేవని మనం చూడొచ్చు.

**13. అంతర్జాతీయంగా రూపాయి ఎందుకు బలహీనపడుతుంది?**

వర్తమానకాలంలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించడంతో పెట్టుబడులను అత్యధికంగా ఆకర్షించడంద్వారా డాలరు కొంత బలపడుతుంది. మరోవైపు విదేశీ పెట్టుబడిదారులు భారతదేశంలో లాభాలు స్వీకరణ కోసం ఈక్విటీ అమ్మకాలు చేయటంతో, మార్కెట్లపైన ఒత్తిడి పెరిగి, రూపాయి విలువ కూడా బలహీనపడుతుంది. భారతదేశం నీటికి కూడా ముడిచమురు అత్యధికంగా దిగుమతి చేసుకొనటంతో, ఆ చెల్లింపుల ఒత్తిడి కూడా రూపాయి బలహీనపడడానికి ఒక కారణం. భారత వాణిజ్యలోటు కూడా పెరుగుతుంది. అంటే దిగుమతులను మించి పెరుగుతూ ఉండటం వల్ల డాలర్ల అవసరం పెరిగి, రూపాయి విలువ పడిపోవడానికి కారణం అవుతుంది.

**14. డాలర్‌తో రూపాయి పతనం ఏ విధమైన ప్రభావాన్ని భారతీయులపైన చూపనుంది?**

డాలర్‌తో రూపాయి మారక విలువ పడిపోయినప్పుడు లాభాలు నష్టాలు రెండు ఉంటాయి అవి ఏంటివంటే

i). విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు భారతదేశంలో ఉన్న తల్లిదండ్రులు వారి పిల్లల అవసరాల కోసం డబ్బులు పంపించినప్పుడు, అది ఆర్థికంగా కొంత భారం పెరుగుతుంది. అంతేకాకుండా విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువుల ధరలు కూడా ఎక్కువగా ఉంటాయి. ముడిచమురు ధరలు కూడా ఎక్కువగా ఉంటాయి. ముడిచమురు పెరగడంద్వారా ద్రవ్యోల్బణం కూడా ఎక్కువగానే ఉండడానికి అవకాశం ఉంది. రూపాయి బలహీనతవల్ల విదేశీ ప్రయాణాలు మరియు విదేశాలలో చదువులు ఖరీదుగా మారుతాయి. విదేశీవిద్యకు సంబంధించిన ట్యూషన్‌ఫీజు వసతి ఖర్చులు కూడా పెరుగుతాయి. విదేశీ కరెన్సీలలో తీసుకున్న రుణాలు మరింత ఎక్కువ రూపాయల తిరిగి చెల్లించాల్సి ఉంటుంది కాబట్టి ఇది కూడా ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచుతుంది.

ii). రూపాయి బలహీనతవల్ల ఎగుమతులు లాభదాయకంగా మారుతాయి. ఐటీసేవలు ఔషధాలు, గార్మెంట్స్, ఆభరణాలవంటి రంగాలకు లాభం కలుగుతుంది. ఎగుమతి వృద్ధివల్ల ఉద్యోగ అవకాశాలు కూడా స్వదేశంలో పెరుగుతాయి. విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు పంపే డబ్బుకు రూపాయి విలువ ఆధారంగా ఎక్కువ ఆదాయం వస్తుంది. రూపాయి బలహీనతలవల్ల భారతదేశానికి విదేశీ పర్యాటకులకు చాలా చౌకగా మారుతుంది. తద్వారా హోటల్ రిసార్ట్ ప్రయాణ రంగాలకు లాభం కలుగుతుంది. దిగుమతి చేసుకునే వస్తువులపైన ధరలు పెరగటంద్వారా స్వదేశంలో తయారయ్యే ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి మేకిన్ ఇండియాలాంటి కార్యక్రమానికి ఇది ఎంతో సహాయంగా ఉంటుంది.

రూపాయి పతనంతో లాభనష్టాలు ఉన్నప్పటికీ, భారతప్రభుత్వం కృషి చేస్తుంది. అయితే దీనికి ప్రత్యామ్నాయం కూడా ప్రభుత్వం నేరుగా ప్రపంచదేశాలతో ఈ వ్యాపార సంబంధాలు అంటే నేరుగా భారత రూపాయి కరెన్సీలను ట్రేడ్ చేయడానికి దాదాపు 20పైగా దేశాలతో అగ్రిమెంట్లు చేసుకోవడం చూసాము. ముఖ్యంగా రష్యాలాంటి దేశంలో వేస్ట్రో అకౌంట్స్ అని, ఆర్బిఐతో ఓపెన్ చేసి రష్యా ఏ రోజైనా మనం ఎక్కడినుంచయినా వస్తువులను దిగుమతి చేసుకోవాలన్న భారత రూపీలో మనం చెల్లింపులు చేసే విధంగా చేయడం జరిగింది. అలా 20 దేశాలతో చేయడం జరిగింది. రాబోయే రోజుల్లో డాలర్‌ను ఎదుర్కోవడానికి ప్రభుత్వము అటు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కొన్ని చర్యలు తీసుకోవాల్సినటువంటి అవసరమైతే కనపడతా ఉంది.

**ఇంటర్వ్యూయర్:** పరిశోధక విద్యార్థి, హెచ్‌సియు

# ముందడుగు నాటకం- తెలంగాణ జీవనచిత్రణ

డా. వి.వెంకటేశ్

**0. పరిశోధన పత్ర సంక్షిప్తి :**

తెలంగాణ అంటేనే ఒక పోరాట ప్రతీక. ఉద్యమాలకు పుట్టినిల్లు. భూమికోసం, భుక్తికోసం, తెలంగాణ విముక్తికోసం ఎన్నో త్యాగాలు చేసింది. లాఠీలు, తూటాలు లెక్కచేయకుండా జైలు గోడల్ని సైతం బద్దలుకొట్టిన పోరాట వారసత్వం తెలంగాణది. ఎక్కడ అణచివేత, పీడన, వివక్ష ఉంటుందో అక్కడ తిరుగుబాటు ఉంటుంది. కొన్ని దశబ్దాలుగా తెలంగాణ సమాజం అణచివేతకు, పీడనకు, వివక్షకు గురైంది. వీటన్నింటిని అనుభవిస్తూనే ప్రతి సందర్భంలోనూ తనని తాను ఆయుధం చేసుకుని ఎదురుతిరిగింది. అట్లాంటి తెలంగాణ జీవితాన్ని కథా వస్తువుగా స్వీకరించి అనేక నాటకాలు పురుడుపోసుకున్నాయి. ఈ కోవలోకి చెందిన నాటకమే 'ముందడుగు'. జమీందారీ వ్యతిరేక వస్తువుతో రాసిన ఈ నాటకంలో తెలంగాణ జీవితం ఆవిష్కరించబడిన విధానాన్ని ఈ పత్రంలో విశ్లేషిస్తాను. అంతేకాకుండా నాటి తెలంగాణ ప్రాంతంలో ప్రజల, ప్రధానంగా రైతుల పరిస్థితులను తెలియజేస్తూ వాటి అధారంగా ప్రజలు చైతన్యవంతమైన సమాజం వైపు అడుగులు వేసిన తీరును నా ఈ పరిశోధన పత్ర నిడివి దృష్ట్యా తెలంగాణ జీవితాన్ని చిత్రించే ప్రయత్నం చేస్తాను.

**కీలక పదాలు** (Key words):
*జమీదారీ వ్యవస్థ, తెలంగాణ పోరాటం, జాతీయ కాంగ్రెస్, భూస్వామ్య విధానం, సమ్మక్క సారలమ్మలు, భూమిశిస్తు, వెట్టిచాకిరీ.*

**1. పరిచయం :**

నా పరిశోధన పత్ర అంశం 'ముందడుగు' నాటకం– తెలంగాణ జీవిత చిత్రణ". ఆధునిక సాంఘీక నాటక రంగంలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించిన 'ముందడుగు' నాటకాన్ని వాసిరెడ్డి బాస్కరరావు, సుంకర సత్యనారాయణ అనే జంట రచయితలు రచించారు. వాసిరెడ్డిగారు తెలంగాణ సరిహద్దులోని నందిగామ తాలూకా వీరులపాడు గ్రామంలో 1914 సెప్టెంబర్ 2న జన్మించారు. ఈయన తన 43వ ఏట(1957 నవంబరు 1)మరణించారు. సుంకర సత్యనారాయణగారు విజయవాడ దగ్గర ఈడుపుగల్లు గ్రామంలో 1909 మార్చి 23న జన్మించారు. తన 66వ ఏట(1975 సెప్టెంబర్ 9)మరణించారు.

వీరిద్దరూ రైతు కుటుంబాల నుంచి వచ్చినవారే. సామాన్యులతో కలిసి మెలసి ఉండటం వలన సామాజిక చైతన్యం పొందారు. ఆ చైతన్యమే ఇద్దర్ని సామాజిక మార్పుకై పురికొల్పింది. నాటి సమాజంలో ఉన్న దుర్భరమైన పరిస్థితులనుండి, బానిసత్వంలో మగ్గుతున్న ప్రజల్ని చైతన్యవంతం చేయటం కోసం నాటక రంగాన్ని ఎంచుకున్నారు. అందులో భాగంగా 1946లో వచ్చిన నాటకం 'ముందడుగు'. తెలంగాణ ప్రాంతంలో భూస్వామ్య విధానం, జమీందారి విధానం అమలులో ఉన్న సందర్భంలో ఈ నాటకం వచ్చింది. ఈ నాటకం ప్రధానంగా జమీందారీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వచ్చింది. ఈ నాటకాన్ని పుస్తక రూపంలోకి తెచ్చిన మూడు నెలలకే 3000ల ప్రతులు అమ్ముడుపోయాయంటే ప్రజల్లోకి ఈ నాటకం ఎంతగా దూసుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. సామాన్య ప్రజల్ని ఎంతగా ఆకట్టుకుందో ఊహించవచ్చు. అంతటి ప్రాచుర్యం పొందటం కారణంగా ఈ నాటకం నిషేధానికి గురైంది.

తెలుగు సాహిత్యంలో నిషేధాలు కొత్తగాదు. అసలు ఒక సృజనాత్మక రచనను కానీ కళారూపాన్ని కానీ ప్రభుత్వాలు ఎందుకు నిషేధిస్తాయి? ఈ నిషేధ సంప్రదాయం ఎక్కడి నుండి వచ్చింది! అని మనం అలోచిస్తే... ఎప్పుడైతే తన మనుగడకు, అస్తిత్వానికి అధికారానికి దూరమవుతామని ప్రభుత్వం భావిస్తుందో తత్కారణమైన రచనను, కళారూపాన్ని అధికారికంగానూ, అనధికారికంగానూ నిషేధిస్తూ అజ్ఞలు జారీ చేస్తుంది. మనకు ఈ సంప్రదాయం బ్రిటీషు వారినుంచి వచ్చింది.

**2. "ముందడుగు" నాటక నేపథ్యం :**

'ఆంగ్లేయుల ఏలుబడిలోని భారతదేశంలో 1935 భారత రాజ్యాంగ చట్టం ప్రకారం వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ ప్రధానంగా రైతు సమస్యలైన ఋణ విముక్తిని కలిగించడం, జమిందారీలలో శిస్తుల తగ్గింపు మొదలైన వాగ్దానాలతో పాటు రైతుల కనీస కోర్కెలు చాలావరకు వారి మేనిఫేస్టోలో చేర్చినందుకు కాంగ్రెస్‌కు, అటు కమ్యూనిస్టులనుంచీ, ఇటురైతుల నుంచి అనూహ్యమైన మద్దతు లభించింది. తద్వారా ఎక్కడికక్కడ రైతు సంఘాలు ఏర్పడి రైతుల్లో చైతన్యం పెల్లుబికింది. ఈ నూతన చైతన్యంతో 1938న ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు దాదాపు 1512 మైళ్ళు, దాదాపు 130 రోజులు కాలినడకన 'రైతు యాత్ర'ను చేపట్టారు. ఆ తర్వాత, ఆంధ్రప్రదేశంలో 1938–39లో వచ్చిన జమీందారీ వ్యతిరేక పోరాటాలకు ఈ రైతు రక్షణ యాత్ర గొప్ప ప్రేరణ కల్గించింది. అది రెండవ ప్రపంచ యుద్ధం నడుస్తున్న కాలం కనుక బ్రిటీష్ ప్రభుత్వం 'భారత రక్షణ చట్టం' పేరుతో అనేకమంది అతివాద కార్యకర్తలను బంధించింది. దీన్ని వ్యతిరేకిస్తూ అతివాద పార్టీలు, జాతీయ కాంగ్రెస్ పార్టీలకు చెందిన మంత్రి వర్గం రాజీనామాలను సమర్పించింది. ఇదే అదునుకోసం కాచుకొని

ఉన్న జమీందారీ వర్గం రైతులపై దౌర్జన్యాలను యథావిధిగా కొనసాగించడం మొదలెట్టింది.'(చూ. కృష్ణరావు. వై.వి. 1990: 63-73). ఈ జమీందారీ గ్రామాల్లోని రైతులు పడుతున్న కష్టాలను, వారి జీవనాన్ని నాటకీకరించే క్రమంలో వచ్చిందే వాసిరెడ్డి, సుంకరలు జంటగా రాసిన ఈ 'ముందడుగు' నాటకం.

**3. 'ముందడుగు' నాటక ఇతివృత్తం :**

తెలంగాణ ప్రాంతంలోని మారుమూల గ్రామమైన లక్షీపురంలోని జమీందారీ ఠాణేదారు నాగేంద్రం కూలీవాళ్ళపై అజమాయిషి చెలాయిస్తూ ఉంటాడు. ఈ సన్నివేశంతో నాటకం ఆరంభం అవుతుంది. జమీందారులపై రైతులు చేసిన పోరాటానికి విశిష్ట నాటకీకరణ ముందడుగు. రాచరిక వ్యవస్థను గ్రామాల్లోని ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా సామాన్య ప్రజానికం జరిపిన మహత్తర పోరాటానికి కళాత్మక అభివ్యక్తిగ ఈ నాటకాన్ని చెప్పవచ్చు. జమీందారుల మూలంగా గ్రామంలో జరిగిన వివిధ రకాల సంఘటనలతో విసిగివేసారిపోయిన కొంతమందితో ప్రారంభించి ఆ సంఘటనలకు కారణభూతమైన మనుషులను, దాని అవిభాజ్య సంబంధం ఉన్న వ్యవస్థను చర్చించడం ఈ నాటకంలోని ప్రత్యేకత. తన వ్యక్తిగత జీవితంలోనేగాక సామాజిక జీవితంలో ఎదురయ్యే అనేక సంఘటనలకు పరిష్కార మార్గాన్ని చూపగలిగిన వాడుగా ఈ నాటక కథా నాయకుడు నారాయణరావు కనిపిస్తాడు. భారతదేశాన్ని అనేక అంశాలలో ఆలోచింపజేసి భూమి సమస్యలను, వెట్టి వుముక్తిని ముందుకు తెచ్చిన ప్రజా ఉద్యమం సాయుధపోరాటం. ఇట్లాంటి నేపథ్యంలో వచ్చిన ఈ నాటకంలో రైతులందరు కుల, మత, లింగ తారతమ్యం లేకుండా సంఘటితమై ఒక సంఘంగా ఏర్పడి జమీందారీ పెత్తనాన్ని సమూలంగా నాశనం చేస్తారు. ఆనందంతో కర్శకులు విజయకేతనం ఎగరేస్తారు. ఇంతటితో ఈ నాటకం ముగుస్తుంది.

**4. 'ముందడుగు' నాటకం-తెలంగాణ జీవిత చిత్రణ :**

'ముందడుగు' నాటకం ఆసాంతం తెలంగాణ ప్రాంతంలో జరిగినట్టి నాటి పరిస్థితులను రచయితలు దృశ్యమానం చేశారు. భూస్వామ్య విధానం అమలులో ఉన్న కాలంలో రైతులు పంటలు పండించినా, కరువు కారణంగా పండించకపోయినా పన్నెండు శాతం అధికంగా పన్నులను వసూలు చేసేవారు భూస్వాములు. పంటలు పండకపోయిన నిర్భందంగా రైతుల్ని అనేక చిత్ర హింసలకు గురిచేస్తూ పన్నులు వసూలు చేసేవారు." ఇదివరకల్లా వచ్చి గొంతుమీద కూచుంటే పెండ్లాం మెళ్ళో పుస్తెలుకూడా తెగనమ్మి కడతల్లా"(ముందడుగు: 1980: 3)అని కోటయ్య అనే రైతు శిస్తు గురించి జమీందారీతో మొరపెట్టుకుంటాడు. అయిన జమీందారు వినడు. అప్పో సొప్పో చేసి ఒక్కోసారీ శిస్తు కట్టినా రసీదులివ్వకుండా ముందరి సంవత్సరం శిస్తు మళ్ళీ అడిగి అక్రమంగా వసూలు చేసేవారు. పుల్లయ్య అనే రైతు అక్రమ వసూళ్ళను వ్యతిరేకిస్తూ జమీందారీ ముందు ఇలా అంటాడు."ఎవళ్ళ వొళ్ళో పడేది వాళ్ళవొళ్ళోనే పడింది. కూతురు పెండ్లొచ్చిందంటే ఊళ్ళో వసూలు చేసిచ్చిన వెయ్యి రూపాయిలగాక కూరగాయల దగ్గరనుంచీ, తెచ్చి కొంపనిండేశాం. దొరగారితో చెప్పి చెరువు మరమ్మతు చేయిస్తాను. నామాట యేమిటంటే అసామివారీ పోగుచేసి అయిదు వందలిచ్చాం. పట్టా మామూళ్ళు సరేగదాబీ పుడితే పురుళ్ళకి చస్తే చావులకి జలగ చీల్చినట్లు మానెత్తురంతా". (ముందడుగు: 1980: 5)అంటూ తన గోడు వెళ్ళబోసుకుంటాడు. అందరు రైతులు ఒకవైపు మట్లాతుంటే మరోవైపు జమీందారుకి కొందరు రైతులు తొత్తులుగా ఉంటారు. అచ్చయ్య అనే ధనిక రైతు మిగతా రైతుల మాటలకు అడ్డుకట్ట వేస్తూ''ఆ పెద్దమనిషి మాత్రం అంత అన్యాయానికి ఒడిగడతాడటరా''అంటూ జమీందారుకు మద్దతిస్తూ మాట్లాడుతాడు. ఈ విధంగా భూస్వామ్య వర్గం తమ అనునాయులను ఎలా పెంచి పోషిస్తుందనే విషయాలను ఈ నాటకం ద్వారా ప్రదర్శితమయ్యాయి.

తొలి రోజుల్లో ఆటవిక తెగలకు, ఇతర వెనకబడిన కొన్ని సాంఘీక తెగలకు మాత్రమే ఈ వెట్టి విధానం పరిమితంగా ఉండేది. తర్వాతి కాలంలో అది కాస్త అన్ని కులాల వారికి వర్తింపబడింది. ఈ విధానంలో పటేల్, పట్వారీ, జమీందారీల ఇళ్ళల్లో అనేక రకాల పనులు చేయడానికి ప్రతి ఇంటినుంచి ఒకరు చొప్పున కేటాయించబడేవారు. ఇలా అన్ని కులాల వారిచేత తమ వృత్తికి సంబంధించిన పనులను ఏ మాత్రం డబ్బులు ఇవ్వకుండా ఉచితంగానూ, నిరంతరంగానూ చేయించుకునేవారు భూ స్వాములు. ఇట్లాంటి సందర్భంలో నారాయణను జమీందారీ దగ్గర తన అమ్మ శాంతమ్మ కొలువు చెయ్యమని కోరుతుంది. అప్పుడు నారాయణ శాంతమ్మతో"అమ్మా, జమీందారీ ఉద్యోగమా, పంటలుపండినా యెండినా దయాదాక్షిణ్యాలు లేకుండా శిస్తులు వసూలు జేయలిగదా? పూటకు గంజికి గతిలేక అలో లక్ష్మణా అని అల్లాడే కూలీల చేత వెట్టి చాకిరీ చేయించాలిగదా..."(ముందడుగు: 1980: 22)అంటూ వాపోతాడు. అంటే నాడు జమీందారీ దగ్గర పనిచేసే ఉద్యోగస్తులు రైతులను, కూలీలను, సామాన్య ప్రజానీకాన్ని ఎంతగా కష్టాలపాలు చేశారో నారాయణ మాటల ద్వారా తెలుస్తుంది.

తెలంగాణా ప్రాంతంలో భూస్వాముల, వారి దగ్గర పనిచేసే ఉద్యోగస్తుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరి పోయాయి. దీంతో జమీందారులపై ముఖ్యంగా ఆధిపత్యం చలాయించే వారిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, నిరసనలు పెల్లుబీకినాయి. మూడవ అంకంలో కథానాయకుడు నారాయాణరావు నాటి సామాజిక పరిస్థితుల గురించి ఇలా అంటాడు."మనవాళ్ళంతా రాత్రింబగళ్ళు కష్టపడ్డా పొట్టకు పట్టెడన్నం, కట్టుకోడానికి గుడ్డా, లేక నానా బాధలూ పడుతున్నారు. అంతా కలిసి మెలసి నడుస్తూవుంటే యీ జమీందారుల దుండగాలు, యీ తాబేదారుల లంచగొండితనాలు యిలా మితిమీరిపోతయ్యా."(ముందడుగు: 1980: 22)అంటూ నాటి దుర్భరమైన స్థితిగతులపై యేలా అలోచించి ముందుకు వెల్తే సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందో వివేకంతో నారాయణరావు మిగతా రైతుల, ప్రజల సహాయంతో ప్రజాస్వామికమైన నిర్ణయాలు తీసుకుని వాటిని తూచా తప్పకుండా అమలుపర్చటం ఈ నాటకంలో కనిపించే ప్రత్యేకత.

ఈ నాటకంలో నారాయణరావు ప్రజాస్వామిక

భావాలతో ముందుకెళ్తాడు. జమీందారు చేసే అరాచకాలను తప్పుపట్టినందుకుగాను నారాయణరావు, పుల్లయ్యలపై దాడి చేయించటమేగాక వారిని జైలు పాలు చేస్తాడు. జైలుకు వెళ్ళే సందర్భంలో వాళ్ళ అమ్మ శాంతమ్మతో"ఒకళ్ళ నోటికాడ కూడు పడదోసినందుకుగాదు: ప్రజల రక్తమాంసాలు పీల్చి పిప్పిచేసి కట్టుగుడ్డలతో నిలబెడుతున్న జమీందర్లను, పెట్టుబడిదార్లను, యిది మీకు తగదయ్యా అని చెప్పినందుకమ్మాయీసంకెళ్ళు. ఇదే మహా అపరాధమయితే, ఇదే మహాఘోరకృత్యమయితే యిందుకోరకు యీ సంకెళ్ళనే కాదు ఉరికంబాలసైతం ఎంతో ఆనందంగా కౌగిలించుకోవడానికి వెనుదీయం. మీ శ్రమ ఫలితమే నన్నిట్టి వీరునిగా తయారుచేసింది."(ముందడుగు: 1980: 63)అంటూ తన వ్యక్తిగత విషయం కానప్పటికీనీ పదిమంది ప్రయోజనం కోసం తన జీవితాన్ని ఫణంగా పెట్టటం ఒక సాహసమే. అన్యాయాన్ని ఎదురించినందుకు అకారణంగా శిక్ష వేయటం అనేది నాటి కాలంలో కన్పిస్తుంది. అనేక మంది సామాన్య ప్రజల్ని హింసిస్తూ వారిని కనీసం మనుషులగా కూడా లెక్కచేయని పరిస్థితి తెలంగాణలో దాపరించింది.

తెలంగాణలోని స్త్రీల పరిస్థితి మరీదారుణంగా అండేది. స్త్రీకి స్వేచ్ఛలేదు. కనీసం మాట్లాడేహక్కులేదు. తీవ్ర అణచివేత. నాటి సంఘంలో కొనసాగింది. కానీ స్త్రీ తలచుకుంటే కానిదంటూ ఏది లేదు. సమ్మక్క సారలమ్మల వారసత్వం తెలంగాణ ఆడపడచులకు దక్కింది. ఈ వీరత్వానికి ప్రతీకగా ముందడుగు నాటకంలోని విమల, శాంతమ్మ పాత్రలు కన్పిస్తాయి. శాంతమ్మ విమలను పాట పాడమని కోరుతుంది. నిజానికి పాట ప్రజల మనసులోకి సునాయసంగా వెళ్ళేటటువంటి ఒక అద్భుతమైన సాధనం. అందుకేనేమో రచయితలు నాటకంలో అక్కడక్కడ సందర్భానికి తగినట్లుగా పాటలు రాశారు. నాటకంలోని విమల పాత్ర ద్వారా తెలంగాణలోని స్త్రీల పరిస్థితిని పాట రూపంలో వెల్లడించింది.

**"స్వాతంత్ర్యము స్వేచ్ఛయు శాంతీ**
**ఈ జగతి లేదా స్త్రీలకు?**
**లేదా సుఖము జీవితంబున ఈ జీవితంబున**
**ఈ జగతి లేదా స్త్రీలకు?**
**సంఘ దురాచారాల్ క్రుంగదీసె మనలన్**
**లెదా యిక తరించు మార్గమూ**
**ఝాన్సీ లక్ష్మీ రుద్రమజాతిని జన్మించీ**
**బీతియేల హక్కులడుగగా...నీ హక్కులడుగగా...**

సంఘంలో పేరుకుపోయిన దురాచారాలను నిరసిస్తూ, వీరనారులు జన్మించిన ఈ ప్రాంతంలో కనీస హక్కులు అడగడానికి కూడా భయానకమైన వాతవారణం ఏర్పడింది. అట్లాంటి సందర్భంలో రచయితలు ప్రజల్ని చైతన్యవంతం చేస్తున్నారు. పోరాట వారసత్వం కలిగిన మీరు మీ హక్కులడగటానికి ఎందుకు భయం అంటూ ప్రజల్లో నూతనోత్సాహాన్ని నింపి వారిని 'ముందడుగు' వేయించటం ఈ నాటకంలో చాలా స్పష్టంగా దృశ్యమానం చేయబడింది. సామాజిక వాస్తవికతని ఈ నాటకం దృశ్యమానం చేసిందనటంలో ఎట్లాంటి సందేహం లేదు.

తెలంగాణ సమాజం సమస్యలను ఎదుర్కొనే సందర్భంలో త్యాగాలకు సైతం వెనకడుగు వేయలేదు. ఎంతటి సమస్య వచ్చినా గుండెనిబ్బరంతో ముందడుగే వేసింది. వెలకట్టలేని త్యాగాల సిగలో పూసిన మందారపువ్వే ఈ 'ముందడుగు' నాటకం. నాటకంలో జమీందారు తనని ఎదురిస్తున్నాడని కోపంతో నారాయణరావు ఉంటున్న ఇంటిని ఖాళీ చేయిస్తాడు. తర్వాత పుల్లయ్య అనే రైతు దగ్గర ఆశ్రయం పొందుతాడు. నారాయణరావుకు ఆశ్రయం ఇవ్వటాన్ని నేరంగా భావించి కారణంగా పుల్లయ్యకూడా జైలు పాలవుతాడు.

**ముగింపు:**

20వ శతాబ్దిలో వచ్చినట్టి ఆధునిక తెలంగాణ నాటకం పోరాటాలతో, ఉద్యమాలతో పెనవేసుకుపోయి ఉంది. ఇతర ప్రాంతాల్లో వచ్చిన నాటకాలకు తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిన (ప్రధానంగా తెలంగాణ వస్తువు పునాదిగా వచ్చినటువంటి) నాటకాలకు తేడా ఉంది. ఈ దృష్టితో చూసినప్పుడు తెలంగాణ సమాజాన్ని వాస్తవికంగా చిత్రించినవే అధికం. తెలంగాణ వస్తువు ప్రధాన భూమికగా వచ్చిన నాటకం 'ముందడుగు'. నాటి సమాజంలోని వాస్తవికతని దృశ్యమానం చేయటంతో పాటుగా ఈ నాటకం సామాన్య ప్రజల్లో సైతం చైతన్యాన్ని నింపింది. పోరాట స్ఫూర్తిని కలిగించింది. జమీందారీ వ్యవస్థలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను కన్నులకు కట్టినట్లు చిత్రించింది. ఒక పనిలో కావచ్చూ, ఉద్యమంలో కావచ్చూ ఎన్ని కష్టాలెదురైనా, అవరోధాలు వచ్చినా అనుకున్నది నెరవేరేవరకు వెనుదిరగక వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు నడవాలని సమాజానికి ఒక చక్కటి సందేశాన్ని అందించింది ఈ నాటకం.

**ఉపయుక్త గ్రంథసూచి :**


1. కృష్ణారావు, వై. వి.(సంపా). 1990. ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉద్యమాలు పోరాటాలు(1&2 భాగాలు). విశాలాంధ్ర పబ్లికేషన్స్. హైదరాబాదు.

2. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర. 2016. తెలుగు అకాడమి. హైదరాబాదు.

3. నరసింహులు, నల్లా. 2012. తెలంగాణ సాయుధ పోరాటం నా అనుభవాలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాదు.

4. భాస్కరరావు, వాసిరెడ్డి. సత్యనారాయణ, సుంకర. 1980. ముందడుగు. సుంకర పబ్లికేషన్స్. విజయవాడ.

5. మల్లారెడ్డి, తూర్పు.(సంపా). 2007. తెలంగాణ సాహిత్యం-జీవితం చిత్రణం( జాతీయ సదస్సు సంచిక). శ్రీలక్ష్మీనరసింహస్వామి కళాశాల. నల్లగొండ.

6. వేదవతి ప్రయాగ. 2002. శత వసంత సాహితీ మంజీరాలు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రచురణ. విజయవాడ.

7. శరత్ జ్యోత్స్నా రాణి, ఎస్. 2013. ఆధునిక తెలుగు నాటకం-సాహిత్యం-ప్రయోగం. తెలుగుశాఖ హైదరాబాదు విశ్వవిద్యాలయం. హైదరాబాదు.

8. సాహితీ గోదావరి. 2016. త్రైమాసిక సాహిత్య పత్రిక. గోదావరి సాహితీ మిత్రులు ప్రచురణ. వరంగల్.


**రచయిత: తెలుగు అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాక**

సాహిత్య పరిశోధన

# కోయ తెగ సంస్కృతి-సంప్రదాయాలు

అరెం అరుణ్‌కుమార్

## పరిచయం

ప్రధాన జీవన స్రవంతికి దూరంగా దట్టమైన అడవుల్లో, కొండకోనల్లో సేలయేర్లు, జలపాతాలు, వింతలు, విడ్డురాలు, రహస్యాలు ఎన్నో అందమైన ప్రదేశాలు ప్రకృతిలో దాగివున్నాయి. సెలయేర్ల ప్రవాహంతో దట్టంగా పెరిగినా పెద్ద పెద్ద చెట్ల నీడల్లో జంతువులు, పక్షులు, సరిసృపాలు సేద తీరుతాయి. మధురమైన వాసనలు విరజిమ్మే పూలతోటల్లో తుమ్మెదలు, సీతాకొక చిలుకలు, పురుగులు ఉరకలు వేస్తాయి. పండ్లు, ఫలాలు, పూలు, ఖనిజ సంపదలు, అటవీ ఉత్పత్తులు, వనమూలికలతో నిండిన ప్రకృతిలో పక్షుల కిలకిలలు, కోకిల రాగాలు, తుమ్మెదల శబ్దాలు, జంతువుల అరుపులు మనస్సుకు ఆనందాన్ని కల్గిస్తాయి. ప్రతి క్షణం గజిబిజిగా ఉండే మానవ జీవితాలు ప్రకృతి అందాలను చూడగానే తేనెటీగవోలే వాలిపోతారు. ఈ అద్భుతమైన ప్రదేశాల్లో స్వచ్ఛమైన ప్రేమ కల్గిన కోయలు తరతరాలుగా ప్రకృతిలో మమేకమై, ప్రకృతి ప్రేమికులుగా జీవనం గడుపుతున్నారు. అనాదిగా ప్రకృతిలో జీవించడం, ప్రకృతిని పూజించడం, ప్రకృతిని ఆరాధించడం ద్వారా ప్రకృతి తత్త్వమే వీరి తత్త్వంగా మారింది. తరాలు మారుతున్న ఆచారాలను, ప్రకృతిని వదలని కోయలు ప్రకృతి ప్రేమికులుగా పిలువబడుతున్నారు.

కోయలు ఆదివాసీలు. ఈ దేశ మూలవాసులు. వీరికి పూర్వం రాజ్యాలు, గడులు, కోటలు ఉండేవి. కోయలు భారతదేశంలో గోండ్వానా భూభాగాలను చిన్న చిన్న రాజ్యాలుగా ఏర్పాటు చేసుకొని పరిపాలించారు. నాటి నుండి నేటి వరకు జనజీవనంలో కోయ వారిని దొరలుగా, కోయ రాజులుగా పిలుస్తున్నారు. వీరు చత్తీష్‌గడ్ రాష్ట్రంలోని బస్తర్, దంతెవాడ, సుక్మా, కుంటా ప్రాంతాలను తమ జన్మస్థానంగా చెప్పుకుంటారు. వీరు అక్కడ నుండి వివిధ ప్రాంతాలకు తరలివెళ్ళడం జరిగింది. ప్రధానంగా కోయలు భారతదేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీష్ఘడ్, ఒరిస్సా, బీహార్, ఝూర్ఖండ్ రాష్ట్రాలలో కొండ ప్రాంతాలను ఆధారం చేసుకొని జీవిస్తున్నారు. వీరిని షెడ్యూల్ ట్రైబ్‌గా పిలుస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం కోయ జనాభా 3,81, 354 మంది ఉన్నారు. మన రాష్ట్రంలో వీరు అతి పెద్ద రెండవ తెగగ గుర్తించబడుతున్నారు.

## కోయలు శరీరాకృతి

కోయలు గుండ్రటి మోహం, నల్లటికళ్ళు, లావు పెదాలు, డొప్ప చెవులు, డోలి కడుపు, బండముక్కు, నల్లటి రంగు, దృఢమైన శరీరం కల్గి ఉంటారు. జంతు శర్మాన్ని, ఆకులను వొంటికి ధరించి, తలకు రూమాలు కట్టి, తలలో నెమలి ఈకలు పెట్టుకొని, జబ్బకు విల్లంభు, నడుముకి కత్తి, చేతులకు, కాళ్ళకు, మెడకు ఆభరణాలు తొడిగి అకర్షణీయమైన వేషధారణలో కన్పిస్తారు. దేశ నలుమూలలలో ఎక్కడున్నా వీరి మూలాలు ఒకేలా ఉంటాయి. వీరిని గుర్తించడానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. అవి. ఒకే ప్రాంతంలో ఉండడం, ఒకే భాష మాట్లాడడం, సిగ్గు, బిడియం, భయం, మోహమాటం, ఒకే తెగ సమూహం మధ్య వివాహాలు చేసుకోవడం, తెగ మొత్తం ఒకే నాయకుడి ఆధీనంలో ఉండడం మొదలైన లక్షణాలను బట్టి వీరిని ఈ దేశ మూల వాసులుగా పిలుస్తున్నారు.

## కోయలు - సామాజిక వ్యవస్థ

ఆదిమ తెగలలో ప్రత్యేకమైన జీవనశైలిని కల్గి ఉన్నటువంటి తెగలలో కోయ తెగ ముఖ్యమైనది. వీరు బాహ్య ప్రపంచానికి దూరంగా కొండలు, కోనలు, నదీ పరివాహక ప్రాంతాలను ఆసరా చేసుకొని జీవనం గడుపుతున్నారు. కోయల జీవన విధానాన్ని మిగతా తెగలతో పోల్చినప్పుడు కొంచం భిన్నంగా ఉంటుంది. ప్రకృతిలో లభించే పండ్లు, ఫలాలు, దుంపలు, అటవీ వనరులపై ఆధారపడి బతుకుతారు. వీరు తెలంగాణలో ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామబాద్, మహబూబనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్నారు. గోదావరి, సీలేరు నదుల సరిహద్దు ప్రాంతాలను ఆనుకొని ఉండే రాచకోయ, పుట్టకోయ, లింగదారికోయ, పుట్టకోయ, డోలికోయ, గొత్తికోయ, కొమ్ముకోయ, గట్టుకోయ, మూసకోయ, బీనకోయ, నెమలి కోయ, గంపకోయ, కమ్మరికోయ, పట్టెడుకోయ, వడ్డెకోయ అని వారు చేసే వృత్తులను బట్టి, వారి జీవన విధానాన్ని బట్టి వివిధ రకాలుగా పరిశోధకులు వర్గీకరించారు. పరిశోధకులు, కోయ పూర్వీకులు, పెద్దలు వారందరిని ఒకటిగా చూడాలని తెలియజేస్తున్నారు.

## కోయలు - భాష

కోయలు ఒక ప్రత్యేకమైన భాషను, యాసను మాట్లాడుతారు. వీరి సంస్కృతి లాగా వీరి భాష కూడా

ప్రాచీమైనది. వీరు మాట్లాడే భాషను కోయ భాషగా పిలుస్తారు. కొండ ప్రాంతాలలో నివసించే వాసులుగా తమని తాము కోయతూర్లుగా పిలుసుకుంటారు. ద్రావిడ భాషలో కోయతూర్ అనగా కొండ ప్రాంతపు మనిషి అని అర్థం. కోయ భాష ద్రావిడ భాష కుంటుంబానికి చెందిన, తమిళ, కన్నడ, మళయాళ భాషలకు దగ్గర పోలిక ఉంటుంది. కోయ పదం పుట్టుక గురించి కోయ సమాజంలో అనేక రకాల నానుడులు వెలువడుతున్నాయి. వీరు వివిధ ప్రాంతాలలో ఉంటూ తమ మాతృభాషతో పాటు ఆయా ప్రాంతాల భాషలను మాట్లాడుతారు. కోయలు నివసించే ప్రాంతాలను రెండు రకాలుగా గుర్తించవచ్చు. భద్రాచలం, చెర్ల, దుమ్ముగూడెం, చింతూరు మొదలైన గోదావరి ప్రాంతాల ప్రజలు కోయ భాష మాట్లాడుతారు. ములుగు, వరంగల్, తాడ్వాయి, ఏటూరునాగరం మొదలైన ప్రాంతాల వారు కోయ భాషను మాట్లాడరు. కోయ్య అనే ఒక చెట్టును పూజించడం వల్ల, ఆ చెట్టును దేవతగా భావించడం వల్ల వీరికి కోయ అనే పేరు వచ్చిందని చరిత్రకారులు చెప్తున్నారు. కొయ్య బొమ్మలను పూజిండం వల్ల వీరు కోయ వారుగా పిలవబడుతున్నారని తెలుస్తుంది.

**కోయలు – సంస్కృతి, సంప్రదాయాలు**

కోయ సంస్కృతి పురాతనమైనది. ప్రత్యేకమైనది. వీరి సంస్కృతి, సాంప్రదాయాలు, భాష ఒక తరం నుండి మరో తరానికి మౌఖికంగా అందించబతుతున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలు, కట్లుబాట్లు, జీవన విధానం, భాష, యాస, ఆటలు, పాటలు పూర్తిగా మైదాన ప్రాంతాల ప్రజలకు భిన్నంగా ఉంటాయి. చెట్టు, పుట్ట, రాయి, రప్ప, వాగు, వంక, జీవరాశులను దైవంగా పూజించే ఆచారం వీరి స్వంతం. వీరి ఆనాది ఆచారాల్లో విజ్ఞానం జీవనదిలా ప్రవహిస్తుంది. కట్టుబాట్లు, పద్ధతులు, నియమాలు ప్రజల్లో నైతిక విలువలను, ప్రకృతి మీద విశ్వాసాన్ని పెంపొందిచే విధంగా ఉంటాయి. పుట్టిన ప్రతి ఒక్తి మరణం దాకా కోయ తెగ ఆచారాలు తప్పకుండా పాటించాలి. పుట్టుక, పెళ్ళి, చావు, శుభ కార్యాలు, పండగలు, జాతరలు తలపతులు, పెద్దమనుషులు, పేరాంటాలు, యువకులు, వడ్డెలు, పూజారి, అర్తిబిడ్డలు అందరూ పాల్గొని జరిగే తంతు నిర్వహిస్తారు.

కోయ సమాజంలో గట్టుగోత్రాల యొక్క ప్రధాన్యాత విశిష్టమైనది. మన రాష్ట్రంలో మూడు నుండి ఏడు వరకు మొత్తం ఐదు గట్టుగోత్రాలు ఉన్నాయి. గట్టు అంటే సరిహద్దు అని అర్థం. గట్టును నెంబర్ అని కూడా పిలుస్తున్నారు. మూడవ గోత్రాన్ని కాకేటి పూజారి, వడ్డెర గోత్రం అని, నాలుగోవ గోత్రాన్ని సనపగాని గోత్రం అని, ఐదవ గోత్రాన్ని బండాని గోత్రం అని, ఆరవ గోత్రాన్ని పారేదు గోత్రం అని అంటారు. మనుషుల మధ్య విలువలు, మానవ సంబంధాలు, వివాహా సంబంధాలు పెంపొందించే విధంగా గట్టు గోత్రాల వ్యవస్థను పటిష్టంగా నిర్మించుకున్నారు. వీరి పుట్టు పూర్వోత్తారాలు, చరిత్ర, ఆచారాలు, కట్టుబాట్లు వాటి ప్రత్యేకతను తెలియజేసే తలపతులు, వడ్డెలు, అర్తిబిడ్డలు సంస్కృతిక సారధులుగా ఉంటారు. వీరి ఆచారాలు, పండగలు, జాతరలు, శుభ, ఆశుభ కార్యక్రామాలు అన్ని గట్టుగోత్రాల మీదనే ఆధారబడి ఉంటాయి. ప్రతి గోత్రంలో ఒకటి నుండి వందకు పైగా ఇంటి పేర్లు ప్రకృతి పేర్లతో ముడిపడి ఉంటాయి. ప్రతి ఇంటికి ఒక ప్రత్యేమైన ఇలవేల్పు, ప్రతీకలు ఉంటాయి. ప్రతి మనిషి చెట్లు నరకడం ద్వారా అడవి అంతరించిపోతుందని, జంతువులు, పక్షులు చంపి తినడం ద్వారా జీవరాశులు అంతరించిపోతాయని, ప్రకృతిని రక్షించడానికి ప్రతి ఒక్కరు చెట్టుని, పక్షిని, జంతువుని ప్రతీకలుగా పూజించే నియమాన్ని పాటిస్తున్నారు.

కోయ సమాజంలో ఉన్న ఐదు గోత్రాల ప్రకారంగా కోయ వివాహాలు జరుగుతాయి. నాలుగు, ఏడు గట్టు వారు ఒకే కుటుంబానికి సంబంధించిన వారు. వీరు అన్నదమ్ములుగా వ్యవహరిస్తారు. వీరి మధ్య వివాహ సంబంధాలు ఉండవు. నాలుగు, ఏడు గట్లు తప్ప మిగతా గట్టులన్ని ఒకరికి ఒకరు వరుస అవుతారు. వారి మధ్య వివాహా సంబంధాలు ఉంటాయి. ఒకే గోత్రంలో వివాహా సంబంధాలు ఉండవు. కోయ సమాజంలో వివాహా సంబంధాలు నాలుగు రకాలుగా ఉంటాయి. అవి. 1) పెద్దలు కుదిర్చిన పెళ్ళిలు 2) ప్రేమ పెళ్ళిలు 3) రాక్షస పెళ్ళిలు 4) ఇల్లరికం పెళ్ళి. పూర్వ కాలంలో రాక్షస వివాహాలు ఎక్కువగ జరిగేవి. మనకు నచ్చిన అమ్మాయిని బలవంతంగా ఎత్తుకొని వచ్చి వివాహం చేసుకునే పద్ధతిని రాక్షస వివాహ పద్ధతి అంటారు. ప్రస్తుత కాలంలో ప్రేమ పెళ్ళిలు మరియు పెద్దలు కుదిర్చిన పెళ్ళిలు ఎక్కువగా జరుగుతున్నాయి. పెళ్ళికి ముందు వరుస అయ్యే వారిని నిర్ణయించుకొని పెద్దలు, పిల్లలు, పేరాంటాళ్ళు అందరూ కలిసి, తమ దగ్గర ఉన్న సారా, కళ్ళు, పండ్లు, ఫలహారాలు పట్టుకోని, పెళ్ళి పిల్ల దగ్గరకు వెళ్ళి సంబంధం కలుపుకొని తిని, తాగి వస్తారు. తర్వాత కోయ ఆచారం ప్రకారం పెళ్ళి తంతు నిర్వహిస్తారు.

పంచభూతాలను, ఉత్పత్తులను కొలిచే సాంప్రదాయం కోయలది. ఈ సాంప్రదాయం తరతరాలుగా వారసత్వంగా సంక్రమిస్తుంది. ప్రకృతి శక్తి, ఉత్పత్తి ప్రాధాన్యత ప్రకృతి మీద వీరికి ఉన్న ప్రేమ వారి ఆచారాల్లో స్పష్టంగా కనబడుతాయి. ప్రకృతి శక్తుల మీద వీరికి ఉండే అపారమైన నమ్మకమే ప్రకృతి శక్తులను వశపరుసుకోవడానికి నరబలులు, నైవేద్యాలు దేవునికి

పెట్టేవారు. పాల ఆకులలో నైవేద్యాలు పెట్టి, కళ్ళు ఆరాబోసి, అనేక రకాల పూలతో పూజించి, కఠోర నియమాలతో ప్రకృతి శక్తులను పొందుతారు. నేటి కాలంలో నరబలులు ఇచ్చే సంస్కృతి లేకపోయిన ప్రకృతి శక్తులను పూజించే ఆచారం వీరిలో ప్రబలంగా ఉంది. ప్రకృతి శక్తులను, ఇలవేల్పులను పూజించని జీవితాలు అర్థాంతరంగా పాము కాటుకి, అనారోగ్యానికి, క్రూర మృగాలకి, ప్రకృతి వైపరీత్యాలకి బలి అవుతారని నమ్ముతారు.

తినే తిండికి, పండించే పంటకి, పూసే పువ్వుకి, కాసే కాయకి పండగలు చేసే ప్రకృతి ఆచారం కోయల ప్రత్యేకత. వీరు భూమి పండగ, విత్తనాల పండగ, చిక్కుడు పండగ, కొత్తల పండగ, ఇప్పపువ్వు పండగ, మామిడి పండగ, తాటి పండగ మొదలైన పండగలను నిర్వహిస్తారు. వీరి పండగలన్ని వ్యవసాయ, ప్రకృతి పండగలే. ప్రకృతిలో లభించే కాయను, పండును, పువ్వును, ఆకుకూరను మొదటిగా తినే ముందు ఇంటి ఇలవేల్పుకు నైవేద్యం పెట్టి, ఆ తర్వాత పండగ జరుపుతారు. వీరు జరిపే ప్రతి పండగల వెనుక విజ్ఞానం దాగి ఉంటుంది. పండ్లు, ఫలాలు, కాయలు, ఆకుకూరలకు సంపూర్ణమైన పౌష్టికహారంగా తయారయినప్పుడు వాటికి పండగ చేసి, మొదటిగా ఇలవేల్పులకు నైవేద్యం పెట్టిన తర్వాత కోయలు తింటారు. పండగ జరుగే సందర్భంలో డోలి మోతలకు చిన్న, పెద్ద, ముసలి, ముతక తేడా లేకుండా నృత్యం చేస్తూ ఆనందిస్తారు. కోయలు తమ మూల పురుషులను దేవుళ్ళుగా భావించి పూజలు చేస్తారు. సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, పిడగరాజు, ముత్యాలమ్మ, ద్యారెల్లి, రెక్కల రామ్మక్క మొదలగు ఇలవేల్పులకు సామూహికంగా జాతరలు జరుపుతారు. పండగలు, జాతరలు వీరి సంస్కృతిని, సామూహిక జీవనవిధానాన్ని, ఐక్యతకు తెలియజేస్తాయి. ఇలవేల్పులు జరుగు ప్రదేశాలు కోయ ధార్మిక కేంద్రాలుగా చెలామని అవుతున్నాయి.

వీరి ఆచారంలో ఆర్తి బిడ్డలు ముఖ్య పాత్ర పోషిస్తారు. పెళ్ళీలు, చావులు, దినాలు, పండగలు, జాతరలు కార్యక్రమాల్లో డోలి వాయిస్తూ, గానం చేస్తుంటారు. రాగయుక్తంగా కోయ తెగ పుట్టు పూర్వోత్తరాలను, ఆచారాలను గానం చేస్తుంటారు. డోలి మోతలకు దొర, పటేలు, తలపతి, వడ్డెలు, శివసత్తులు, మగవారు, ఆడవారు, యువకులు ఒకరి చేతులు ఒకరు పట్టుకొని కొమ్ము నృత్యం, డోలినృత్యం, రేలనృత్యం, చంద్రాకారనృత్యం, గుడినృత్యం, కొక్కో నృత్యం చేస్తూ ప్రకృతిలో తన్మయత్వం పొందుతారు. వీరి నృత్యాలు ప్రాచీనమైనవి. జాతరలు, పండుగలు, ఇలవేల్పుల జరుగు సమయాల్లో సాహిత్య, సంగీత, వాయిద్య కళాకారులు తమ కళ నైపుణ్యాలతో అద్భుతమైన ప్రదర్శనలు చేస్తారు. డోలి, గండ్జ, తూతుకొమ్ము, అందెలు, డింకీ, ఆక్కుం, గుజ్జడి మొగ్గ, గుల్లకట్ట మొదలైన వాయిద్యాలు కోయ తెగకు సంబందించిన వాయిద్యాలు. వీరి వాయిద్యాలు వినసొంపైన శబ్దాన్ని చెవులకు అందిస్తారు. వీరే స్వయంగా ఈ వాయిద్యాలను అడవిలో లభించే చెట్లతో, జంతు శర్మాలతో, కాయలతో తయారు చేసుకుంటారు. ఆచారాలు పుట్టుక, పెళ్ళి, చావు, పండగలు, జాతరలు, ఇలవేల్పులలో వీటిని ప్రధానంగా వాయిస్తారు.

కోయల జీవన విధానం మిగతా తెగలతో పోల్చినప్పుడు వారి జీవనశైలి కొంచెం భిన్నంగా ఉంటుంది. వీరు ముఖ్యంగా వేట మీద, అటవీ వనరులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తారు. ప్రకృతిని, జీవరాశులను పూజించినట్లుగా, తాము బతకడానికి కారణమైన పండ్లు, ఫలాలు, దుంపలు, ఆహార ఉత్పత్తులను మొదలగు వాటిని దైవంగా కొలుస్తారు. ఈత పండ్లు, జీవిలిక పండ్లు, పూజుగ పండ్లు, మొర్లి పండ్లు, పాల పండ్లు, నెక్కర పండ్లు, జిన్న పండ్లు, రేగి పండ్లు, పరికె పండ్లు, కారెంగు పండ్లు, పులిసోరి పండ్లు, జామ పండ్లు, చింత పండ్లు, మాడి పండ్లు, జీడిమామిడి పండ్లు, పనస పండ్లు, తాటి పండ్లు, ఇల్లెందు పండ్లు, తునికి పండ్లు మొదలైన రకాల పండ్లను అడవి నుండి సేకరిస్తారు. ఈ పండ్లను బాగా ఎండపెట్టిన తర్వాత నిలువ చేసి వాటిని అల్పాహారంగా తీసుకుంటారు. వీరు ఉపయోగించే పద్ధతిని ప్రస్తుతం కాలంలో డ్రై ఫూట్స్‌గా పిలుస్తున్నారు. ఎల్లేరు గడ్డలు, నల్లచెన్న గడ్డలు, ఎర్రచెన్న గడ్డలు, దుంప గడ్డలు గోవిందు గడ్డలు అనేక రకాల దుంపలను భూమిలో నుండి తవ్వుకొచ్చి ఉడకబెట్టి తింటారు. వివిధ కాలాలలో లభించే పండ్లు, దుంపలు ఆహారంగా తీసుకుంటూ ప్రకృతికి అనుగుణంగా తమ జీవన విధానాన్ని మార్చుకుంటారు. పూర్వకాలంలో వీరు సహజ సిద్ధంగా లభించే పండ్లు, ఫలాలను ఆహారం తీసుకోవడం వల్ల వంద సంవత్సరాలు పైబడి ఆరోగ్యంగా బతికేవారు.

ప్రకృతిలో స్వేచ్ఛగా విహరిస్తూ, కొండకోనల నడుమ ఆనందంగా జీవించే కోయలు అటవీ వనరులపై ఆధారపడుతారు. ఇప్పపూలు, పుట్టకొక్కులు, తేనె, జిగురు, నార, చీపురు, గోపిరి, ఈతగడ్డి, తాటాకులు, పారేఆకులు, మానేరు గింజలు, ఇప్పగింజలు, ముష్ఠిగింజలు, చిల్లగింజలు, ఆరదొండ కాయలు, బోదకాకర కాయలు, ఉసిరి కాయలు, కరక్కాయాలు, జీడి గింజలు, మారేడు కాయలు, కానుగు గింజలు, పుసుక గింజలు, సున్నపు రాయి, కల్ప మొదలుగు అటవీ ఉత్పత్తులను గుంపులు గుంపులుగా సేకరిస్తారు. అటవీ ఉత్పత్తులకు సంతలో అధిక డిమాండ్ ఉన్నందున వాటిని

అమ్ముకొని లేదా వస్తు మార్పిడి విధానం ద్వారా తమకు కావాల్సిన వంట సామాగ్రి, దుస్తులు, వ్యవసాయ పనిముట్లు, బంగారం, రాగి, వెండి, ప్లాస్టిక్ మొదలైన వస్తువులను తీసుకుంటారు.

కోయల ప్రధాన జీవనాధారం పోడు వ్యవసాయం. ఈ పోడు వ్యవసాయాన్ని అనుకూలమైన ప్రదేశంలోని చెట్లను నరికి, కాలబెట్టి, వర్షాలు ప్రారంభమయ్యే సమయంలో కాలబెట్టిన బూడిదలో విత్తనాలు జల్లుతారు. వర్షానికి మొలకెత్తిన చేనుకు ఎటువంటి శ్రమ చేయరు. పంట చేతికి వచ్చినప్పుడు కోసి, నూర్పి దాన్యాన్ని ఇంటికి తీసుకెళ్తారు. ఈ విధంగా ఒకే చోట రెండు, మూడు సార్లు పంటలు పండించి తర్వాత వేరే చోట వ్యవసాయం చేయడాన్ని పోడు వ్యవసాయం అంటారు. వీరు ఒకే దగ్గర వ్యవసాయం చేయడం వల్ల భూసాంద్రత తగ్గిపోయి, పంటలు బాగా పండవని నమ్ముతారు. కొర్రలు, సజ్జలు, సామలు, నల్లసామలు, జొన్నలు, లంకజొన్నలు, నల్లజొన్నలు, తైదలు, కుక్కతైదలు, దుసవరి, వరి మొదలైన పంటలు పోడు వ్యవసాయంలో పండిస్తున్నారు. వేట, పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ ప్రధాన జీవనాధారంగా ఉండే పరిస్థితులు పోయి, నేటి కాలంలో వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా మారిపోయింది. వరి, జొన్నలు, కందులు, పెసర్లు, బొబ్బెర్లు, ఉలువలు, నూలు, గానుగ, ఆముదం మొదలైన సాంప్రదాయ పంటలు చేసే వీరు మిర్చి, పొగాకు, చెరుకు, పత్తి, పసుపు మొదలైన వాణిజ్య పంటలు పండిస్తున్నారు. గొడ్డలి, బాడిశ, చిన్న బాడిశ, నాగలి, కర్రు, మోడి, పాలే, కాండి, పలుపులు, పగ్గం, మోకు, ముల్లు కర్ర, పీట, గొర్రు, పార, గునపం, తట్ట, గుమ్మి, కొడవలి, ఎడ్ల బండి మొదలైన వ్యవసాయ పనిముట్లను ఉపయోగిస్తున్నారు. ట్రక్టర్లు, డోజర్లు, కలితివేటర్, రూటువేటరు, వరికోసే మిషిన్స్, నాటు వేసే మిషిన్ మొదలైన ఆధునిక వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి రావడంతో కోయ వారి సాంప్రదాయబద్దమైన వ్యవసాయ రూపరేఖలు మారిపోయాయి.

కోయల ప్రధాన జీవనాధారం వేట. చిన్నతనం నుండి వేటను నేర్చుకోవడం ద్వారా వేట అనేది వీరి సంస్కృతిలో భాగమైంది. కోయలు మొదట ఆటవిక దశ నుండి నాగరిక దశ వరకు జరిగిన పురోగమనంలో క్రూర జంతువుల బారి నుండి తమ ప్రాణను రక్షించుకోవడం కోసం వేటాడటం నేర్చుకున్న వీరు కడుపు నింపుకోవడం కోసం కూడా చికారి చేయడం ప్రారంభిచారు. జంతువులను, పక్షులను, చేపలను, సరిసృపాలను వేటాడే పద్దతులను, మెళుకువలు తమ పూర్వీకుల దగ్గర నుండి నేర్చుకుంటారు. వీరు ప్రతి రోజు ఏదో ఒక రకమైన వేటను తప్పకుండా చేస్తారు. వీరు సందర్భాన్ని బట్టి వ్యక్తిగత వేట లేదా సామూహిక వేట అనే రెండు రకాల పద్ధతుల్లో జంతువులను వేటాడుతారు. విల్లు, బాణం, మిట్ట, మొలగం, బల్లెం, కత్తి, గొడ్డలి, బరిశ, ఈట, లైటు బురక మొదలైన సాంప్రదాయబద్ధమైన ఆయుధాలనే వేటలో ఉపయోగిస్తారు. వేటలో పాల్గొనే ప్రతి ఒక్కరు విల్లును భుజానికి ధరించి, భాణాలు, గొడ్డలి, కత్తి పట్టుకొని, కుక్కలను వెంట తీసుకెళ్తారు. చేను దగ్గర కాపల కోసం, వేటాడడం కోసం, తోడు కోసం కుక్కలను పెంచుతారు.

"కుక్కలులేని వేట డోలి దెబ్బలేని నృత్యం లాంటిదే". అనే సామెత చికారిలో కుక్కల ప్రధాన్యతను తెలియజేస్తుంది. కుక్కలు లేని వేటలో జంతువు దొరుకుతుందో లేదో తెలీదు, ఏ క్రూరమృగం చంపుతుందో తెలీదు, ఏ పాము కాటువేస్తుందో తెలీదు, దట్టమైన అడవిలో అన్వేషణ కాబట్టి కుక్కలు లేని చికారి భయంగానే ఉంటుంది. వేటలో కుక్కలు ఉండడం ధైర్యం కల్గుతుంది, తప్పకుండా జంతువు దొరుకుతుందని నమ్మకం ఉంటుంది. అడవి పందులు, జింకలు, దుప్పులు, గొర్రెలు, గురాబర్రె, గుడ్డేలుగు, కోతి, కొండముచ్చు, కుందేలు, తాబేలు, ఇప్పపిల్లులు, ఉడుములు మొదలైన జంతువులను వేటాడుతారు. వేటకు వేసవి కాలంలో అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుత కాలంలో జంతువులను చంపడం నేరమవడంతో వేట మీద జీవనం సాగించే కుంటుంబాలు రోడ్డున పడ్డాయి. వేట మీద మక్కువ పోక జంతువుల బారి నుండి తమ ప్రాణాలను రక్షించుకోవడానికి, పంటను కాపాడుకోవడానికి మొక్కుబడిగా వేటాడుతున్నారు. తోగుల్లో, సెలిమేల్లో నీళ్ళు తాగే పిట్టలను, గొర్రెంకలను, చిలుకలను, గువ్వలను, పుర్రోడ్లను, సెదల పిట్టలను, పిచ్చుకలను, గొంగలను, బుడుబుంగలను, గద్దలను మొదలగు పక్షులను పట్టి తింటారు. సాంప్రదాయ పద్ధతుల్లో తయారు చేసిన మీటలు, వడిసెలు, గిల్లేరు, విల్లు, బాణం, రాళ్ళు, బంక, జిగురు మొదలైన పద్ధతుల ద్వారా పక్షులను పట్టుకోవడానికి ఉపయోగిస్తారు.

**ముగింపు**

కోయలు ప్రకృతి ప్రియులు వారికి మతము లేదు. ప్రకృతే వారి మతం. కోయలు ప్రధానంగా తమ పూర్వీకులనే తమ దేళ్ళుగా భావిస్తారు. ప్రతి వంశంలోని మూల పురుషలను ఇలవేల్పులుగా కొలుస్తారు. వాగు, వంక, రాళ్ళు, రప్పలు, కొండ, గుట్ట, చెట్టు, పుట్ట వీటినే దేవుళ్ళుగా మొక్కుతారు. ప్రస్తుత కాలంలో కోయ సంస్కృతి మీద ఇతర సంస్కృతుల ప్రభావం అధికంగా పడుతుంది. కోయలు అనేక రకాల మత మార్పులకు గురి అవుతున్నారు. ఈ పరిస్థితులు మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

★ రచయిత: పరిశోధక విద్యార్థి, ఓయూ

విమర్శ

# గోరటి వెంకన్న ప్రాకృతికత

డా. దుగ్గి గాయత్రి

ప్రకృతిని తన సాహిత్యానికి ఆలంబనగా చేసుకున్న అభినవ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న. జీవన పోరాటంలో ప్రకృతి పాత్ర చిత్రంగా తన గేయాలలో ఇముడ్చుతాడు. అంతే విచిత్రంగా విశ్వాంతరాలంలో వచ్చిన మార్పులు, వాటి దుష్ఫలితాలను మనకు కళ్ళకు కట్టినట్లుగా ముందుంచుతాడు. మంచిని ప్రబోధించే నేస్తంలా మన అందరి మనస్సులో తనదైన ముద్రను వేసుకున్నాడు గోరటి వెంకన్న. కొండంత విషయాలను గోరంత పదాల్లో తెలియజేసే మహామనిషి మన వెంకన్న. ప్రకృతి సౌందర్యంలో మనల్ని ఓలలాడిస్తూనే మన చుట్టూ పేరుకపోయిన సాంఘిక, రాజకీయ, ఆర్థిక మాలిన్యాలను తనదైన గొంతుకలో తెలియజేసే గొప్ప తత్వజ్ఞాని. తెలంగాణ మాండలిక పదాలను తనదైన శైలిలో ప్రకృతి అంతఃబహిర్ స్వరూపాలను గేయరూపంలో మన ముందుంచే మహాజ్ఞాని.

**వానొచ్చెనమ్మా వరదొచ్చెనమ్మా**

**వానతోపాటుగా వణుకొచ్చెనమ్మా**

**ముక్కు మూసుకొని మూసిల మునిగింది.** అంటూ సాగే ఈ గేయంలో మన పల్లె జీవనంలో నిత్యం మనం చూసే దృశ్యాలెన్నింటినో వర్షం సాక్షిగా చక్కగా పొందుపరిచారు.

**'సెట్ల కురుల మీద బొట్లు బొట్లు రాలి గట్లబండలమీద గంధమై పారింది'** అంటూ వాస్తవ దృక్పథాన్ని కాల్పానిక దృష్టితో ఎంతో చక్కగా వర్ణించాడు. చెట్లను మనుషులతో పోలుస్తూ, ఆకులమీద పడిన చినుకులను కురులమీద అందంగా బొట్లు, బొట్లుగా ఉన్నాయని అదే వానచినుకు భూమిపై పడ్డప్పుడు గట్లమీద బురదమయం కావటాన్ని పడతి రాసుకొనే గంధంతో పోల్చుతూ ప్రకృతిని చక్కగా వర్ణించాడు. ఇంకా ఈ గేయంలో వాన వచ్చి ఎప్పటి నుంచో పేరుకుపోయిన మాలిన్యాలను ఏ విధంగా కడిగిపారేసిందో చక్కగా తెలియచేసారు. (పరికి పిట్ట ముక్కుపాసిని గడగడం, పచ్చని నాచును పలుగ చీరేయటం వంటి పదాలను వాడాడు) కొంగకు విందు చేయడం వంటి పదబంధాలను వాడటం ద్వారా వాన పడటం ద్వారా సకల జీవరాసులన్నింటికీ కడుపు నిండా తిండి దొరుకుతుందనే కోరికను తెలుపుతూ, జీవితంపై కొత్త ఆశలు చిగురిస్తాయని తెలియచేశారు.

వర్షానికి కుల, మత బేధం లేదని వేములవాడ రాజన్న వేడుక, సాధుల సమాధుల సన్నిధి, సూఫీల దర్గాలు వంటివి ఉదహరిస్తూ చక్కగా వర్ణించారు.

చిటపట చినుకులుగా పడిన వాన పాపాయిలా పారాడుకుంటూ గోదావరిలో కలిసి భద్రాచలంలో సీతమ్మ పాదాలను కడిగింది అనే వాన చినుకులు క్రిష్ణమ్మ ఒడిలోన ఇష్టంగా వొదిగాయి. తనకు ఇష్టమున్నాలేకున్నా కూడా పట్నంవాసులు దాహార్తిని తీర్చుటకు వచ్చి ముక్కు మూసుకొని మూసీల మునిగింది అని చెప్పడంలో వెంకన్నగారి ఆంతర్యం తెలుస్తుంది. నదులు మానవతప్పిదాల వలన పవిత్రంగా ఉండాలింది పోయి పూర్తిగా కాలుష్య భరితమై తమ ఉనికినే కోల్పోతున్నాయనే ఆవేదనను వ్యక్తం చేశాడు.

**అస్సోయ్యి....ఇస్సోయియా హైలెస్సా రంగో**

**విసురోయియా-గుంజోయియా వల విసిరి గుంజోయియా అంటూ సాగే "సెరువు"**

గేయంలో చెరువు నిండితే గ్రామ ప్రజల ఆనందం చేతి వృత్తులవారికి చేతినిండా పని దొరికి వారంతా ఎంత ఆనందంగా తమ జీవనాన్ని సాగిస్తారో వలసలు వెళ్ళినవారు కూడా తమ ఊరి చెరువు నిండిందని తెలిసి సంతోషంగా లేగదూడ తన దగ్గరికి ఎలా గంతులు వేసుకుంటూ వస్తుందో అదేవిధంగా ఆ ఊరి జనాలంతా అలా ఊరు చేరుకుంటారని, చింతలు, మామిళ్లు పండ్లతోటలు పట్టి పొట్టపోసుకునే తెలుగోళ్ళ బెస్తోళు ళ సెరువు నిండగానే ఒదిలేసి చేపలు, కొర్రమీన్లు పట్టి పేరుంజలకే సేవలను కొలిసిస్తే ఊరుపేదల నోటి సేదెల్లి పొయ్యేదని, జంగాలు, దాసర్లు, బుడుబుక్కల వాళ్ళు, గంగిరెద్దులోల్లు, గంటపకీరోల్లు ఇలా అందరు కూడా సాయంత్రం కాగానే పక్షి గూటికి చేరినట్లుగా సెరువు నిండగానే. తమ ఊరికి

చేరుకుంటారని, పొరకలు, బుట్టలు అల్లె ఎరుకలోల్లకు చేతినిండా పని దొరికి సంపాదన పెరిగి, సేపలు, పిట్టల శికార్లు చేసి అల్లం వెళ్ళిపాయ అమ్ముదెక్కువాయ సందేల విందుల సంబురాలు ఎక్కువై బుట్టి దుకుణం గల్లపెట్టె నిండేదని చమత్కారంగా వర్ణించాడు.

సెరువు నిండి కట్ట కింద వున్నటువంటి ఈదులు పొంగి కల్లుప్పొంగగా గౌండ్లోల్ల లొట్టికి గౌరవం పెరిగి మైసమ్మకు బోనాలెత్తేరు. కుమ్మరి, వడ్రంగి మధ్యన బంధుత్వాలు పెరిగి ఊరు పరువెంతో నిలిచేదని భాందవ్యాలు సెరవులు నిండడం మూలంగా మరింత ధృడంగా మారుతాయని తెలియచేశారు..

ఎండాకాలం వచ్చిన తర్వాత కూడా సెరవులోని తేసుతో పుచ్చకాయలిరివిగ కాస్తాయని. నీరింకిపోయిన కూడా కొంగలు పురుగులను తింటూ ఇంకా చెరువునే ఆశ్రయించేవని చెరువుచుట్టే జీవరాశుల బ్రతుకు అని తేలికైన పదాలతో చక్కగా వర్ణిస్తూనే పురుగుమందులతోటి సెరువు నీరు విషమయ్యిందని, బాబాల కోసం లోభులు చేసే పాపాలతో రంగురంగుల సేవ జాతులంతరించి పోతున్నాయనే ఆక్రందనను తెలియచేశారు.

**వాగు ఎండిపాయెరో**

**పెద్ద వాగు తడిపేగు ఎండిపోయేరో...**అనే గేయంలో వాగు ఎండిపోవడంతో వాగును ఆశ్రయించి వున్నటువంటి మేకల మందలు, పెట్టలు, తీతువమ్మలు, గువ్వలు, జాలర్లు, చాకలివారు ఏ విధంగా బాధపడుతారో తెలియచేస్తూనే మానవుల్లో తమ స్వార్థం కోసం బోరుబావులను వేసి నగరనిర్మాణం కోసం జిలుగు వెలుగుల మేడల నిర్మాణం కోసం వాగొడ్డున వున్నటువంటి ఊర్లన్ని నాశనం చేస్తున్నారనే ఆవేదనను తెలియచేశారు. పారుతున్న పెద్ద వాగు అలలు పాలకన్నా తెల్లగా వుంటాయని, దుందుబి సెలిమెల ఊరుతున్న నీరు తేనెకన్నా తీయగా ఉంటుందని వాగొడ్డున వున్న ఇసుక తిన్నెలు పత్తిపాన్పుల కన్నా మెత్తనని, తాజమహల్ అందాలకంటే కూడా పిచ్చుక గూళ్ళే అందంగా వున్నాయని గుర్తుచేసుకుంటూ ఆ గుర్తులన్నీ ఇప్పుడు చెరిగిపోయాయని తన భావనలను గోరటి వెంకన్న గారు తెలియచేశారు.

**దేవతమ్మో దేవసిరిమల్లె...**

**ఏమెరుగని జనులు ఏటిపాలయ్యిరి...** ఈ గేయంలో మానవులు తమ సౌకర్యవంతమైన విలాసాల కోసం విశ్వమంతా కాలుష్యభరితం చేసి ఏ విధమైన విష ప్రభావాలకు లోనవుతున్నారో ఈ గేయంలో చక్కగా వర్ణిస్తూ మనలో సామాజిక స్పృహను తెచ్చే ప్రయత్నంచేశారు. ఋతువులు తను గమనాన్ని మార్చుకోవడంతో భూతాపం పెరిగి చల్లని భూతల్లి తల్లడిల్లుతున్నది, అని పచ్చని పంట చేలలో విషం పారి పండిన ధాన్యం విషపూరితంగా మారిందని, పండ్లు కూరగాయలలో ఎరువుల వాడకం వలన సారమంతా పోతుందని కంపెనీలలో వచ్చే పొగతో, పెట్రోలు పొగతో వాయు కాలుష్యం పెరుగుతున్నదని, లారీల స్కూటర్ల మోతతో శబ్ద కాలుష్యం పెరుగుతున్నాదని తద్వారా గోరింక పిట్టలు, జింకలు, కుందేలు వంటి ప్రాణుల మనుగడే కష్టంగా మారిందని, బాంబుల పేళు ల్లతో, రాకెట్ ప్రయోగాలతో భూతల్లి జడుసుకుంటున్నదని కోపంతో కడలి కదుపు మరిగిపోయి ఒడ్డున ఉన్న ఊర్లన్ని ముంచేస్తున్నదని వీటన్నింటికి మానవ కార్యకలాపాలే కారణమనే సామాజిక స్పృహను వ్యక్తపరుస్తున్నాడు.

**ఓ పుల్లా, ఓ పుడక, ఎండుగడ్డి, సిన్న కొమ్మ**

**సిట్టిగూడు పిట్టబతుకే ఎంతో హాయీ.....** అనే ఈ పిట్ట బతుకు పాటలో ఎంతో మేధావిననే అహంకారంతో విర్రవీగే మనుషుల కన్నా పిట్ట బతుకే ఎంతో హాయిగా ఉంటుందని ఈ పూటకుంటే సాలు రేపు ఎట్లనే ధ్యాస దానికుండదు. లోభితనమనేదే దానికి తెలవదు. మానవులో లోభత్వం బాగా పెరిగిందని చెప్పకనే చెప్పారు గోరటి వెంకన్న గారు. చీకటైతే పడుకొని వేకువగానే లేచి లోకంలోని వింతలన్నీ చూస్తూ హాయిగా తన జీవితాన్ని ఏ చీకు చింతా లేకుండా సాగిస్తుందని దాన్ని చూసి మనమెంతో నేర్చుకోవాలని దానికి చదువు నేర్పే గురువులేదు, రోగమొస్తె మందులేదు. దానికి దేని మీద ఆశలేదు. కాని ఆశలెక్కువైన మనిషి మాత్రం దాని దగ్గరకే వెళ్ళి జాతకం అడుగుతున్నాడు. ఎంత వెర్రి మనిషి అని వాపోయాడు. ఈ గేయం చదువుతుంటే గుర్రం జాషువా రాసిన గిజిగాడు పద్యాలు గుర్తుకు వస్తాయి.

ప్రకృతిలోని ప్రతి అణువులోను లీనమై, నిగూఢంగా పరిశీలించి వాటి నుండి మానవుడు నేర్చుకోవాల్సిన అంశాలను, సమానత్వాన్ని సహజత్వాన్ని తనదైనశైలిలో సమాజానికి అందించాడు గోరెటి వెంకన్న.

**★ రచయిత: అధ్యాపకురాలు**

విమర్శ

# విశ్వనాథ వారి 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' విద్యా మూల్యాంకనం

డా. బోలుగడ్డె అనీల్‌కుమార్

అస్తంగతుడై పూర్వాద్రి పొడము మార్తాండ మహోదయుడు శ్రీశ్రీశ్రీ విశ్వనాథ సత్యనారాయణ కవి సమ్రాట్టు. వీరు చేపట్టని సాహితీ ప్రక్రియ లేదు. 57 నవలలు, 27 పద్యకావ్యాలు, 16 నాటకాలు, 11 విమర్శలు, చిన్నకథలు – పాటలూ, శతకాలు, గేయకావ్యాలు, 'వాటీజ్ రామాయణ్ టు మి" లాంటి ఇతరాలు మొత్తం 121 పుస్తకాలు విశ్వనాథ వారి అక్షరతూణీరంలో ఉన్నాయి. ఈ పుస్తకాలన్నీ వేటికవే విలక్షణతను పొందాయి. ఆ విలక్షణతలో భాగంగా తెలుగు భాషకు జరిగిన అన్యాయాన్నే గాకుండా మొత్తం భారతీయ విద్యావ్యవస్థపై ప్రభావం చూపుతూ ప్రాచ్యవిద్యాసంస్కృతులకు నష్టాన్ని వాటిల్లింపజేస్తున్న ఆంగ్ల విద్యావ్యవస్థకు పట్టం కడుతున్న వారికి కనువిప్పు కలిగేలా వ్రాయబడిన కాల్పనిక నవలయే ఈ 'విష్ణు శర్మ ఇంగ్లీషు చదువు'. ఇది 1966 ప్రాంతం నాటి రచన. 2017 నాటికి కూడా అర్థవంతమైన సమర్ధ రచన.

భాషోద్యమకారులు, పండితులు, ఉపన్యాసకులు, ప్రభుత్వాధికారులూ అందరూ చదవాల్సిన నవల.

మనిషికి సంస్కారమెంత ముఖ్యమో భాషకు వ్యాకరణమంత ముఖ్యము. వ్యాకరణ నిష్ఠ భాషకు ఒక క్రమత్వాన్ని నిర్దేశిస్తుంది. అంతేగాని ఆ భాషాభివృద్ధిని అడ్డుకోదు. అలాంటప్పుడు అసలు వ్యాకరణ నియమాన్ని అనుసరించకుండా అడ్డూ ఆపు లేని ప్రవాహంవలె దూసుకుపోయే ఆంగ్ల ప్రభావం ప్రపంచ దేశాల భాషలన్నింటినీ శాసించి వాటి ఉనికికి ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. ఈ విషయాలను గతంలో కొత్తపల్లి వీరభద్రారావు గారు తమ సిద్ధాంత గ్రంథంలో ఉటంకించినప్పటికీ అందరికీ చాలా సులభరీతిలో నవల ద్వారా వివరించిన సక్యం గ్రంథనకారులు విశ్వనాథ సత్యనారాయణ వీరు ఎలాంటి పాత్రలతో, ఎలాంటి సన్నివేశాలతో మనకు విద్యావ్యవస్థపైగల ఆంగ్ల ప్రభావాన్ని గూర్చి చెప్పారో తెలియజేయడమే నా ఈ పరిశోధనా పత్ర ముఖ్యోద్దేశ్యం. ఈ నవలను ఈ మధ్యకాలంలో అందరికీ అందుబాటులో ఉండేటట్లు వ్యావహారిక పదజాలంతో నాటకీకరించిన ఆర్థికశాస్త్రజ్ఞుడు శ్రీ సి.యస్. రావు.

**ఈ నవలలోని పాత్రలు**

విశ్వనాథ సత్యనారాయణ, విష్ణుశర్మ, తిక్కన సోమయాజి, వరలక్ష్మి (విశ్వనాథ వారి భార్య), పావన శాస్త్రి (విశ్వనాథవారి కుమారుడు), దుర్గమ్మ (విశ్వనాథవారి కుమార్తె), రాఘవ (విశ్వనాథ వారి మిత్రుడు), మహేంద్రుడు, బృహస్పతి, పరవస్తు చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగం, కొందరు యువకులు.

**సంక్షిప్త కథారూపం**

ఇంగ్లీష్ భాషా వ్యామోహంపై సంధించిన వ్యంగ్యాస్త్రమే ఈ నవల. విశ్వనాథ వారికి వచ్చిన కలదీనికి భూమిక. ఆ కలలోని అంశాలివి : స్వర్గవాసుల్లో ఇంగ్లీష్ వచ్చినవాళ్ళ ప్రభావం ఎక్కువయ్యింది. స్వర్గపాలన సవ్యంగా సాగాలంటే ఆ భాషా జ్ఞానం అవసరమని ఇంద్రుడు భావించి విష్ణుశర్మను, తిక్కనను భూలోకానికి పంపుతాడు. వాళ్ళిద్దరు విశ్వనాథ సత్యనారాయణ దగ్గర ఇంగ్లీష్ నేర్చుకుంటారు. తిరిగి స్వర్గానికి వెళ్ళిపోతారు. కలచెదిరిపోతుంది. ఈ కలలోని అంశాలను విశ్వనాథవారు తన మిత్రుడైన రాఘువకు చెబుతున్నట్లుగా వ్రాసిన కథయే ఈ విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు నవల.

**నవలలో ద్యోతకమైన అంశాలు**

చనిపోయి ఇంద్రలోకాన్ని చేరిన విష్ణుశర్మ (పంచతంత్ర గ్రంథ రచయిత), తిక్కన (కవిబ్రహ్మ), మహేంద్రుని కొలువులో ఉంటారు. అప్పుడు ఇంద్రుడు, బృహస్పతి, తిక్కన గారలు విష్ణుశర్మ వ్రాసిన పంచతంత్ర గ్రంథాన్ని పొగుడుతూ ఉంటారు.

అదే సమయంలో కొందరు స్వర్గాన్ని చేరిన యువకులు ఆంగ్ల ప్రభావంల్ల ఇంగ్లీష్‌లోనే విష్ణుశర్మ నిజానికి ఆ గ్రంథం


ప్రాయలేదని గట్టిగా అరుస్తారు. ఆ ఇంగ్లీష్ మాటలు చూడండి:

ఇంగ్లీష్ తెలియని విష్ణుశర్మ తనను పొగుడుతున్నారను కుంటారు. వెంటనే ఆ యువకులు మేము నిన్ను పొగడటం లేదని మళ్ళీ ఇలా అంటారు. ఈ కల్పిత వాక్యాలు ఆంగ్లభాషావ్యామోహం భూనభోంతరాలను దాటి ఎలా ముందుకు వెళ్ళిందో అంటే విశ్వమంతా ఎలా వ్యాపించిందో తెలియజెప్పే వ్యంగ్యాస్త్రాలు. ఇంగ్లాండ్‌ను నార్మన్‌లు 150 సంవత్సరాలు పరిపాలించినప్పుడు బ్రిటీష్ వారిపై ఫ్రెంచ్ భాషా ప్రభావం 150 ఏళ్ళూ ఉండేది. అలాగే బ్రిటీష్‌వారు భారతదేశాన్ని 200ల ఏళ్ళు పరిపాలిస్తే భారతీయ భాషలన్నింటిపై ఆంగ్ల ప్రభావం ఉందనీ, ప్రపంచీకరణ నేపథ్యంలో అదింకా ఉధృతమైందని తెలుస్తున్నది. కావచ్చుగాక కానీ స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా పరాయి పాలనలేని సమయంలో కూడా ఇంతటి పరభాషావ్యామోహమా అని నవలాకారుడు వ్యథ చెందుతూ ఆంగ్లభాషా తీవ్రతను ఇలా యువకుల ద్వారా తెలిపాడు.

ఇకపోతే విష్ణుశర్మ తానే పంచతంత్రం వ్రాసానని నిరూపించుకోవడానికి గానూ పరవస్తు చిన్నయ్యసూరిని, కందుకూరి వీరేశలింగాన్ని సాక్ష్యులుగా పిలిచాడు. అయినా లాభం లేకుండా పోయింది. అప్పుడు విష్ణుశర్మ బాధపడుతుంటే మహేంద్రుడు ఓదార్చబోతాడు. విష్ణుశర్మ ఇంద్రునితో అంటాడు – మహేంద్ర నా బాధ ఆయువకులు నాపై అభియోగం మోపారని కాదు వారి భాషకు అర్థం తెలియరాలేదని బాధపడుతున్నాను అన్నాడు. అప్పుడు మహేంద్రుడు కూడా స్వర్గపాలన సవ్యంగా సాగాలంటే ఆంగ్లభాష కూడా అవసరమని ఆలోచించి విష్ణుశర్మ కోరిక మేరకు విష్ణుశర్మని, వీరికి తోడుగా తిక్కన భూలోకానికెళ్ళి విశ్వనాథ సత్యనారాయణ గారి దగ్గర ఇంగ్లీషు చదువు నేర్చుకురమ్మని పంపిస్తారు.

విష్ణుశర్మ, తిక్కనలు ఇద్దరూ మాయారూపంలో విశ్వనాథ వారిల్లు చేరి ఆంగ్లవిద్యను నేర్పమని వేడుకుంటారు. అప్పుడు ఆయన తన భార్య ఊరికి వెళ్ళిందని వచ్చేలోపల మీరు సశరీరంగా కనపడాలని చెబుతూ పైగా ప్రతిరోజూ విష్ణుశర్మ గారే పాకములు కూడా సిద్ధం చేయాలని, కేవలం ఆదివారం నాడు మాత్రమే ఇంగ్లీష్ చదువును నేర్పిస్తానని ఆ ఇరువురితో ఒప్పందం చేసుకున్నాడు. అనుకున్నట్లే మొదటి ఆదివారం పాఠం ప్రారంభమైంది. అప్పుడు విష్ణుశర్మ అన్నారు – నాలుగైదు నెలల్లో ఇంగ్లీషు వచ్చేస్తుందా అని దానికి విశ్వనాథవారు వ్యంగ్యంగా కొంచెం ఆలోచించి ఇదివరకు ఏడో యేటా, ఎనిమిదోయేటా ఇంగ్లీష్ చదువును మొదలెట్టేవారు. ఇప్పుడయితే మూడవ ఏటనుండే మొదలెడుతున్నారని ఆంగ్లవ్యామోహనుల గురించి తెలిపాడు. 'A B' లతో మొదలెట్టి 'BA' దాకా చదవాలన్నాడు. ఈ చదువు చదవాలంటే 15 సంవత్సరాలు పడుతుంది అంటాడు విశ్వనాథ. అప్పుడు విష్ణుశర్మ ఇలా అంటాడు – భారతీయ విద్యలైన తర్కం, వ్యాకరణం, మీమాంస, వేదాంతం వీటన్నింటినీ 12 సంవత్సరాలలోపే ఔపోసన పట్టవచ్చు కానీ ఒక్క ఇంగ్లీష్ విద్యకోసం 15 సంవత్సరాల కాలాన్ని వెచ్చించాలా అని అంటాడు. దీనినిబట్టి మన దేశంలో 12 సంవత్సరాల ప్రాయానికే సంపూర్ణావగాహన ఉన్న చదువులు చెప్పేవారని తెలుస్తున్నది. అందులో వృత్తివిద్యలు కూడా ఉండేవి. విష్ణుశర్మ సమాధానం విని విశ్వనాథ ఇలా అంటారు. ఇంగ్లీషు చదువులు చదివితేనే ఉద్యోగాలొస్తాయి. నెల తిరిగేసరికి జీతపు రాళ్ళు చేతిలో పడతాయి. ఈ విద్య సంపాదన కోసం చదివే చదువు. ప్రాచ్య విద్యాజ్ఞానం కోసం చదివే చదువని ప్రాచ్య, పాశ్చాత్య విద్యల భేదాన్ని వివరిస్తారు. అందుకే అన్నారు ఆచార్య కొత్తపల్లి వీరభద్రారావు గారు విజ్ఞానమనే విహంగానికి సంస్కృతాంధ్రములు రెండు రెక్కలవంటివీ అని. దీనిని ఒక రేఖాచిత్రంలో చూసినట్లైతే –

**విజ్ఞాన విహంగం**




ఇక ఒక రోజు విశ్వనాథ వారు విష్ణుశర్మకు, తిక్కనకు పెద్దక్షరాల బడిని (Capital Letters), చిన్నక్షరాల బడిని (Small Letters)ని దిద్దమని సూచించాడు. ఇలా దిద్దితేగానీ

భాష తేలికగా రాదని చదవడం కూడా రాదని చెప్పాడు. దానికి విష్ణుశర్మ అయ్యా విశ్వనాథా! మనవాళ్ళు మొదట భాషలో ఉన్న శబ్దాలు తెలిసుంటే చదవడం సులభమని తెలిసి ఆంధ్రనామ సంగ్రహాన్ని బోధించేవారని చెప్పాడు. దీనినిబట్టి మన విద్యాబోధన ప్రణాళికావైశిష్ట్యం అర్థమవుతున్నది. విశ్వనాథ పాఠం ప్రారంభమైంది 'A' అంటే 'ఒక' అని అర్థం చెప్పాడు. వీరి చర్చలోని పిండితార్థమిది: 'A' అనే అక్షరముంది. 'I' అనే అక్షరం ఉంది. 'A' అంటే 'ఒక' అని, 'I' అంటే 'నేను' అని అర్థం. వీటిని క్యాపిటల్‌లో వ్రాస్తేనే ఈ అర్థం. లేకపోతే లేదు. మరి నీవు అనే మాటను ఆంగ్లంలో 'you' అని అంటారు. 'యు' అన్నప్పుడు 'U' అని వ్రాయాలి గాని 'yo' అనే అక్షరాలెందుకు? అలాగే బ్యాడ్ అంటే 'BAD' అని వ్రాస్తాం.

B – బ కారానికి సంకేతం

D – డ కారానికి సంకేతం అయినప్పుడు

A – 'య' కారానికి సంకేతం కావాలి. కానీ ఆంగ్లేయులు 'A' ను అకారానికి సంకేతమన్నారు. అలాంటప్పుడు BAD 'బడ్' అవుతుందేగాని బ్యాడ్ అయ్యే అవకాశం లేదు. పైగా 'A' అకారం అంటే హ్రస్వ అకారమే అవుతుంది. మరి దీర్ఘానికి ఇంకో అక్షరం కావాలిగా? సరే GODలో గాడ్ అంటున్నాము.

G – గ కరానికి సంకేతం.

D – డ కారానికి సంకేతం. మరి

O – ? ఈ పద ఉచ్చారణ రీత్యా 'O' 'ఆ' కారానికి సంకేతం కావాలి. అంటే 'A' హ్రస్వాక్షరవమయితే 'O' దీర్ఘక్షరమనా అర్థం అని అడిగితే కాదనే సమాధానం వస్తున్నది. దీన్నిబట్టి మన ప్రాచ్య భాషలలోని వర్ణసమామ్నాయము ఎంత గొప్పగా ఉన్నది. 26 అక్షరాలతో కూడిన వర్ణమాల ఎలా ఉన్నది తెలుస్తున్నది. పైగా ప్రాచ్య భాషల్లో గొప్పదైన సంస్కృత భాషంటే 'పరిష్కృతమైన భాష' లేదా సంస్కరింపబడిన భాష అని అర్థం. ఇలాంటి చక్కని భాషా ప్రభావం అన్ని భారతీయ భాషలలోనూ అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉన్నది.

ఇంగ్లిష్ భాషను నేర్చుకోవడమంటే వసుదేవుడు గాడిద కాళ్ళను పట్టుకోవడమే అవుతుంది అన్నాడు నవలాకారుడు. ఇంకా ఆంగ్లంలోని చాలా చిక్కులను చెప్పారు. 'Q' అనే అక్షరాన్ని 'క్యు' అని పలుకుతాం. Oblique, Cheque వంటి పదాల్లో 'q' అనే అక్షరం ఉన్నప్పటికీ మళ్ళీ దాని ప్రక్కన ఈ 'ue' ల చేరిక ఎందుకు? పైగా 'క' కారాన్ని సూచించడానికి 'k' ఉన్నప్పుడు మళ్ళీ ఈ 'క్యు' ఎందుకు? సరే 'క' కారాన్ని సూచించడానికి k,qలు రెండూ ఉంటే మరి 'CAT'లోని 'క్యాట్' అనే ఉచ్చారణను సూచించడానికి k నో q నో రావాలి గానీ ఈ 'C' ఎందుకు? పైగా ఈ 'C' ను కొన్ని సార్లు 'చ' గా కూడా పలుకుతున్నారు. ఏమిటి ఈ అస్పష్టత? అనుకుంటే ఇంకో అస్పష్టాంశం మరీ విడ్డూరంగా ఉంటుంది. But అనే పదంలో 'U' ను 'యు' అని పలుకుతాం కానీ Butలో బట్ అని అంటున్నాం. నిజానికి బుట్ అనాలి మరి 'Put'లో పుట్ అని అంటున్నాం. But లాగా పట్ అనాలి మరి అలా అనడం లేదేంటి? Cut, Nut, Hut వంటి పదాల్లో కుట్ – నుట్ – హుట్ అనుకుండా 'కట్ – నట్ – హట్' అని ఎందుకు అంటున్నారు. అంటే వీరికి సరియైన నిరుక్తశాస్త్రం లేదన్నమాట అని విశ్వనాథవారు వాపోయారు. అంటే ఏ పద్ధతీ లేని భాష అన్ని పద్ధతులతో అలరారుతున్న ప్రాచ్య భాషలను శాసించడమా? ఇదేమి వింత అని బాధను వెలిబుచ్చారు. అలాగే తెలుగు చలనచిత్రాలు మూడు గంటలుంటాయనీ, ఇంగ్లీష్ సినిమాలయితే ఒకటిన్నర గంట ఉంటుందని అందరూ ఇష్టపడుతున్నారని ఇంతటి అప్రాచ్యత్వం ఎందుకని రచయిత ప్రశ్నిస్తున్నాడు.

ఇక విశ్వనాథవారు తిక్కన గారి విష్ణుశర్మ ప్రవచనాలు పెట్టిస్తే వచ్చిన కుర్రకారంతా గట్టిగా అరచి ఎగతాళి చేసారని చెబుతూ ఎంతగొప్పవారు వచ్చిన అంటే ఒక అంశాన్ని సృష్టించిన లేదా దర్శించిన స్రష్ట లేదా ద్రష్ట వచ్చి చెప్పిన ఈ లోకం పరిభాషా మోహాన్ని తప్ప ప్రాచ్యవిద్య గొప్పదనాన్ని తెలుసుకోరని యదార్థవాదాన్ని విన్నవించారు.

ఇంకో సమయంలో విశ్వనాథ వారు చెప్పే ఇంగ్లీషు చదువుతో ఏగలేక విష్ణుశర్మ, తిక్కనలు చెప్పిన సమాధానం చూడండి.

**మూల్యాంకనం**

ఇప్పటిదాకా మనం చూసిన అంశాలేగాక ఆంగ్లంలో క్లిష్టతతో, అస్పష్టంగా కనపడే అంశాలు కూడా చాలా ఉన్నాయి. అందుకేనేమో? "ఇంగ్లీష్ కీకారణ్యంలోకి ప్రవేశించండి" అని ఒక వ్యాకరణ గ్రంథాన్ని ముప్పాల రంగనాయకమ్మ రచించింది.

అసలు 'వి+ఆ+కరణం' వ్యాకరణం అనే మాట కూడా వాడరాదు. ఆ ఆంగ్లంలోనే 'గ్రామర్' అంటే సరి. ఎందుకంటే వ్యాకరణం = గ్రామర్ కదా.

విశ్వనాథవారు వెలువరించిన భావాల వంటివే మరికొన్నింటిని చూస్తే ముఖ్యంగా విభక్తి ప్రత్యయాలు (Prepositions) - House అనినా, home అనినా ఒకటే కాని ఇంటిలో అనడానికి in house అనాలి. అలాగే at home అనాలి. అన్ని సందర్భాల్లో in, at లు ఒకటి కావు. అలాగే Sympathhy, Mercy, Pity, Kind ఇవన్నీ సమానార్థకాలు. అయితే నీపై నేను దయచూపిస్తున్నాను అని అన్నప్పుడు రకరకాల విభక్తి ప్రత్యయాలు వాడబడ్డాయి. గమనించండి.

I show pity *on* you

I show kind *to* you

I show sympathy *for* you. ఇక్కడ ఉన్న on ≠ to ≠ for లు అన్ని సందర్భాలలో ఏమాత్రము సమానార్థకాలు కావు. ఇలా మనం గమనిస్తే ఆంగ్లభాషాస్వరూపానికీ, ప్రాచ్య భాషల స్వరూపానికి ఎంతో తేడా ఉంది. అందుకే ఆంగ్లభాషలోని ఎన్నో పదాలు ఇతర భాషల నుండి ప్రవేశించి ఆంగ్లాన్ని సుసంపన్నం చేశాయి. ఈ విషయాన్ని 'జాన్ రే' అనే భాషావేత్త కూడా చెప్పాడు. అంటే రవి అస్తమించని బ్రిటిష్ స్థాపనకు పూర్వమే ఈ ఇతర భాషా సంపర్కం ఆంగ్లానికి జరిగింది. ఇటువంటి భాషవల్ల ఎన్నో ప్రాచ్య భాషలు శైథిల్యం చెందాయి. దీనికి మంచి ఉదాహరణ నాగాలాండ్‌లోని మాతృభాష మరికొన్ని ఈశాన్య రాష్ట్ర భాషలు. ఈ భాషలు ఏకంగా మాతృభాషనే కాదు వారి సంస్కృతిని, జీవనవిధానాలను కూడా పూర్తిగా మార్చివేసింది. ఎన్నో మాతృభాషలుగా మారటానికి కారణం అన్యభాషా వ్యామోహమే. ఈనాటికీ భాషాభిమానంతో బ్రతుకుతున్న భారతీయులు కేవలం తమిళు లు మాత్రమేనని చెప్పవచ్చు. కాబట్టి 'విష్ణుశర్మ ఇంగ్లీష్ చదువు' వంటి రచనలు కొంత వరకైనా భాషాభిమానాన్ని, భారతీయ విద్యా ప్రాముఖ్యాన్ని తెలుసుకోవడానికి ఉపకరించాయని చెప్పడంలో సందేహం లేదు.

**ఉపయుక్త గ్రంథాలు**


1. విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు – విశ్వనాథ సత్యనారాయణ

2. విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు (నాటకీకరణ) – సి.యస్.రావు

3. తెలుగు చరిత్ర (త్రైమాసిక పత్రిక) – చెన్నై, బోలుగద్దె అనిల్ కుమార్ – వ్యాసం.



**రచయిత: తెలుగు అధ్యాపకులు,**

**నారాయణ 'ఐఎయస్' అకాడమి, హైదరాబాదు.**


<u>**రచయితలకు సూచనలు:**</u>

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 15వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

**- సం.**

విమర్శ

# సుధలొలికించే సాహిత్యం-సుకవి జాషువా కవిత్వం

డా.పోతుల వెంకటేశ్వర్‌రెడ్డి

1895 సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో లింగమ్మ వీరయ్య దంపతులకు జాషువా జన్మించారు. ఆయన తల్లిదండ్రులది వర్ణాంతర వివాహం. వారిది క్రైస్తవ మతం. జాషువా వినుకొండలోని మిషనరీ, హిందూ పాఠశాలలలో విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే తన సహాధ్యాయుడైన దీపాల పిచ్చయ్య శాస్త్రితో కలిసి కొన్నాళ్లు జంట కవిత్వం చెప్పాడు. శతావధాని జూపూడి హనుమచ్ఛాస్త్రి శిష్యరికంలో కాళిదాసు కావ్యాలను చదువుకొని, తిరుపతి వెంకటకవుల స్ఫూర్తితో కవితా సాధనకు పూనుకున్నాడు.

బాపట్ల హయ్యర్ గ్రేడ్ స్కూల్లో ఉపాధ్యాయుడుగా శిక్షణ పొందిన జాషువాకు 1910లో "మేరి"తో వివాహం జరిగింది. ఉత్తమ కవిగా భాసించడానికి జాషువాకు ఎన్నో సమస్యలు ఎదురైనాయి. వాటన్నిటినీ ఎదుర్కొని నిలిచాడు. జాషువా 1910 నుంచి 1959 వరకు ప్రాథమికోపాధ్యాయుడుగా. మూకీ చిత్రాల కథా వాచకుడిగా, తెలుగు పండితుడిగా, యుద్ధ ప్రచారకునిగా, ఆకాశవాణి మద్రాస్ కేంద్రంలో తెలుగు ప్రొడ్యూసరుగా ఉద్యోగాలు చేసి 1960 తర్వాత గుంటూరులో స్థిరపడ్డారు. జాషువా తన రచనలు నాటక ప్రక్రియతోనే ప్రారంభించారు. వాటిలో హిమధామార్కధర పరిణయము, కన్యకా పరమేశ్వరి, రుక్మిణీ కల్యాణము, మదాలస దావీదు చరిత్ర (1920) చిదానంద ప్రభాతము (1921), ధ్రువ విజయము (1925), వీరా బాయి (1926), తెరచాటు (1935) అనే నాటకాల జాషువా 30 కావ్యాలు రచించాడు స్వప్నకథ, అనాథ, గబ్బిలం, కాందిశీకుడు, నేతాజీ, స్వయంవరం, బాపూజీ, రాష్ట్రపూజ, కొత్తలోకం, ముసాఫరులు, నా కథ, నాగార్జున సాగర్, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, క్రీస్తు చరిత్ర, బుద్ధ మహిమ మొదలైన ఖండ కావ్యాలు, కావ్యాలు కుశలవోపాఖ్యానం, చిన్నా నాయకుడు అనే గద్య కావ్యాలు, గిజిగాడు, సాలీడు, భారత వీరులు, శిశువు, శ్మశానవాటిక లాంటి కవితలెన్నో జాషువాకు కవిగా గుర్తింపు తెచ్చాయి.

జాషువా సత్కారాల విషయాని కొస్తే 1933లో 'కవితా విశారద' బిరుదు, 1936 'కవి కోకిల' బిరుదు, 1947 'కవి దిగ్గజ నవయుగ కవి చక్రవర్తి' బిరుదులు, బంగారు గండ పెండేరంతో సత్కారం పొందారు. 1952 'మధుర శ్రీనాథ' బిరుదు. 1964 'విశ్వ కవి సామ్రాట్' బిరుదు పొందాడు. ఎం.ఎల్.సి గా (1964– 1970) చేశారు. 1965లో 'క్రీస్తు చరిత్ర' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. 1970 ఆంధ్రా యూనివర్సిటీచే 'కళాప్రపూర్ణ' భారత ప్రభుత్వంచే 'పద్మభూషణ్' బిరుదులు పొందాడు. జాషువా మధుర సాహిత్యలో భాగంగా ముఖ్యంగా చెప్పుకోదగింది.

**1. పిరదౌసి (1932)**

పిరదౌసి కావ్యం జాషువాని సాహితీ లోకానికి పరిచయం చేసిందని చెప్పవచ్చు. ఇది నాలుగు ఆశ్వాసాల కావ్యం. దీన్ని సింగరాజు లక్ష్మీనారాయణ గారికి అంకితం చేశారు. ఇది తొలిసారిగా 1932లో రాశాడు. గజనీమహమ్మదు భారతదేశంపై 18 సార్లు దండయాత్రలు చేశాడని చరిత్రకారులు చెప్తారు. ఈ దండయాత్రలను విజయ యాత్రలుగా వర్ణిస్తూ తమ రాజ వంశీయుల చరిత్రను రాయమని గజనీమహమ్మదు, పారశీక కవి పిరదౌసిని అడుగుతాడు. ఒక్కొక్క పద్యానికీ ఒక్కొక్క బంగారు నాణాలు ఇస్తానని నమ్మబలుకుతాడు. రాజాజ్ఞను అనుసరించి పిరదౌసి ముప్పది యేండ్లు శ్రమించి మంచి మంచి శబ్దార్థాలతో ''షానామా'' కావ్యాన్ని 60వేల పద్యాలతో పూర్తిచేస్తాడు. దాన్ని చదివిన రాజు, ఆస్థానంలోని పండితుల సూచనలకు ప్రభావితుడై బంగారు నాణాలకు బదులు వెండి నాణాలిస్తాడు. రాజు ఆడిన మాట తప్పినందుకు పిరదౌసి ఆ వెండినాణాలను తిరస్కరిస్తూ లేఖ రాస్తాడు. అది చదివి రాజు ఉగ్రుడౌతాడు. పిరదౌసిని పట్టి చంపమని ఆజ్ఞాపిస్తాడు. అది తెలిసిన కవి రాజ్యం వదిలి పారిపోతాడు. కొన్నాళ్ళ తర్వాత మసీదుపై పిరదౌసి రాసిన పద్యాన్ని రాజు చదువుతాడు. తన తప్పు తెలుసుకున్న రాజు చివరికి మళ్ళీ బంగారు నాణాలను పిరదౌసి ఇంటికి పంపిస్తాడు. కానీ, కవి కూతురు వాటిని తీసుకోదు. ఎన్నాళ్ళో బతకాల్సిన తన తండ్రిని చంపిన బంగారం తనకొద్దని తిరస్కరిస్తుంది.

**'రాజు మరణించె నొకతార రాలిపోయె**

**కవియు మరణించె నొకతార గగనమెక్క**

**రాజు జీవించు రాతి విగ్రహములయందు**
**సుకవి జీవించు ప్రజల నాలుకలయందు'**

మధుర సాహిత్యానికి ఈ పద్యం తార్కాణం. రాజును, కవిని తీసుకొని వారి యొక్క కీర్తి ప్రతిష్టలు ఏ విధంగా నిలిచుంటాయో సున్నితంగా నగ్న సత్యాన్ని మనకు గుర్తు చేశాడు. కవి కావ్య సౌధంలో దివ్యమైన రూపాన్ని పొందునని, కవిని కన్న తల్లి జన్మ ధన్యమని, బ్రహ్మ సృష్టిని చేస్తే, కవి అక్షర జగత్తును చేస్తాడని, కవుల పట్ల తనకు గల అవగాహనను గజినీ ద్వారా పలికిస్తాడు జాషువా. కావ్య రచనకు కవులు కావ్య భాండాగారాల నుంచి ఉదాత్తమైన పదాలను తీసుకొని ముత్యాల వంటి వ్యంగ్య వాచ్యార్థాలను రచనలో నింపి అలంకారాలతో శిరీష కుసుమ పేశలమైన శైలీ విన్యాసంతో కావ్యం ఉండాలని అభిప్రాయపడ్డాడు.

**2. ముంతాజు మహల్:**

భారతదేశానికి మరింత కీర్తి తెచ్చిన వాటిలో ముంతాజు మహలు ఒకటి. దీన్ని దర్శించిన తర్వాత జాషువా తన అనుభూతిని రంగరించి రాసిన కావ్యం. దీన్ని తన మాతృమూర్తి లింగమాంబకు అంకితమిస్తూ ఇలా వర్ణించాడు కవి.

**"లీవు బ్రతికియుండ నీవాంఛితార్థముల్**
**దీర్చు శక్తి లేక దిగులు వడితి**
**వేయి నగలకన్న వెలగల్లు కతి భూష**
**నంపుచుంటి స్వీకరింపు మమ్మ"**

తన మాతృమూర్తికి ఈ కావ్యాన్ని అంకితమివ్వాలని అనుకుంటున్నట్లు, ప్రచురించడానికి ఆర్థిక సహాయం చేయమని తిక్కవరపు రామిరెడ్డిగార్ని అడిగితే, సహృదయంతో అంగీకరించారని కవి చెప్పుకోవడమే కాకుండా, ఆయనను నవరత్నాలలో ప్రశంసించాడు కవి. తాజమహలు సౌందర్యాన్ని చూసిన తర్వాత, ఆవేశమే తననీ కావ్యం రాసేలా చేసిందని అన్నాడు. షాజహాన్–ముంతాజ్ బేగంల పరస్పర ప్రేమాభిమానాల్ని అవి తాజ్ మహల్‌గా రూపొందించిన తీరుని కవి రమణీయంగా వర్ణించాడు. వారిరువురు ఎలా ఉండేవారో ఊహిస్తూ ఇలా వర్ణించాడు కవి.

**ఆ సతీ పతుల గాఢాశ్లేషముల నుండి**
**జారిపోయిన నిమేషంబు లేదు**

ముంతాజు మహలు ఇది కేవలం షాజహాను ముంతాజుల మధ్య ఉండే ప్రేమానురాగాలే కాదు, ప్రతీ భార్యా భర్త మధ్య ఉండవలసిన అనురాగ బంధాన్ని తెలుపుతున్నట్లుంది పద్యం. అంత అనురాగంతో ఉండటం వల్లనే ప్రపంచ వింతల్లో ఒకటిగా గుర్తింపు పొందేటట్లు ఆ పాలరాతి భవనాన్ని నిర్మించాడు రాజు. దీన్ని ఇలా వర్ణించాడు. ముంతాజ్ మహలు చూసిన వాళ్ళకు ఆ పాలరాతి కట్టడంలో కనిపించే చిత్రాలు నేటికీ రంగు పోకుండా మెరవడం, గోడలపై అమర్చిన శిల్ప విన్యాసాలు అద్భుతం అనిపిస్తాయి. ముంతాజు మహలు కావ్యం షాజహానులోని కళాతృష్ణను మాత్రమే కాకుండా, ఆయన పాలనలో మత విద్వేషాలను తగ్గించిన తీరుతెన్నులను, కవుకు లభించిన ఆదరణనూ, అలాగే ముంతాజ్ మహల్‌లోని కరుణాంతరంగాన్నీ చక్కగా వర్ణించాడు కవి.

**3. నా కథ:**

జాషువా తన జీవిత అనుభవాలను "నా కథ" పేరుతో రాశారు. జాషువా రాసుకున్న "నా కథలో ఆయన బాల్యమంతా ఆటుపోట్లకు గురైనట్లు తెలుస్తుంది. విద్యార్థి జీవితం కూడా అస్తవ్యస్తంగానే కొనసాగినట్లు, చదువుకంటే ప్రకృతితో మమేకమై పశుపక్ష్యాదులతో ఆడి పాడాలనే కుతూహలం తనకు ఎక్కువగా కనిపించింది ఆయనే తన బాల్యం గూర్చి కింది విధంగా వర్ణించుకున్నాడు.

**గేదెలు గాయగబోవు బాలకులతో క్రీడింవగా నెంచి,**
**మర్యాద భంగభయంబునన్స్ జనని కాదంచు న్నివారించినన్**

జాషువా తన బాల్యంలో ఆడిపాడాలనే కుతూహలంతో పశువుల్ని కాయడానికి కూడా ఏదో ఒక నెపంతో వెళ్ళి ఆడుకునేవాడిని ఈ పద్యం వల్ల స్పష్టమవుతుంది. చదువుని ఎగ్గొట్టి ఇలా తిరగడం వల్ల సరిగ్గా చదువుకోలేక పోయాననీ, ఉపాధ్యాయులు తనను కొట్టేవారనీ పద్యంలో చెప్పుకున్నారు.

**4. గబ్బిలం:**

జాషువా రాసిన మరో గొప్ప కావ్యం గబ్బిలం. గుంటూరు జిల్లా బోర్డు ప్రెసిడెంటు కల్లూరి చంద్రమౌళి చౌదరిగారికి అంకితం ఇచ్చారు. గబ్బిలం రచనకు జాషువా బాల్య జీవిత నేపథ్యం కూడా ఉపకరించిందని పరిశోధకులు వ్యాఖ్యానించారు. దళితుడ్కెన అరుంధతీ సుతుడ్ని కావ్యనాయకుడిగా చేసుకున్నాడు కవి. హిందూమతం వల్ల దళితులు పడుతున్న జీవన వేదనంతా పలికిస్తూనే, తన దేశభక్తిని కూడా ప్రకటించిన కావ్యమిది. గబ్బిలాన్ని లఘు ప్రబంధమనీ, ప్రతీక కావ్యమనీ (ఎలిజీ) ప్రముఖ విమర్శకుడు కఠెవరపు వెంకట్రామయ్య అభిప్రాయపడ్డారు. కాళిదాసు మేఘసందేశంలో ఒక భగ్న ప్రేమికుడి ఇతివృత్తాంతాన్ని వర్ణిస్తూ, భారతదేశ ఔన్నత్యాన్ని వివరించాడు. జాషువా గబ్బిలం కావ్యంలో ఒక అరుంధతీ సుతుని అశ్రు సందేశాన్ని ఈశ్వరునికి నివేదించే నెపంతో భారతదేశ ఔన్నత్యాన్ని వర్ణిస్తూనే, దళితుల బాధలను వినిపించాడు.

**"ఆలయంబున నీవు వ్రేలాడు వేళ**
**శివుని చెవి నీకు గొంత చేరువగ నుండు**
**మౌని ఖగరాజ్ఞ! పూజారి లేని వేల**
**విన్న వింపుము నాదు జీవితచరిత్ర"**

గబ్బిలంలోని ఈ పద్యం జాషువా కావ్య మాధుర్యానికి నిదర్శనం. అద్భుత నివేదనకు గొప్ప తార్కాణం. ఎందుకంటే ఆలయంలో నువ్వు వేలాడే సమయంలో పూజారి అందుబాటులో లేనప్పుడు, శివుడు ఒంటరిగా ఉన్నప్పుడు మా యొక్క బాధల్ని ఆ శివుడికి విన్నవించు, ఆ దేవుడైన మా బాధలను తీరుస్తాడు అని, గబ్బిలంతో అర్థవంతంగా, ఆశ్చర్యవంతంగా, చమత్కార వంతంగా చెప్పిన ఈ పద్యం, అతని పాండిత్యానికి నిదర్శనం.

**5. బాపూజీ:**

సమాజం శాంతియుతంగా ఉండాలనీ, శాంతి అహింసలను నమ్మిన జాషువా ఆ సిద్దాంతాలను ప్రచారం చేసిన గాంధీజీ పట్ల అచంచల మైన అభిమానాన్ని ప్రదర్శించాడు. గాంధీజీని "మహర్షి" అని సంబోధిస్తూ ఈ కావ్యాన్ని "బాపూజీ" అనే పేరుతో రాశాడు. బాపూజీ అంటే తండ్రి అని అర్థం. భారత జాతీయోద్యమంలో నాడు గాంధీజీ అంతటి పేరు ప్రఖ్యాతులను పొందాడు. కవి జాషువాకి గాంధీజీ పట్ల అంతే గౌరవ మర్యాదలున్నాయి. గాంధీజీ అనుచరుడిగా పేరు పొందిన తిక్కవరపు రామిరెడ్డిగారికి ఈ కృతిని అంకితమిచ్చాడు. గాంధీజీని హత్యచేసిన వెంటనే రాలిన అశ్రు కణాలతో ఈ కావ్యాన్ని వర్ణించినట్లు కవి ప్రకటించాడు. గాంధీజీ భారత స్వాతంత్ర్య రథసారధిగా ఆయన చేసారు కృషిని ఈ కావ్యంలో వర్ణించాడు కవి. బ్రిటీష్ వారితో చర్చలు, భారతదేశంలో కుల, మత విద్వేషాలు సమసిపోడానికి చేసిన ప్రయత్నాలు, జిన్నాతో రాయబారం మొదలైన అనేకాంశాలను వర్ణించాడు . గాంధీజీని ''భారతముని'ప్రవరుడు, నిరుపేదల బాంధవుడుగా అభివర్ణించాడు.

**భరతవర్షంబీను వజ్రాల ధనరాశి**
**తూకంబునకు పెచ్చుదూగువాడు**

దినకరుడుగా, మహాపురుషుడుగా, ప్రత్యక్షదైవంగా గాంధీజీని అభివర్ణించాడు. భారత స్వాతంత్రోద్యమంలో అగ్నికణంలా ఎగిసిపడిన దేశభక్తుడు నేతాజీ. అతని గురించి కావ్యం రాయకుండా ఉండలేకపోయానని ప్రకటించి, నేతాజీ పేరుతో ఈ కావ్యాన్ని రాశారు. అప్పటికే తన తండ్రికి ఈ కావ్యాన్ని అంకితమిస్తున్నానని ప్రకటించాడు జాషువా.

**6. కాందిశీకుడు (1943):**

జాషువా రాసిన మరొక ఖండకావ్యం కాందిశీకుడు. దీన్ని తిక్కవరపు రామిరెడ్డిగారి సతీమణి శ్రీమతి సుదర్శనాంబకు అంకితం ఇచ్చాడు. దీనికి ప్రతిఫలంగా రెడ్డిగారు భూ దానాన్ని చేసినట్లు కవి రాసుకున్నారు. ఒక బర్మా కాందిశీకుడు ప్రాణ భీతితో పరుగెట్టు కొచ్చి నల్లమల అడవుల్లో సంచరిస్తుంటాడు. ఆ సమయంలో కాలికి ఒక మానవ పుర్రె తగులుతుంది. కాందిశీకుడితో ఆ పుర్రె సంభాషిస్తుంది. కొంతమంది వల్ల నిరపరాధులైన సామాన్య మానవులు యుద్ధం వల్ల చనిపోవడం మంచిది కాదని శాంతి, అహింసల గొప్పతనాన్ని విశదీకరించే దిశగా ఈ కావ్యాన్ని వర్ణించాడు కవి. మత ద్వేషాలను పోగొట్టి, బుద్ధుడు నడయాడిన శాంతినీ, ధర్మాన్నీ పాటించాలనే సందేశాన్ని అందిస్తుంది కావ్యం.

**7. స్వయంవరం (1950):**

తాను నమ్మిన గాంధేయ వాదం తన కళ్ల ముందే ఆచరణలో వైఫల్యం చెందడాన్ని గమనించిన జాషువా రాసిన కావ్యం ''స్వయంవరం'' దీనిలో వధువు ''స్వరాజ్యం'', పెండ్లికొడుకులు ప్రజలు. గాంధీజీ సత్యాగ్రహం అనే యజ్ఞంలో స్వరాజ్య బాల జన్మించి, పెండ్లికెదుగుతుంది. పెళ్ళి చేసుకునే వరుల కోసం స్వయంవరం ప్రకటిస్తారు. నీతిమంతులు, అవినీతిమంతులు అంతా స్వయంవరానికి హాజరవుతారు. వాళ్ళని చూసి స్వరాజ్య కన్య ఏడుస్తూ పారిపోతుంది. అనుకూలమైన వరుడికోసం అన్వేషించి దేశాటన చేస్తూ, చివరికి మంచు కొండల దగ్గరకి చేరుతుంది. ఆమె ఒక పల్లెలో నివసిస్తుంది. ఆమె కలలో మహాత్ముడు కనిపించి ఉపదేశం చేస్తాడు. ఒక యువకుణ్ణి వివాహమాడి స్వరాజ్యం రాజ్య మేలుకుంటుంది. దేశంలో శాంతి నెలకొని, స్వరాజ్యం యొక్క నిజమైన ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. ఈ కావ్యాన్ని కవి బాల్యం, స్వయంవరం, దేశాటనం, హిమగిరి యాత్ర అనే నాలుగు విభాగాలుగా వర్ణించాడు.

గాంధీజీ కలలు కన్న రామ రాజ్యాన్ని స్వయంవరంలో కవి దర్శించాడు. భారతదేశం అలా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించాడు. జాషువా జీవితంలో అనేక కుల, మత పరమైన సంఘర్షణలు ఎదురైనప్పటికీ, వాటిని దాటుకుంటూ విశ్వ మానవుడిగా ఎదగడమెలాగో ఆయన జీవితం, సాహిత్యం ప్రతిబింబంగా నిలుస్తుంది. జాషువా 1971 జూలై 24 తేదీన మరణించారు. "సుకవి జీవించు ప్రజల నాలుకలయందు" అని తను చెప్పుకున్న నిత్య సత్యాన్ని మరొక్కసారి చాటి చెప్పాడు.

ఆధార గ్రంథాలు


1. జాషువా రచనలు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
2. జాషువా జీవిత కవితా ప్రస్థానం సమతా పబ్లికేషన్స్.
3. అన్వేషణ. విశ్వనాథ, జాషువా జయంతి ఉత్సవ సంచిక.


T

విమర్శ

# తెలుగు సాహిత్యం-సాంకేతిక ప్రగతి

మ్యాడం అభిలాష్

**పరిచయం:**

తెలుగు సాహిత్యం అనాదిగా అభివృద్ధి చెందుతూ, మారుతున్న సమాజానికి అనుగుణంగా తన స్వరూపాన్ని మార్చుకుంటూ వచ్చింది. కవిత్వం, కథలు, నాటకాలు, నవలలు వంటి సాహిత్య ప్రక్రియలు కాలానుగుణంగా కొత్త రూపాలను సంతరించుకున్నాయి. కానీ, 21వ శతాబ్దంలో సాంకేతికత ప్రాప్తితో తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రచురణా రంగం నుంచి డిజిటల్ మాధ్యమాల దిశగా ఈ పరిణామం కొనసాగింది.

ఇంటర్నెట్ విస్తరణతో తెలుగు సాహిత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించే అవకాశాలు పెరిగాయి. ఎలక్ట్రానిక్ పుస్తకాలు, ఆడియో పుస్తకాలు, వికీపీడియా, వికీసోర్స్, డిజిటల్ లైబ్రరీలు వంటి వనరులు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాక, సాంకేతికత సహాయంతో పాఠకులు, రచయితలు ఒకే వేదికపై కలుసుకునే అవకాశాలు విస్తరించాయి. సోషల్ మీడియా, బ్లాగులు, వెబ్‌సైట్లు, పోడ్కాస్ట్‌లు వంటి మాధ్యమాలు కొత్తతరం సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈ పరిణామంలో కొన్ని ప్రముఖ సంస్థలు, సంఘాలు తెలుగు సాహిత్యాన్ని సాంకేతికత ద్వారా అభివృద్ధిపరిచే దిశగా అంకితభావంతో పని చేస్తున్నాయి. డిజిటల్ మాధ్యమాల్లో తెలుగు భాషకు ప్రాచుర్యం కల్పించడం, పాత సాహిత్యాన్ని స్కానింగ్ ద్వారా నూతన తరం దృష్టికి తీసుకురావడం, యూనికోడ్ అనువాదాలు, తెలుగు OCR సాఫ్ట్‌వేర్ అభివృద్ధి వంటి ఎన్నో మార్గాల్లో ఈ సంస్థలు సహాయపడుతున్నాయి.

ఈ వ్యాసంలో తెలుగు సాహిత్యాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేస్తున్న ప్రముఖ సంస్థల కృషిని విశ్లేషించడం జరిగింది. వీటి ప్రయత్నాలు తెలుగు భాషా పరిరక్షణలో ఎంతగానో సహాయపడటమే కాక, సాహిత్యాన్ని కొత్త తరాలకు అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. ఈ సంస్థలు పురాతన గ్రంథాల డిజిటైజేషన్, వికీపీడియా & వికీసోర్స్ మాధ్యమంగా ఉచిత సాహిత్య ప్రచారం, ఆన్‌లైన్ పబ్లికేషన్లు, సాంకేతిక సాధనాల అభివృద్ధి వంటి విభిన్న రంగాల్లో విశేష కృషి చేస్తున్నాయి.

**తెలుగు వికీపీడియా** (www.te.wikipedia.org)

తెలుగు వికీపీడియా అనేది తెలుగుభాషలో జ్ఞానాన్ని విస్తరించేందుకు రూపొందించిన ఒక విశిష్టమైన వేదిక. 2003లో వెన్న నాగార్జునచే ప్రారంభించబడిన ఈ ప్రాజెక్ట్, వేలాది వ్యాసాలతో తెలుగులో అతిపెద్ద డిజిటల్ ఎన్‌సైక్లోపీడియాగా రూపుదిద్దుకుంది. ఇందులో చరిత్ర, భౌగోళికం, విజ్ఞానం వంటి విభాగాలతో పాటు తెలుగు సాహిత్యం, కవిత్వం, నవలలు, నాటకాలు, ప్రముఖ రచయితల జీవిత విశేషాలు వంటి అనేక అంశాలపై సమగ్రమైన సమాచారాన్ని అందిస్తోంది. వికీపీడియా ముఖ్యంగా ఉచిత జ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చే సంకల్పంతో పనిచేస్తోంది. తెలుగులో విద్యా వనరులను విస్తరించేందుకు, పాఠకులకు స్వేచ్ఛగా సమాచారాన్ని అందించేందుకు ఇది ఒక విస్తృతమైన వేదికగా అభివృద్ధి చెందుతోంది.

తెలుగు వికీపీడియా వికీసోర్స్‌తో కలిసి పాత తెలుగు గ్రంథాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం, ప్రజలకు ఉచితంగా అందించడం వంటి కార్యక్రమాలను చేపడుతోంది. వివిధ భాషల వికీపీడియాలతో అనుసంధానం కలిగి ఉండడం వలన తెలుగు వ్యాసాలు ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తృతంగా చదవబడే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అనువాద వ్యవస్థలను అన్వేషించడం, తెలుగు భాషా పరిశోధనలతో భాగస్వామ్యం కలిగి విశ్వవిద్యాలయాల్లో వికీపీడియా వినియోగాన్ని పెంచడం వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రయత్నిస్తోంది.

వికీపీడియా, దాని సోదర ప్రాజెక్టులైన వికీసోర్సు, వికీవ్యాఖ్య, వికీకామన్స్, వికీబుక్స్, విక్షనరీ వంటి వాటిల్లో కూడా సాహిత్య ప్రచారం జరుగుతుంది. స్వేచ్ఛా నకలు హక్కులు గల ఉచిత గ్రంథాలయంగా 'వికీసోర్సు', ఉచిత చిత్రాలు, వీడియోల రూపంలో 'వికీ కామన్స్', ప్రముఖుల వ్యాఖ్యలతో కూడిన 'వికీవ్యాఖ్య', సృజనాత్మక రచనలు గల 'వికీబుక్స్', పదాలు వాటి అర్థాలతో కూడిన 'విక్షనరీ' వంటివి మనకు అందుబాటులో ఉన్నాయి.

**బోలి చేతో ఫౌండేషన్** (www.bolicheto.org)

బోలిచేతో ఫౌండేషన్ భారతదేశంలోని స్థానిక భాషలను పరిరక్షించేందుకు, ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న ఒక ప్రముఖ సంస్థ. ఇది 2023లో నేతి సాయికిరణ్‌చే ప్రారంభించబడి ప్రధానంగా గోండి, కొలామి వంటి ఆదివాసీ భాషలతో పాటు తెలుగు భాషను డిజిటల్ ప్రపంచంలో స్థిరపరచడంపై దృష్టి సారిస్తుంది. గోండిలాంటి ప్రాచీన భాషలు నేడు మాట్లాడే జనాభా ఉన్నప్పటికీ, అవి సాంకేతికంగా వెనుకబడి ఉండటంతో వాటి లిపి, వ్యాకరణం, సాహిత్యం

వంటి అంశాలను పరిరక్షించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ లోటును తీర్చడానికి బోలిచేతో ఫౌండేషన్ వికీపీడియా, వికీసోర్స్, విక్షనరీ వంటి డిజిటల్ వేదికలను ఉపయోగించి భాషా డిజిటలైజేషన్‌ను వేగవంతం చేస్తోంది.

ఈ సంస్థ ఆదివాసీ భాషలకు సంబంధించిన పరిశోధనలు, డిజిటలైజేషన్ కార్యక్రమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. గోండి, కోలామి భాషల్లో వికీపీడియాలను ప్రారంభించి అందులోని వ్యాసాలకు తెలుగు లిపిని వాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని నలుదిశలా చాటుతుంది. భాషల పరిరక్షణ కోసం వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి స్థానిక యువతను ఇందులో భాగస్వామ్యం చేస్తోంది. భాషా మౌలిక వనరులను అభివృద్ధి చేయడంతో పాటు, ఆదివాసీ సమాజంలో భాషా జ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ సంస్థ మార్గదర్శకత్వం అందిస్తోంది. స్థానిక లిపులను పునరుద్ధరించడం, భాషాపరమైన పుస్తకాలను డిజిటలైజ్ చేసి వికీసోర్స్ వేదికపై అందుబాటులో ఉంచడం వంటి కార్యక్రమాలను బోలిచేతో ఫౌండేషన్ నిరంతరం నిర్వహిస్తోంది.

భాషా పరిరక్షణ కేవలం పదబంధాలు, వ్యాకరణం మీద కాకుండా, ఆ భాషతో ముడిపడిన సాంస్కృతిక మూలాలను కూడా కాపాడడం అవసరం. బోలిచేతో ఫౌండేషన్ ఈ కోణంలోనూ ముందడుగు వేసి, ఆదివాసీ కథలు, పద్యాలు, పాటలు, చరిత్ర, నమ్మకాలు, సంప్రదాయాలను డిజిటల్ రూపంలో రికార్డు చేయడానికి ప్రయత్నిస్తోంది. భవిష్యత్ తరాలకు భాషా సంపదను అందించేందుకు భాషా శిక్షణను ప్రోత్సహించడం, కొత్త తరానికి భాషను బోధించేందుకు ఉపాధ్యాయ శిక్షణను అందించడం వంటి కార్యక్రమాలు కూడా ఈ సంస్థ ముందుకు తీసుకువెళుతోంది.

భారతదేశంలో స్థానిక భాషలు నశిస్తున్న వేళ, వాటిని పరిరక్షించేందుకు ఈ తరహా సంస్థల అవసరం మరింత పెరిగింది. బోలిచేతో ఫౌండేషన్ చేసిన కృషి భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. భాషను కేవలం మౌఖిక సంప్రదాయంగా కాకుండా, డిజిటల్ మాధ్యమాల్లో స్థిరపరచడం ద్వారా భవిష్యత్ తరాలకు తగిన వనరులను అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థ ముందుకు సాగుతోంది. స్థానిక భాషా ప్రేమికులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ సంస్థ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయితే, భాషా పరిరక్షణ లక్ష్యాన్ని మరింత వేగంగా సాధించగలమని చెప్పవచ్చు.

**తానా (TANA) సంఘం (www.tana.org)**

తెలుగు ప్రజలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించినప్పటికీ, వారి భాష, సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టేందుకు, ప్రోత్సహించేందుకు అనేక సంస్థలు పనిచేస్తున్నాయి. అందులో ఉత్తర అమెరికాలో అత్యంత ప్రాచుర్యం పొందిన తెలుగు సంఘం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (TANA). 1977లో స్థాపించబడిన ఈ సంస్థ, అమెరికాలో ఉన్న తెలుగు ప్రజలకు భాషా, సాంస్కృతిక, విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇది ఉత్తర అమెరికాలో స్థాపించబడిన మొట్టమొదటి తెలుగు సంస్థగా గుర్తింపు పొందింది.

TANA ప్రధానంగా అమెరికా, కెనడాలో ఉన్న తెలుగు ప్రవాసీయులకు తమ మాతృభాష, సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించేందుకు ప్రేరణనిస్తుంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి TANA మహాసభలు నిర్వహించడం ఈ సంస్థ ప్రత్యేకత. ఈ సభలు అమెరికా, కెనడాలోని తెలుగు ప్రజలను ఒకచోట చేర్చి, సాంస్కృతిక కార్యక్రమాలు, సాహిత్య సమావేశాలు, విద్యా, ఉద్యోగ అవకాశాలపై చర్చలు, సినీ, నాటక ప్రదర్శనలతో ఉత్సాహభరితంగా కొనసాగుతాయి. ఈ సభల ద్వారా తెలుగు సంస్కృతి ప్రపంచానికి మరింత దగ్గరవుతోంది.

TANA భాషా పరిరక్షణ, ప్రచారంలో కూడా విశేష కృషి చేస్తోంది. తెలుగు భాషాభిమానులను ప్రోత్సహించడానికి, చిన్న పిల్లలలో తెలుగు అభిరుచిని పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా, తెలుగు భాషా తరగతులు, వర్క్‌షాప్‌లు, సాహిత్య పురస్కారాలు అందించడం ద్వారా భాషను మరింత బలోపేతం చేస్తోంది. అమెరికాలో పుట్టి పెరిగిన పిల్లలకు తెలుగు నేర్పించేందుకు ప్రత్యేకంగా TANA తెలుగు పాఠశాలలు నిర్వహిస్తోంది.

ఈ సంస్థ భాషా పరిరక్షణతో పాటు సామాజిక సేవలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. TANA ఫౌండేషన్ ఎన్నో దాతృత్వ కార్యక్రమాలను కూడా చేపడుతోంది. అమెరికాలోనే కాకుండా, భారతదేశంలోని పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించటం, ఆరోగ్య సహాయం, ప్రకృతి వైపరీత్యాల్లో సహాయం చేయటం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తెలుగు గ్రామాలలో నీటి వనరుల అభివృద్ధి, ఆసుపత్రులకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం వంటి సేవలను నిరంతరం అందిస్తోంది.

సాంకేతికత విపరీతంగా అభివృద్ధి చెందిన ఈ యుగంలో, డిజిటల్ మాధ్యమాలను ఉపయోగించి TANA మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా, తెలుగు సాహిత్యం, వ్యాయం, కళలను ప్రోత్సహించేందుకు ఆన్‌లైన్ వెబినార్లు, పుస్తకాల ప్రచురణ, డిజిటల్ వనరుల అభివృద్ధి వంటి కార్యక్రమాలను చేపడుతోంది. ప్రవాసంలో ఉన్న తెలుగువారు తమ భాషను మరచిపోకుండా, వారి భవిష్యత్ తరాలకు తెలుగు భాషను అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థ అనేక భాషా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

TANA ప్రవాసాంధ్రుల మేలు కోసమే కాకుండా, గ్లోబల్ లెవెల్‌లో తెలుగు భాషకు, సాహిత్యానికి గుర్తింపు తీసుకురావడంలోనూ తనదైన పాత్ర పోషిస్తోంది. ఇది కేవలం ఒక తెలుగు సంఘం మాత్రమే కాదు, ఒక భాషా, సాంస్కృతిక ఉద్యమం అని చెప్పాలి. ప్రవాసాంధ్రుల గుండెల్లో తెలుగు భాషను నిలిపే ప్రయత్నంలో ఇది ఓ కీలక వేదికగా నిలుస్తోంది. భాష,

సంస్కృతి, సేవ అనే మూడు ప్రధాన సూత్రాలతో TANA తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారిని ఒక్కటిగా చేర్చే ప్రయత్నాన్ని చేస్తున్నది.

ఈ సంస్థ చేస్తున్న కృషి తెలుగు భాషాభిమానులకు, సాహిత్య అభిమానులకు గర్వకారణంగా మారింది. భవిష్యత్ తరాలకు తెలుగు భాషను అందించేందుకు, తెలుగు ప్రజల ఐక్యతను పెంచేందుకు, సాంస్కృతిక సంపదను పరిరక్షించేందుకు TANA మరింత పురోగమించాలి. ఇది ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలకు తమ భాష, సంస్కృతిని కొనసాగించేందుకు ప్రేరణనిస్తూనే ఉంది.

**64 కళలు** (www.64kalalu.com)

64 కళలు వెబ్‌సైట్ భారతీయ సంప్రదాయ కళలకు, ముఖ్యంగా తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహించేందుకు ఓ ప్రత్యేక వేదికగా మారుతోంది. కళాసాగర్ యల్లపు సంపాదకత్వంలో నడుస్తున్న ఈ సైట్ తెలుగు భాషలోని సాహిత్య సంపదను ఆధునిక సాంకేతికతతో అనుసంధానించి, భవిష్యత్ తరాలకు అందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. పద్య సాహిత్యం, కథా రచన, శతకాలు, నాటక రూపకాలు, పురాణాల ఆధారంగా కవితా రచన వంటి సాహిత్య ప్రక్రియలను ప్రోత్సహించడం ఈ వేదిక లక్ష్యాలలో ఒకటి.

ఈ వెబ్‌సైట్ ప్రాచీన కాలంలో ఉన్న 64 కళలు అనే భావనను ఆధునిక దృక్కోణంలో ప్రవేశపెట్టింది. ఈ 64 కళల్లో అనేక కళా విభాగాలు సాహిత్యంతో ముడిపడినవే. ముఖ్యంగా కథా రచన, పద్య రచన, అలంకార శాస్త్రం, శ్లోక రచన, గేయ రచన వంటి అంశాలు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. తెలుగు కవిత్వాన్ని, రచనను ప్రోత్సహించేందుకు ఈ వెబ్‌సైట్ వివిధ కార్యక్రమాలను, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోంది.

తెలుగు సాహిత్యం ప్రధానంగా పద్య, గద్య, నాటక సాహిత్యం వంటి విభాగాలుగా విభజించబడింది. ఈ వేదిక పద్య సాహిత్యాన్ని కొత్త తరాలకు చేరువ చేయడం, తెలుగు కవులను ప్రోత్సహించడం, పురాతన శతకాలను, కంద పద్యాలను, ద్విపదలను డిజిటల్ రూపంలో అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తెలుగు సాహిత్యాన్ని నూతనంగా భావితరాలకు అందించేందుకు ఇది ఓ విశిష్ట వేదిక.

ఇక, సాహిత్యంతో ముడిపడిన సంగీతం, నాట్యం, శిల్పకళ వంటి అంశాలను కూడా ఈ వేదిక ప్రోత్సహిస్తోంది. తెలుగు భక్తి పద్యాలు, వాగ్గేయకారుల కీర్తనలు, జానపద గీతాలు వంటి సాహిత్య ప్రక్రియలను ప్రదర్శించడం ద్వారా తెలుగు భాషకు గౌరవాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

సాహిత్య అభివృద్ధికి ఈ వెబ్‌సైట్ అందిస్తున్న సేవలు విశేషమైనవి. తెలుగు సాహిత్యాన్ని పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు అందించేందుకు ఇది ఓ అనువైన వేదికగా మారుతోంది. భవిష్యత్తులో తెలుగు సాహిత్య ప్రియులు, రచయితలు ఈ వేదికను మరింత ఉపయోగించుకుని, తెలుగు సాహిత్యాన్ని డిజిటల్ రూపంలో విశ్వవ్యాప్తం చేయగలిగే అవకాశముంది.

**మనసు ఫౌండేషన్** (www.manasufoundation.com)

మనసు (మన్నం నరసింహం సుబ్బమ్మ) ఫౌండేషన్ తెలుగు భాష, సాహిత్యం, విద్య, సంస్కృతి అభివృద్ధికి అంకితమై పనిచేస్తున్న సంస్థ. ఈ ఫౌండేషన్ ప్రత్యేకంగా తెలుగు భాషా వికాసం, సాహిత్య ప్రచారం, విద్యా సహాయం వంటి రంగాల్లో ప్రభావశీలమైన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. భాషా పరిరక్షణకు, నూతన రచయితలకు ప్రోత్సాహం అందించేందుకు, సాహిత్యాన్ని సమకాలీన సాంకేతికతతో అనుసంధానించేందుకు ఈ సంస్థ నిరంతరం కృషి చేస్తోంది.

తెలుగు భాషలోని గొప్ప సాహిత్య సంపదను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో మనసు ఫౌండేషన్ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పాఠశాల విద్యార్థులకు కథల పోటీలు, రచనా శిబిరాలు, సాహిత్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిన్న వయస్సులోనే భాషాపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రయత్నిస్తోంది. బాల సాహిత్యాన్ని ప్రోత్సహించడంలో ఈ ఫౌండేషన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. చిన్నారులకు సులభంగా అర్థమయ్యే కథలు, కవితలు, గేయాలను ప్రచురించడం, ఆడియో మరియు వీడియో రూపాల్లో విద్యా సహాయక సామగ్రిని అందించడం దీని ముఖ్య లక్ష్యాలలో ఒకటి.

సాహిత్య అనువాద ప్రాజెక్టులు కూడా మనసు ఫౌండేషన్ చేపడుతోంది. ఇతర భాషల నుండి తెలుగు లోకి, అలాగే తెలుగులోని ప్రాముఖ్యతగల రచనలను ఇతర భాషల్లోకి అనువదించడం ద్వారా విభిన్న భాషల మధ్య సాహిత్య పరిమళాన్ని విస్తరింపచేస్తోంది. ఆధునిక సాంకేతికతను వినియోగించి, తెలుగు పుస్తకాలను డిజిటల్ రూపంలో అందించడం, ఆన్‌లైన్ వనరులను అభివృద్ధి చేయడం ద్వారా కొత్త తరాలకు ఉపయోగకరమైన పరిష్కారాలను అందిస్తోంది.

ఈ ఫౌండేషన్ తెలుగు రచయితలకు, కవులకు, అధ్యాపకులకు, విద్యార్థులకు సమానంగా ప్రయోజనకరంగా ఉంటోంది. కొత్త రచయితలను ప్రోత్సహించేందుకు, వారి రచనలకు గుర్తింపు తీసుకురావడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు ఉండాలని నమ్మి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి అందించే కార్యక్రమాలు కూడా చేపడుతోంది. తెలుగు సాహిత్యం మరియు సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో మనసు ఫౌండేషన్ తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్టులను ప్రారంభించి, తెలుగు భాషాభివృద్ధిలో మరింత కీలకమైన పాత్ర పోషించేందుకు ప్రయత్నిస్తోంది. తెలుగును ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ ఫౌండేషన్ ద్వారా భాషా వికాసానికి తమ వంతు తోడ్పాటు అందించవచ్చు.

**శోధిని** (www.sodhini.org)

శోధిని అనేది తెలుగు బ్లాగర్లకు, పాఠకులకు ఒక విలువైన వనరుగా మారిన బ్లాగ్ సంకలిని. ఈ వెబ్‌సైట్ ప్రత్యేకంగా తెలుగు బ్లాగులను ఒకేచోట చేర్చి, పాఠకులకు సమగ్రంగా అందించేందుకు రూపుదిద్దుకుంది. ఇది వేరువేరు రంగాలకు సంబంధించిన బ్లాగులను సమీకరించి, వాటిని ఒక వేదికగా అందిస్తోంది. ఇందులో సాహిత్యం, కవిత్వం, సమీక్షలు, సాంకేతికత, వ్యక్తిగత అనుభవాలు, చరిత్ర, భాషా పరిశోధనలు వంటి అనేక విభాగాలకు చెందిన బ్లాగులు ఉన్నాయి.

ఇంటర్నెట్‌లో తెలుగు బ్లాగింగ్ ప్రభావం పెరుగుతున్నప్పటికీ, వాటిని కనుగొనడం కొన్నిసార్లు కష్టతరమవుతుంది. శోధిని వంటి వేదికలు పాఠకులకు తమకు అవసరమైన కంటెంట్‌ను సులభంగా అందించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇది బ్లాగర్లకు, రచయితలకు, కొత్తగా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించాలనుకునేవారికి ఎంతో ఉపయోగపడే వేదిక. బ్లాగ్‌లు, సామాజిక మాధ్యమాల ఉత్పత్తుల కంటే మౌలికమైన, స్థిరమైన సమాచారాన్ని అందించగలవు. అందుకే, శోధిని బ్లాగింగ్‌ను ప్రోత్సహించేందుకు ఎంతో ఉపయోగపడుతోంది. ప్రముఖ బ్లాగులను ఒకచోట చేర్చి, వాటిని విభాగాల వారీగా వర్గీకరించి అందించడంలో శోధిని ప్రత్యేకత చూపుతోంది. ఇది తెలుగు బ్లాగర్ల మధ్య ఒక సమాజాన్ని నిర్మించడానికి సహాయపడుతుంది.

**డిజిటల్ తెలుగు లైబ్రరీ** (www.openlibrary.org)

డిజిటల్ తెలుగు లైబ్రరీ అనేది తెలుగు భాషా పాఠకులకు వివిధ గ్రంథాలను ఉచితంగా అందించేందుకు రూపొందించిన ఒక ప్రముఖ డిజిటల్ వేదిక. ఈ లైబ్రరీ ముఖ్యంగా పాత తెలుగు గ్రంథాలను, అరుదైన రచనలను డిజిటల్ రూపంలో భద్రపరచడం, వాటిని పాఠకులకు ఉచితంగా అందించడం వంటి లక్ష్యాలతో పనిచేస్తోంది. ఈ సంస్థ ప్రధానంగా పురాతన హస్తప్రతులను డిజిటలైజ్ చేయడం, వాటిని PDF, ePub, Mobi ఫార్మాట్లలో అందుబాటులోకి తేవడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ లైబ్రరీ వికీసోర్స్, ఆర్కైవ్.ఓఆర్జీ వంటి వేదికలతో కలిసి పనిచేస్తూ, డిజిటల్ గ్రంథాలయ రంగాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తోంది. అంతేకాకుండా, తెలుగు వికీపీడియా ద్వారా పాఠకులకు నాణ్యమైన సమాచారాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నది. భవిష్యత్తులో AI ఆధారిత తెలుగు గ్రంథాలయ అన్వేషణ వ్యవస్థ, తెలుగు పదజాలాన్ని విస్తరించే డేటాబేస్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.

**ఆంధ్రభారతి** (www.andhrabharati.com)

ఆంధ్రభారతి వెబ్‌సైట్ తెలుగు భాషా అభివృద్ధికి, భాషా ప్రాచుర్యాన్ని విస్తరించేందుకు అంకితమైన ఒక ప్రముఖ డిజిటల్ వనరు. ఇది ముఖ్యంగా తెలుగు సాహిత్యం, పదకోశం, అనువాదాలు, వ్యాకరణం, తెలుగు భాషా అధ్యయనం వంటి విభాగాలలో విశేషమైన సమాచారాన్ని అందిస్తోంది. తెలుగు భాషను ప్రేమించే, అభ్యసించే ప్రతి ఒక్కరికీ విలువైన సమాచారాన్ని, వనరులను అందించడమే దీని ప్రధాన లక్ష్యం.

ఈ వెబ్‌సైట్‌లో ముఖ్యంగా తెలుగు–ఇంగ్లీషు నిఘంటువు విభాగం ఎంతో ప్రాచుర్యం పొందింది. దీనిలో వేలాది పదాలను అర్థాలతో సహా అందుబాటులో ఉంచారు. ఇది తెలుగు నేర్చుకునే వారికి, అనువాదకులకు, భాషాప్రియులకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది. అంతేకాకుండా, సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన శ్లోకాలు, రచనల వివరణలు కూడా ఇందులో ఉన్నాయి. భాషా అధ్యయనం చేసే విద్యార్థులు, పరిశోధకులకు ఇది గొప్ప వనరుగా నిలుస్తోంది.

ఆంధ్రభారతి వెబ్‌సైట్‌లో ప్రాముఖ్యత పొందిన మరో అంశం తెలుగు సాహిత్య విభాగం. ఇందులో పురాణాలు, కావ్యాలు, నాటకాలు, కథలు, పద్యాలు, వచన రచనలు వంటి అనేక గ్రంథాలను డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచారు. ఇవి సాహిత్య ప్రియులకు, పరిశోధకులకు, ఉపాధ్యాయులకు ఎంతో మేలు చేస్తాయి. ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని మళ్లీ నేటి తరానికి చేరువ చేసే ప్రయత్నంలో ఈ వెబ్‌సైట్ ముఖ్య భూమిక పోషిస్తోంది. ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుగు భాష వ్యాకరణాన్ని, ఛందోబద్ధ పద్యాల నిర్మాణాన్ని అధ్యయనం చేయడానికి మంచి అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రభాషా వ్యాకరణం, ఛందస్సు, లిపి పరిణామం వంటి అంశాలపై ప్రత్యేక సమాచారాన్ని అందిస్తుంది. వీటిని ఉపయోగించి భాషను మరింత లోతుగా అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రభారతి వెబ్‌సైట్ కేవలం ఒక భాషా వనరుగా మాత్రమే కాకుండా, తెలుగు భాషాభిమానులను, పరిశోధకులను, విద్యార్థులను, సాహిత్య ప్రియులను కలిపే వేదికగా కూడా నిలుస్తోంది. భవిష్యత్తులో మరిన్ని డిజిటల్ వనరులను అందుబాటులోకి తెచ్చి, భాషాభివృద్ధికి తోడ్పడేలా ఈ వెబ్‌సైట్ మరింత విస్తరించబోతుందనే ఆశించవచ్చు.

**ముగింపు:**

తెలుగు భాష అభివృద్ధికి సాంకేతికత చాలా సహాయపడుతోంది. వికీపీడియా నుంచి గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సంస్థల దాకా, ప్రభుత్వ ప్రాజెక్టుల నుంచి స్వతంత్ర డెవలపర్ల దాకా అనేక వర్గాలు తెలుగును డిజిటల్ యుగంలో మరింత ప్రాచుర్యం పొందేలా చేస్తున్నాయి. ఈ సంస్థల కృషిని గుర్తించి, వాటిని మరింతగా ప్రోత్సహించడం వల్ల తెలుగు భాషకు మరింత శక్తి చేకూరుతుంది. భవిష్యత్తులో సాంకేతికత ఎంతగా మారినా, తెలుగు సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఈ ప్రయత్నాలు కొనసాగాలని ఆశిద్దాం.

**ఉపయుక్త గ్రంథ సూచి:**


1. అంతర్జాలంలో తెలుగు సాహిత్యం – డా. పుట్ల హేమలత
2. అంతర్జాలంలో తెలుగు భాషా సాహిత్యాలు – డా.గొల్లపూడి గణేష్
3. వికీపీడియా గురించి మీకు తెలుసా! – తెలుగు వికీ సముదాయం
4. ఆయా సంస్థల అధికారిక వెబ్సైట్లు

విమర్శ

# విల్సన్ సుధాకర్ కవిత్వం-సామాజిక వాస్తవికత

పల్లిపట్టు నాగరాజు

**పరిచయం:**

తెలుగు సాహిత్యంలో కవి తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ గారి కవిత్వం విలక్షణమైంది. తెలుగు నాట ఒక కెరటంలా ఉవ్వెత్తున ఎగిసిపడిన దళిత అస్తిత్వవాద కవిత్వపు ప్రేరణతో, కారంచేడు, చుండూరు వంటి పోరాటాలు అందించిన చైతన్యంతో కవిత్వం రాస్తున్న సమకాలీన కవితా గొంతుక విల్సన్ సుధాకర్. ఈ విలక్షణ కవిత్వాన్ని చదువుకోవాల్సిన అవసరం వర్తమాన సమాజానికి ఎంతైనా ఉంది.

**తెలుగు సాహిత్యం- దళిత అస్తిత్వవాదం:**

సాహిత్యంలో నంగితనం ఉండకూడదు. సత్యాన్ని మాట్లాడటానికి, వాస్తవాలను చర్చించడానికి ముసుగులు అవసరం లేదు. అణచివేతకు గురవుతున్న ప్రజలు, హక్కులు కాలరాయబడుతున్న మనుషుల పక్షంలో గొంతు విప్పుతున్నపుడు నిర్భయంగా మాట్లాడటం అవసరం. నిక్కచ్చిగా మాట్లాడటం అవసరం. తెలుగు సాహిత్యంలో ఈ పునాదుల మీద వచ్చిందే అస్తిత్వవాద సాహిత్యం. అస్తిత్వ వాద చైతన్యంతో బలంగా మాట్లాడింది అస్తిత్వవాద కవిత్వం. దళితుల గురించి దళితులే మాట్లాడటం, రాయడం పాడటం అనే సామాజిక చైతన్యంతో ముందుకు వచ్చిందే దళిత అస్తిత్వ వాద సాహిత్యం. జి. లక్ష్మీ నరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో చిక్కనవుతున్న పాట తొలి దళిత కవితా సంకలనం వెలువడింది. ఒకవైపు సామాజిక పోరాటాలు, మరోవైపు దళిత సాహిత్య ఉద్యమ చేతన వెల్లివిరిసిన కాలం అది. మద్దూరు నగేష్ బాబు, ఎండ్లూరి సుధాకర్, కలేకూరి ప్రసాద్, నాగప్పగారి సుందర్రాజు, కత్తి పద్మారావు, చల్లపల్లి స్వరూపారాణి, శిఖామణి, సతీష్ చందర్ వంటి కవులు విస్తృతంగా కవిత్వం రాస్తూ, తమ సామాజిక వర్గ ప్రజల్ని చైతన్యపరిచారు. తరువాతి కాలంలో ఆ వేడి వాడి చల్లబడినా ఆ కొనసాగింపును అందుకుని కొనసాగుతున్న కొద్దిమందిలో విల్సన్ సుధాకర్ ఒకరు.

**విల్సన్ సుధాకర్ కవిత్వం విశ్లేషణ:**

భాషలోనూ, వ్యక్తీకరణలోనూ తనదైన నుడిని, అభివ్యక్తిని సొంతచేసుకోవడంలో మిగిలిన అస్తిత్వవాదాల సాహిత్యం కంటే దళిత సాహిత్యం, అందులోను ప్రధాన పాయగా సాగిన దళిత కవిత్వం కొంత ప్రత్యేకతను నిలుపుకుంది. దళిత అస్తిత్వ ఉద్యమ చేతనతో బలం పుంజుకున్న దళిత సాహిత్యం తరువాతి కాలంలో కొంత నెమ్మదించినా దళిత కవిత్వంగా మాత్రం చైతన్యవంతంగా కొనసాగుతూనే ఉంది. దళితులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులు, దాష్టీకాలకు దళిత కవులు, ఉద్యమకారులు తమదైన రీతిలో గొంతును వినిపిస్తున్నారు. అటువంటి బలమైన గొంతుకల్లో తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ ప్రతిభావంతమైన కవి మాత్రమే కాదు ప్రభావవంతమైన కవి కూడా. దళిత అస్తిత్వాన్ని దళిత ఉద్యమ చైతన్యాన్ని శక్తివంతంగా కవిత్వంలో వినిపిస్తున్న కవి చూపును దర్శిస్తే-

**"మాకిప్పుడు కావలసింది నెత్తుటి రొఖ్ఖం కాదుబీ**
**మాకేం కావాలో కోరుకునే నిర్భయపు గొంతుకబీ**
**కొత్త రాజ్యాంగం-కొత్తదేశం-కొత్తభూమి-కొత్త ఆకాశం"**

అని ఎండ్లూరి సుధాకర్ దళిత జాతి పక్షాన ముందు వరుసలో నిలబడి పెత్తందారీ వ్యవస్థను నిలదీసి కూడా చాలా కాలమైంది. ఈ కార్య సాధనకు వేగవంతం చేయాలంటే ఏం కావాలో గుర్తించిన కవి తుల్లి మల్లి విల్సన్ సుధాకర్" అని ఆచార్య మేడిపల్లి రవికుమార్ చేసిన తూనిక ఆయన ప్రత్యేకతను స్పష్టపరుస్తుంది.

దళిత కవిత్వాన్ని ఈ కవి పూలే, అంబేద్కర్ ఆలోచనల తాత్విక నేపథ్యం నుంచి చర్చిస్తున్నాడు. ఆ అవగాహనలోంచి కవిత్వం రాస్తున్నాడు. దళిత జీవన నేపథ్యం, దళిత క్రైస్తవ సాంస్కృతిక నేపథ్యపు పునాదులు మీద నిలబడి దళిత చైతన్యాన్ని కాంక్షిస్తున్నాడు. వాక్యం వాక్యానికి, పదం పదానికి దళిత అభ్యుదయాన్ని దట్టించి జాతి అభ్యున్నతిని కోరుకుంటున్న కవి. ఈ కవి దృక్పథ స్పష్టతకి అద్దం పట్టే కవితలు వీరి రచనల్లో మనం గమనిస్తాం.

"నువ్వే లేకపోతే....
**చెప్పులు కుట్టుకునే వాళ్ళు**
**పార్లమెంటు మెట్లు కూడా ఎక్కేవాళ్ళు కాదు**
**జందేమేసుకున్న విశ్వవిద్యాలయాలు**
**మాకింత చోటిస్తూ వణికిచచ్చేవి కావు**
**మలమూత్రాల బక్కెట్లు**
**మా తలమీద నుంచి ఎప్పటికీ దిగేవి కావు**
**ఒక నారాయణన్ను దేశ కిరీటమే దక్కేది కాదు**
**ఈ సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యానికి**
**ఎడంచేత్తో రాజ్యాంగ రాసిపారేసి**
**అవలీలగా దిశానిర్దేశం చేసిపారేశావు గానీ"**

అని 'నువ్వే లేకపోతే..'కవితలో భారత జాతిపిత, బహుజన సంక్షేమాన్ని కాంక్షించి జీవితం దారపోసిన వైతాళికుడు బాబాసాహెబ్ అంబేడ్కర్ గారి కృషిని కీర్తిస్తాడు. ఇది మొత్తం భారతీయ సమాజంలోని అణచబడిన, అణగారిన వర్గాల ప్రజలు అర్థం చేసుకోవాల్సిన చరిత్ర. అందుకోవాల్సిన స్ఫూర్తి.

సామాజిక వాస్తవికతను, సమకాలీన ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ప్రతిఫలించే సుధాకర్ కవిత్వం కాస్త వ్యంగ్యం మేళవించి, సంఘటనలు, చారిత్రకాంశాలతో పరిచయం చేస్తూ శ్రద్ధతో చదివిస్తుంది. ఆ క్రమంలోనే కవి మాట్లాడుతున్న సమస్య తాలూకూ సందర్భం, అవగాహన మనల్ని వెంటాడుతూ వుంటుంది. వృత్తి రీత్యా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం జేసి రిటైర్డ్ అయిన ఈ కవి సందర్శించిన వివిధ ప్రదేశాలు, అక్కడి ప్రజా జీవితం, సామాజిక పోరాటాలు వంటి ఎన్నో అంశాల్ని పరిచయం చేస్తూ సామాజిక వాస్తవికతను చూపెడుతుంది. కవిగా విల్సన్ సుధాకర్ ఇప్పటిదాకా **'దళిత వ్యాకరణం', 'మాకూ ఒక భాష కావాలి', 'పోరాట పద్యం'** అను మూడు కవితా సంపుటాలను వెలువరించారు.

**"దళిత వ్యాకరణం తెలుసుకోవాలంటే**
**లాల్ సలాం కూ జైభీం కూ**
**తేడా తెలుసుకోవాలి కదా"**

అంటున్న ఈ కవి చూపుకు మరికాస్త అద్దంపట్టే వాక్యాల్లోకి ప్రవేశిస్తే..

**"సరిహద్దుల్లో ఉచ్చపోస్తే**
**పొరుగు దేశమంతా కొట్టుకుపోతుందనే**
**బాలీవుడ్ సినిమా డైలాగుల దేశభక్తి లాగా"**

అంటూ బోలో స్వతంత్ర భారత్ కీ జై కవితను చదువుకుంటాం.

**"ఒక జాతికన్నా**
**మరొకజాతి గొప్పదనేవాళ్ళూ**
**ఒకళ్ళకన్నా ఇంకొకళ్ళకి ప్రతిభ ఉందనేవాళ్ళూ**
**చరిత్రలో మిగిలిపోయిన నాజీలు"**

అంటూ జాతిని విద్వేషాలలోకి నెడుతున్న కుట్రల్ని నగ్నంగా నిలదీస్తాడు విరిగిన అస్థిపంజరాలకు వెన్నెముకలు కవితలో. నిజాన్ని మాట్లాడం, నిర్భయంగా మాట్లాడటం, నిక్కచ్చిగా మాట్లాడటం దళిత కవిత్వపు స్వాభావికతగా మనం గ్రహిస్తే తుల్లిమల్లి గారి కవిత్వంలో అది స్పష్టంగా మనం గుర్తిస్తాం. దళిత కవిత్వంలో ధిక్కారంతో పాటు సూటిదనం స్పష్టంగా మాట్లాడటం ఒక లక్షణంగా చెప్పవచ్చు. కనుకనే

**"మాకిప్పుడొక భాష కావాలి**
**అది మా హృదయ ఘోష కావాలి**
**కన్న బిడ్డల్నే అస్పృశ్యులంటూ**
**చేతులతో మలాన్నెత్తించిన భాష**
**సజీవ దహనం కావాలి....."**

అని పదునైన వాక్యాలతో దళిత గుండె ఘోషను ఆవిష్కరిస్తాడు. ఒక ప్రత్యామ్నాయ భాషా సాహిత్యాల ఆవశ్యకతను నొక్కి మరీ చెబుతాడు.

విల్సన్ సుధాకర్ కవి కేవలం దళిత సమాజానికి జరుగుతున్న అన్యాయాన్ని మాత్రమే కాక సమకాలీన సామాజిక వాస్తవికతను మనముందు నిలబెడతాడు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ వంటి అత్యాధునిక పోకడలు అట్టడుగు ప్రజల్ని, శ్రామిక ప్రజల్ని ఏ విధంగా దోపిడీ చేస్తున్నాయి చెబుతాడు. పెట్టుబడిదారీ శక్తులు, కార్పొరేట్ కుట్రలు భాష సంస్కృతులను నాశనం చేస్తూ క్రమంగా పరాయీకరణకు గురిచేస్తున్న వైఖరులని నిరసిస్తాడు. ఇవన్నీ సామాన్య ప్రజల్ని ఏ విధంగా వ్యూహాత్మకంగా కబలిస్తున్నాయో చర్చిస్తాడు. వీటన్నింటి పట్ల చైతన్యంతో పోరాడవాల్సిన ఆవశ్యకతను వివరిస్తాడు.

**"భూమి నా భావావేశం**
**భూమి నా అభిరుచి...**
**భూమే నా స్వాతంత్ర్యం...**
**భూమే నా మోక్షమని తెలిసీ**
**నా పచ్చగడ్డిని తగలబెట్టి**
**నా పచ్చిపులుసును నన్నే తిననివ్వనప్పుడు**
**నీ ముద్రారాక్షస విధానాలు నాకు సమస్య**
**నీ సంస్కృతీ నాగరికతలు నాకు సమస్య**
**నీ పాలన పీడన ఏకపక్షంగా నాకు సమస్య**
**నిద్రరాని గ్రామాల్లో నా ఉనికే నాకు సమస్య**
**నువ్వు చెప్పుకునే దేశభక్తి నాకో పెద్ద సమస్య!!"**

ఇది ఈ కవి దృష్టి. కవిత్వంలో దృక్పథం. అవగాహన. సమాజం పట్ల సమాజంలోని అట్టడుగు వర్గాల పట్ల, వర్గాలలోని హక్కుల హననంకి గురవుతున్న అమాయక ప్రజాలపట్ల, శ్రమజీవుల పట్ల, రైతుల పట్ల, రైతు కూలీలు పట్ల ఎంతో నిబద్ధతతో గొంతుకై కాపుకాస్తున్న కవి విల్సన్ సుధాకర్.

దళిత వాదం కవిత్వపు ప్రేరణతో సమకాలీన దళిత సమాజపు గుండె చప్పుడుని వినిపిస్తున్న సుధాకర్ కవిత్వంలో భాష విషయంలో సంప్రదాయ, శిష్ట వ్యవహారంను వదిలిపెట్టలేదు. దళితవాద కవులు ప్రకటించుకున్న దళిత కుటుంబాలకు కొంత దూరంలో ఉండిపోయింది. అట్టడుగు కుటుంబాలు సామాన్య జనం పక్షం మాట్లాడినా సంపన్న కుటుంబాల, విద్యావంతుల భాషలో ఉంది. ఇది కవి వృత్తి రీత్యా జీవిస్తున్న వాతావరణం ప్రభావం కావచ్చు. అయితే అభివ్యక్తిలో వ్యంగ్యతను కలిగి ఆసక్తిగా చదివిస్తుంది. కవిత్వంలో తన వృత్తి రీత్యా సందర్శించిన ప్రదేశాలు, కుటుంబ నేపథ్యపు క్రైస్తవ సాంప్రదాయ జీవం, పరిభాష అలవోకగా చేరిపోవడం వలన పాఠకులు వాటిని అందుకోవడానికి కొంత సమయం పడుతుంది. వస్తువు ఎంపికలో దృక్పథంతో నిలబడటంలో కవి ఖచ్చితత్వం మెచ్చుకోదగింది.

**ఆధార గ్రంథాలు**

1. దళిత వ్యాకరణం – తుళ్ళిమల్లి విల్సన్ సుధాకర్
2. మాకూ ఒక భాష కావాలి– తుళ్ళిమల్లి విల్సన్ సుధాకర్
3. పోరాట పద్యం –తుళ్ళిమల్లి విల్సన్ సుధాకర్
4. ఒక దశాబ్దాన్ని కుదిపేసిన దళిత కవిత్వం–డా. ప్రసాద మూర్తి.
5. చిక్కనవుతున్న పాట – జి.లక్ష్మీ నరసయ్య.
6. దళిత వాదాలు, వివాదాలు.–డా.ఎస్వీ సత్యనారాయణ.

– పరిశోధక విద్యార్థి, ఎస్వీయు, తిరుపతి, ఆంధ్రప్రదేశ్.

పుస్తక సమీక్ష

# రాళ్లసీమను వెలిగించిన సింగిడి

డా.శివరాత్రి సుధాకర్

ఇప్పుడు మీకొక సాహసిని పరిచయం చేస్తాను. కత్తి వాదరకు ఎదురు నిలిచే సాహసిని. కత్తికంటే పదునైన అక్షరాన్ని. అక్షరం, ఆవేశం కలగలిసిన కథల్ని చెప్తాను. అతనో ప్రవాహం. ఎక్కడా నిలువని ప్రవాహం. అతని అక్షరం దేనికీ తలవంచని ఎగసే సంద్రం. అతడు రాసింది కొన్ని కథలే. ఐనా అవి మనల్ని జీవితాంతం వెంటాడే కథలు. లోలోపల కల్లోలం రేపే కథలు. మానని గాయాల వలపోతల్ని అల్లిన కథలు. రాళ్లసీమను వెలిగించిన సింగిడి రాప్తాడు కథల పరిచయమిది. అతని కథలన్నిటికీ మధ్య తరగతి జీవితాలే నేపథ్యం. కథలల్లే తీరులో కొత్త టెక్నిక్‌ను ఎంచుకున్నాడు. ఇవి చదువుతున్నంత సేపూ రచయితే వచ్చి మన ఎదురుగా కూర్చొని మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. ఆ జీవితాల తాలూకు విషాదాన్ని మన మనసుల్లోకి ఒంపి కన్నీళ్లు పెట్టిస్తాడు.

కోట్లాది మహిళల అంతరంగ వేదనను చిత్రించిన కథ 'సీతమ్మత్త'. ఇది ఒక సీతమ్మ కథ మాత్రమే కాదు. నాటి సీత నుంచీ నేటి సీతల దాకా దగాపడ్డ మహిళల సులుకుపోట్ల గాయాల వర్తమానం. కలలన్నీ కల్లలైన కన్నీళ్ల కథ. పితృస్వామ్య సంకెళ్లలో బందీలుగా ఉన్న స్త్రీల కథ ఇది. 14 జనవరి 1994, ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయింది. ఓ రోజు కథకుడు తన దగ్గరి బంధువు సీతమ్మత్తను చూడటానికి వెళ్లాడు. ఆమె భర్త గుండె నొప్పితో చనిపోయి అప్పటికే మూడు నెలలైంది. ఆమెను పలకరించటానికి ధర్మవరం వెళ్లాడు. కథకుడి తండ్రికి సీతమ్మ దగ్గరి బంధువు. వాళ్లకు పల్లెలో ఐదెకరాల భూమి ఉన్నది. చినుకు పడితే ఆ భూమిలో బంగారం పండించొచ్చు. సీతమ్మ పెద్ద కూతురికి పెళ్లయింది. చిన్న కూతురు చదువుతోంది.

ధర్మవరం చేరేసరికి రాత్రయింది. రాత్రి భోజనాలయ్యాక సీతమ్మ, ఆమె కూతురు, కథకుడు డాబాపైకి వెళ్లారు. చల్లగాలిలో మాట్లాడుతుంటారు. ఆమె ప్రపంచ విషయాలన్నీ మాట్లాడింది. అందులో తన భర్త గురించి ఒక్క మాటైనా లేదు. భర్త చావు, దినాల సంగతులేమైనా చెప్తుందేమోనని ఎదురు చూశాడు. ఆమె అసలేమీ జరగనట్టే వుంది. ఆ విషయాన్ని పొడిగించడం ఇష్టం లేనట్టుంది. ఆమె ఆంతర్యం అర్థం కాక టాపిక్ మార్చాడు. అతనికి తన మిత్రుడి సంగతి గుర్తొచ్చింది. మిత్రుడికి సీతమ్మ కూతురితో పెళ్లి సంబంధం గురించి మాట్లాడాలనుకున్నాడు.

"అత్తా... శ్రీనివాసులు అని మా ఆఫీసులో పని చేస్తున్నాడు. నా కంటే ఐదేళ్లు చిన్నోడు. మంచి పిల్లోడు. మన కుటుంబంతో చాలా స్నేహంగా ఉంటాడు. ఏ బరువు బాధ్యతలూ లేవు. మన ఉమకి మంచి సంబంధం అవుతుంది. ఆలోచిస్తావా?" అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. కొద్దిసేపు మౌనం. తర్వాత... "బిడ్డకు నేను పెండ్లి చేయదలుచుకోలేదు. దాని చదువు అది చదువుకొని, దాని కాళ్ల మీద అది నిలబడి, దాని జీవితం అదే నిర్ణయించుకుంటుంది" అని స్థిరంగా చెప్పింది. సూటిగా. "పెండ్లీ, సంసారం అంటేనే యాసిరికి వచ్చింది నాకు" అని స్థిమితంగా చెప్పింది. ఆమె ఆలోచనలూ, మాటలూ కథకుడికి కొత్తగా అనిపించాయి. ఆశ్చర్యపోయాడు. అతనికి ఏం మాట్లాడాలో అర్థం కాని పరిస్థితి.

గోడకు ఆనుకొని మళ్లీ మొదలు పెట్టింది. అప్పుడు విప్పింది. ఆమె అంతరంగ కల్లోలాన్ని. ఎన్నడూ ఎవ్వరికీ చెప్పుకోని సునామీని. రెప్పల మాటున దాచుకున్న వేనవేల కన్నీటి సంద్రాల్ని. నడిరాత్రి దాకా చెప్తూనే ఉన్నది. మానని గాయాలను. వలపోతను. గాయమైపోయిన గతాన్ని. నింగిలో వెలిగే చుక్కల సాక్షిగా. చెప్తూనే ఉన్నది. ఆ మసక చీకటిలో. ఇన్నాళ్లుగా తన బతుకులో అలముకున్న చీకట్లను. వెలుగు కోసం పడిన తపనను. ఊపిరాడక తండ్లాడిన దీనత్వాన్ని చెప్పింది.

"ఎందుకు చేయాలో చెప్పు నాయనా పెండ్లి. పెండ్లి చేసుకొని యేండ్లు సంసారంచేసి నేనేం బావుకున్నానని. అది వొక జీవితమేనా?" అన్నది పొలమారిన గొంతుతో. మళ్లీ అందుకున్నది. "మీ మొగోళ్లు అప్పులూ, సప్పులూ, సొంతిల్లూ, సంపాదన గురించి మాత్రమే మాట్లాడతారు. ఆ ఇండ్లలో ఆడోళ్ల బతుకు ఎట్లా వుంటుందో ఎప్పుడయినా ఆలోచిస్తారా?" అని ప్రశ్నించింది. ఆ ప్రశ్నలో భూకంపం ఉన్నది. గోపీ కథను యథాతథంగా చెప్తేగాని అర్థం కాదు, ఆ కథలోని తీవ్రత. కన్నీళ్లు. బతుకు బండి చక్రాల కిందపడి నలిగి నలిగి నుజ్జునుజ్జయ్యే స్త్రీల అంతరంగం. మీ అమ్మా, మా అమ్మా... మనందరి అమ్మల బతుకుల్లోని అల్లకల్లోల కన్నీటి సంద్రాలు.

చుట్టూ పరుచుకున్న చీకటి సాక్షిగా చెప్తోంది సీతమ్మ. వెలుగులీనే కళ్లతో. తుఫాను తర్వాతి ప్రశాంతతలా. వాన వెలిసిన తర్వాత స్థిమితమైన నింగిలా. ప్రాణాల్ని ఉగ్గబట్టుకొని చదవండి.

"పెండ్లి కాకమునుపు గుణసుందరి సినిమా చూసి ఎలుగ్గొడ్డుతో వొక ఆడది సంసారం ఎట్లా చేసుంటుందబ్బా! అని ఆశ్చర్యపడినాను. దుక్కమొచ్చి కండ్లనిండా నీళ్లు పెట్టుకుంటి. మీ మామతో సంసారం ఎలుగ్గొడ్డు కంటే అధ్వానం తండ్రీ! ముప్పై ఏండ్లలో యా దేవుడూ నన్ను రక్షించలేకపాయ మీ మామ బారి నుంచి!

నా కంటూ వొక బతుకు వుండిందా? పక్కింటి వాళ్లతో మాట్లాడినా అనుమానమే. సంవత్సరానికొకసారి సినిమాకి పోతే మొగోళ్లు వుంటారని చెప్పి ఆడతిప్పి, ఈడ తిప్పి సగం సినిమా అయినపోయినాక ఏ డొక్కు కుర్చీలోనో కూలేసేవాడు. తను బయటికి పోతానే ఇంటికి వాకిలి ఏసుకోవడం మర్చిపోతే మళ్లీ వచ్చి మా శనిద్రం వదలగొడ్తాండె. ఆఖరికి నేను కట్టే చీరలూ, రైకలూ, లంగాలూ నా ఇష్టం వచ్చినట్లు కట్టలేదు. తను తెచ్చిండేవే కట్టుకోవల్ల. వద్దులే నాయన, కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందని చెప్పుకుంటూ పోతే ఈ రాత్రంతా, రేపు పొద్దంతా చెప్పొచ్చు.

మహానుభావుడు ఇంట్లో వుంటే కాళ్లు, చేతులూ ఆడక పట్టుకున్న సామాన్లు పట్టుకున్నట్టే జారిపోతాండె.

చిన్నప్పుడెప్పుడో హిట్లరు పాఠం చదువుకోనుంటిమి. వానికి పదిరెట్లు మించినోడు మీ మామ. ప్రతాపమంతా నా మిందా, పిల్ల మిందే. ప్రపంచానికేమే నోట్లో నాలుక లేనోడు.

సచ్చిపోయిన్నాడు నలుగురి కోసమన్నా రెండు కన్నీటి బొట్లు రాలకపాయె. మిగిలుంటేనా రాలేకి!

ఏమి మా అత్త ఇంత తెగించి మాట్లాడుతుంది అనుకుంటావేమో పాపోడా! నిజం చెప్పుతాను నీకంటే నాకెవుడుండాడు. మీ మామ సచ్చినంకనే హాయిగా వుంది. 'ఇన్నాళ్లు ఎట్ల బతికినానా? అని తలుచుకుంటే గుండె దడ పుడతాది. ఇంకెందుకు నాయనా దానికి పెండ్లి. దాని బతుకూ నా మాదిరి కాకున్నా, సుఖంగా, సొతంత్రంగా బతుకుతాదనే నమ్మకం లేదు. దాని బతుకు దాని నిర్ణయానికే వదిలేస్తాను" అంది గాద్గదికమైన గొంతుకతో. ఆ గొంతులో దశాబ్దాల బాధ గూడు కట్టుకొని వుంది. ఆర్తి వుంది. ఆవేదన వుంది.

ఎంతో సజావుగా సాగిపోతుందనుకున్న అత్త కాపురంలో ఇంత బడబానలం వుండేదని అర్థమయ్యే పాటికి నాలో ఏవో విచిత్రానుభూతులు కనిపించాయి. మాట్లాడ్డానికి మాట రాక స్తబ్దంగా వుండిపోయాను.

"ఏదో మనసు వుండబట్టలేక అన్నీ కక్కేస్తి. నా భారమంతా దిగినట్లుంది. ఎట్లనన్నా అర్థంచేసుకో, నువ్వూ వొక మగోడివే కదా!

పొద్దుపోయింది. పండుకో. నేను కిందికి పోతాండ" అని నీళ్లచెంబు నా తలసాటున పెట్టి తాంబూలం తట్ట తీసుకొని మెట్లు దిగి వెళ్లిపోయింది.

ఇంకెక్కడి నిద్ర!"

ఇదీ కథ. నిద్రపోనివ్వని కథ. నిదురలోనూ, మెలకువలోనూ వెంటాడే కథ. మనచుట్టూ ఎన్నెన్ని జీవితాలు చీకట్లలో మగ్గిపోతున్నాయో చెప్పిన కథ. చివరి వాక్యంతో మెరిపించే కథనమే రాప్తాడు శైలి. అలవోకగా చెక్కిన శిల్పం. కళ్లముందున్న చాలా చిన్నచిన్న విషయాలను ఒడుపుగా అల్లే కథల గిజిగాడు రాప్తాడు. ఒక్కో వాక్యం గుండెను తాకేలా రాశాడు. గుండెతడి వున్న వాక్యాలవి. ఒక దృశ్యానికీ, మరో దృశ్యానికీ మధ్య భావాలు సింగిడై మెరుస్తాయి. వాన చినుకై కురిసి, లోలోపల నెగళ్లను రాజేస్తాడు. ఆరని మంటల్లోకి నడిపిస్తాడు.

ఒక అమాయక మనిషిని ఏ పరిస్థితి ఎట్లా మార్చి, ఏమార్చుతుందో చెప్పిన కథ 'రౌడీ'. ఒక అబద్ధం ఎంత అందంగా ప్రచారమవుతుందో అర్థం చేయించే కథ ఇది. కింది కులాల మనుషుల్ని అవసరమైనంత మేర వాడుకొని, చివరికి ఎట్లా కడతేరుస్తారో చిత్రించిన కథ. 18 మే 1997 ఆదివారం ఆంధ్రజ్యోతిలో అచ్చయింది.

ఒకరోజు కథకుడు తన స్నేహితుడు రాజుతో కలిసి బయట టీతాగుతున్నాడు. కొద్ది దూరంలోనే ఓ హత్య జరిగింది. నడిరోడ్డు మీద రెండు ముక్కలైన శవం. తల ఒక చోట. మొండెం మరోచోట. నెత్తుటితో తడిచిన తల వెంట్రుకలు. వీపుపై కత్తిపోట్ల గాయాలు. ఆ గాయాల్లోంచి ధారలుగా కారుతున్న నెత్తురు. నెత్తుటి మడుగులో గిజగిజా తన్నుకొని ఊపిరొదిలిన మనిషి. జనమంతా గుంపులు గుంపులుగా జమయ్యారు. వాళ్లందరిలో ఆందోళన. భయం. ఉత్కంఠ. భళ్లున పగులుతున్న బస్సులు, కార్ల అద్దాలు. జనమంతా షాపులపై పడ్డారు. లూటీ చేశారు. పెద్దపెద్ద వస్తువుల్ని నడిరోడ్డుపై వేసి నిప్పు పెట్టారు. మంటల్లో కాలిపోతున్న వస్తువులు. ఆ ప్రాంతమంతా వ్యాపించిన పొగలు. ఊపిరాడని స్థితి. అంతలోనే పోలీసుల వ్యాన్ దూసుకొచ్చింది. రెచ్చిపోయిన జనాలు పోలీసులపై రాళ్లవర్షం కురిపించారు. పోలీసులు టియర్ గ్యాస్ వదిలారు. గాల్లోకి తూటాలు పేల్చారు. మోకాలి చిప్పలు చిట్లిపోయిన వాళ్లు కొందరు. తలలు పగిలినవాళ్లు కొందరు. కాళ్లు విరిగినవాళ్లు కొందరు. అందర్నీ వ్యాన్‌లో కుక్కి స్టేషన్ కు తీసుకుపోయారు. అంతటా విధ్వంసం.

ఆ విధ్వంస శకలాల్ని ప్రెస్ వాళ్లు ఫొటోలు తీసుకున్నారు. అప్పుడే కథకుడూ, రాజూ చెరోదిక్కు వెళ్లిపోయారు. కథకుడు ఇంటికి వెళ్లాడు. రాత్రంతా నిద్రలేదు. కన్నీళ్లింకిన దుఃఖాన్ని ఇట్లా చెప్తున్నాడు.

"అంతా చూసిందేగదా. కాపోతే అక్షరాల్లో వుంటుంది. టీపాయ్ మీద దినపత్రికను తాకబుద్ధి కాలేదు. ఎంత చూడొద్దనుకున్నా కళ్లకి అడ్డొస్తున్నాయి పెద్ద పెద్ద అక్షరాలు.

'రౌడీ గురు హత్య'. ఒక అబద్ధం ఎంత అందంగా ప్రచారమౌతుందో. ఎంత తొందరగా నమ్మేస్తారో జనాలు. చూసింది చూసినట్లే నమ్ముతారు. మాయ తెరలను చీల్చి చూసే చూపు వీళ్లకి ఎప్పుడు వస్తుందో. రౌడీ బతికే వున్నాడు. చచ్చింది గురువొక్కడే. (అతడు బయలుదేరాడు; 2000, పుట.23)

చచ్చింది గురు వొక్కడే. నా Innocent friend గురు వొక్కడే" అని కన్నీళ్లతో చెప్తున్నాడు కథకుడు. లోలోపల సుళ్లు తిరిగే దు:ఖంతో. తన స్నేహితుణ్ని గుర్తు తెచ్చుకుంటున్నాడు. అతని పరిచయాన్ని. అమాయకత్వాన్ని. పేదరికాన్ని. రెక్కడితే గాని డొక్కాడని బతుకుని. దిగులు గువ్వలా ఒదిగివుంటే గురు. జీవితంపై అనేక ఆశలు పెట్టుకున్నగురు. నిరుపేద. అయ్యలేదు. అమ్మ ఒక్కతే. మనకూ పరిచయం చేస్తున్నాడు.

"అప్పుడు నేను ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. మొదటి సంవత్సరం ప్రారంభం రోజులు. లీజర్ అవర్‌లో లెక్కలు చేసుకుంటున్నా. "నేను చూడొచ్చా" బిడియంగా బెదురుకళ్ల వాడొకడు ఎదురుగ. వాడు కొత్త బట్టలు వేసుకున్నాడు. కానీ ఆ డిజైన్ పాతది. ఆముదం రాసి తలదువ్వుకున్నాడు. వీలయినంత శుభ్రంగా, వినయంగా వున్నాడు. అయినా వాడి బట్టల రంగూ, ముఖ కవళికలను బట్టి ఇట్లే పోల్చేస్తారు. వెకిలిగా నవ్వుకుంటారు. గేలిచేస్తారు.

షోకు పిల్లులకి వాడొక ఎలక వాడెప్పుడూ తోక తెగిన ఎలకలా దిగులుగా భయం భయంగా.

"కూచో" అన్నాను. "ఈ రోజు సార్ జెప్పిన లెక్కలా?" అడిగాడు. "కాదు ట్యూషన్ లో చెప్పినవి." కాసేపు మౌనం. ఆ తర్వాత అన్నాడు– "ఈడ సార్ జెప్పిన లెక్కలు నాకు అర్థం కాలేదు. భయమయితాంది. ట్యూషన్ పోవల్లంటే మా అమ్మ తాన అంత డబ్బులేదు. మా అమ్మ దోసెలు పోసి అమ్ముతుంది."

వాడంటే జాలి ముంచుకొచ్చింది. వానికేదో చెప్పాలనుకున్నాను. నా భావనల్నితర్జుమా చేసే భాష నాకు రాలేదు. సరే నా నోటుబుక్కులు ఇస్తా... రాస్కో అన్నాను.

వాడి మొహంలో వొక మెరుపు. వాడి కళ్లనిండా కతజతకి మించినదేదో భావన తొణికిసలాడింది.

నా నోట్ బుక్ ని అలా సుతిమెత్తగా చేతుల్లోకి తీసుకొని అక్షరాల వేపు శ్రద్ధగా చూస్తుండిపోయాడు.

"ఇంటర్ పాసైతే ఉద్యోగం వస్తుందిగదా" అడిగాడు.

"ఏమో నాకు తెల్దు. డిగ్రీ అయినా చదవాలనుకుంటా. ఏమోలే రేపు మా నాన్నని అడిగి చెప్తా" అన్నాను.

వాడి మొహంలో వొక నిరాశ నీడ కదలాడింది." కథకుడు అతని అంతరంగాన్ని చదివాడు. అతని వేదన అర్థమయింది. ఆ కళ్ల మాటున విషాదం అర్థమయింది. ఆ మాట వెనక ఎన్ని గాయాలున్నాయో తెలిసింది. "ఇంటర్ పాసైతే ఉద్యోగం వస్తుందిగదా". కథకుడి మనసులో ఈ మాటే సుళ్లు తిరుగుతోంది. ఎంత అమాయకత్వం వాడిది. ఎన్ని కలలు. జీవితంపై. ఎంత వెతుకులాట. బువ్వ కోసం. బుక్కెడు బువ్వకోసం. అమ్మ కష్టాన్ని అర్థంచేసుకున్న మనసు. ఒంటరి మహిళపై ఎంత చిన్నచూపుటుందో చిన్నవయసులోనే అర్థంచేసుకున్న గురు. ఇంటర్ పాసైతే ఉద్యోగం వస్తదనుకున్నాడు. కష్టాలు తీరుతాయనుకున్నాడు. అమ్మను సుఖంగా చూడాలనుకున్నాడు. అందుకే చదువుకోసం తపనపడ్డాడు. కథకుడి నోట్స్ తీసుకున్నాడు. వెనక బెంచీకి వెళ్లిపోయాడు.

"ఆ రోజంతా వాడి కళ్లలోని దిగులుచూపు నన్ను వెంటాడింది. వాడికీ నాకూ అంతర్లీనంగా ఏదో దగ్గరితనం. మా నాన్న చిన్నప్పుడే జేజినాయన పోయాడట. జేజి కూలికి పోయేదట. పల్లె నుండి రోజు అనంతపురానికి నడిచివచ్చేవాడట. నాన్న పుస్తకాలు కొనలేని పేదరికం. వాళ్లవీ వీళ్లవీ అరువు తెచ్చుకొని చదువుకున్నాడట. ఈ విషయాలన్నీ నాన్న ఎపుడయినా చెబితే నా కళ్లలో నీళ్లూరేవి.

అలా వాడితో... ఆ గురుమూర్తితో నా స్నేహం." అట్లా మొదలైంది వాళ్లిద్దరి స్నేహం. పేదరికం మూలాలు కలిపిన స్నేహం. మనుషుల్ని మనుషులుగా అర్థంచేసుకొనే బతుకుల్లోంచి వచ్చిన మనుషులు వాళ్లు. అందుకే వాళ్లిద్దరి స్నేహం మనల్ని వెంటాడే కథయింది.

ఒకరోజు ఇంటర్వెల్ టైమ్ లో ఓ విద్యార్థి ఫుట్ బాల్‌లా ఎగిరొచ్చి గ్రౌండ్‌లో పడ్డాడు. వాణ్ని ఈడ్చికొడుతున్నాడు గురు. విరిగిన బెంచీ కాలు తీసుకొని బాదుతున్నాడు. గ్రౌండంతా పొర్లిచ్చి కొడుతున్నాడు. ఒళ్లంతా దుమ్ము దుమ్ము. ముక్కు పగిలింది. రక్తం ధారగా కారుతోంది. భయం. నిలువెల్లా భయం. ప్రాణ భయం. చచ్చిపోతానేమోనని. గజగజా వణుకుతూ నేలపై కూలాడు. గుడ్లు తేలేశాడు. చచ్చాడనుకున్నారు. కట్టెను విసిరేసి నిప్పుకణికల్లాంటి కండ్లతో బయటికెళ్లాడు గురు. ఇదంతా

లెక్చరర్లు, విద్యార్థులు చూస్తుండగానే. కానీ ఎవ్వరూ ఆపలేకపోయారు. వాళ్లలోనూ భయమే. ఆ సంఘటన చూసి.

"ఆ తర్వాత తెలిసింది. గురుమూర్తిని 'లంజ కొడకా' అని తిట్టాడట వాడు. నిజంగానట వాడి అమ్మ థియేటర్ దగ్గర... గుసగుసలు".

మరుసటి రోజు పోలీసులు వచ్చారు. అప్పుడు క్లాస్ జరుగుతోంది. గురుమూర్తి గువ్వపిట్టలా ముడుచుకొని నిలబడ్డాడు. అక్కడే గురును కొట్టారు. జీపులో పడేశారు. స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ తర్వాత రోజు ఎప్పటిలాగే కాలేజీకి వచ్చాడు. ఇప్పుడు గువ్వపిట్టలా లేడు. గుండెల్నిండా ధైర్యం. తనిప్పుడు ఒంటరి కాదు. తన చుట్టు ఓ గుంపు. కాలేజీకి వచ్చినా. గ్రౌండ్ కి వెళ్లినా. ఇంటికి వెళ్లినా. చుట్టూ పదిమంది. కాలేజీ అంతా గురుమూర్తి పేరు మార్మోగింది. కాజీకి ఎన్నికల్లో పోటీచేశాడు. బంపర్ మెజార్టీతో జాయింట్ సెక్రటరీ అయ్యాడు. రెండో ఏట కూడా సెక్రటరీ అయ్యాడు. ఇంటర్ అయిపోయింది. గురు పరీక్ష తప్పాడు. క్రమంగా రాజకీయ పార్టీ పరిచయమైంది. తొందర్లోనే ఆ పార్టీ యూత్ ప్రెసిడెంట్ అయ్యాడు. తరచూ ధర్నాలు. రాస్తారోకోలు. ఆందోళనల్లో గురుపేరు చూసి ఆశ్చపోయాడు కథకుడు.

కథకుడు డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్నపుడు ఓ వార్త పట్టణాన్ని కుదిపేసింది. గురుపేరు వింటే హడల్. సొంత పార్టీ జిల్లా నాయకుణ్ని పట్టపగలు నరికేశాడు గురు. పోలీస్ స్టేషన్ కు పదిగజాల దూరంలోనే. పదిరోజుల్లోనే మళ్లీ వీధుల్లో బలాదూర్ గా తిరుగుతున్నాడు. ఏ భయమూ లేకుండా. ఇదంతా విని ఆశ్చర్యపోయారందరూ. గురు ఆ పార్టీని వదిలేశాడు. అధికార పార్టీ ఎమ్మెల్యేతో చేతులు కలిపాడు. ఆ సంఘటన తర్వాత కథకుడు గురుమూర్తిని ఎప్పుడూ చూళ్లేదు. పిల్లలూ, ఉద్యోగంలో బిజీ అయిపోయాడు.

"కానీ వాడి పేరు వినిపించేది. రౌడీ మామూళ్లు, కిరాయి హత్యలు, అత్యాచారాలు... ఏవి ఎక్కడ జరిగినా వాడి పేరు వినిపించేది. మనుషుల్లో భయం కనిపించేది. అలా వినబడి నిన్న కనిపించాడు తునాతునకలయిన శవం రూపంలో."

"రాజు వచ్చాడు. "వాడే ఆ కుక్కల కొడుకు ఎం.ఎల్.ఏ గాడేనంట చంపింది. పాపం 'గురు' పందేల కోడి. కూటికి లేనోన్ని తెచ్చి కత్తులు గట్టి కుత్తుకలు కోశార్రా... దొంగ నా కొడుకులు.' మున్సిపల్ ఎలక్షన్ చైర్మన్ పదవికి తానే పోటీ చేస్తానన్నాడట గురు. వీల్లేదన్నాడట ఎం.ఎల్.ఏ. బామ్మర్దిని నిలబెట్టాలని వాడి ప్లానట. ఇండిపెండెంట్ గా బరిలోకి దిగుతానన్నాడట గురు. అంతే వాడి పాడే లేచింది. ఇంకో విషయం తెలుసా? వాణ్ని చంపేదానికి ఎం.ఎల్.ఏ గాడూ, అపోజిషన్ వాళ్లూ చేయిచేయి కలిపారంటా.

అదే వాడు మాదిగవాడు గాకుండా వుంటే పిల్లనిచ్చి, వరుస కలిపి మరీ బందోబస్తుగా బరిలోకి దింపేవాళ్లు.

ఏ రంగం అయితేనేమి? రాళ్ల దెబ్బలు మనకీ. రాలిన కాయలు వాళ్లకీ... పెదాలు బిగించి కుడిచేతి పిడికిలిని ఎడమ అరచేతిలో కొట్టుకుంటూ కూర్చున్నాడు రాజు. మాటలు పెగలని వేదనాగ్రహంలో నేను.

"నాకు లెక్కలు అర్థం కావట్లేదు... ట్యూషన్ పోయేదానికి మా అమ్మతాన డబ్బులేదు..., ఇంటర్ పాసైతే ఉద్యోగం వస్తుందా...." గురు దిగులు చూపులు నన్ను వెంటాడుతున్నాయి. గుండెల్ని కరగదీస్తున్నాయి. మమ్మల్ని దహించివేస్తూ మౌనాగ్ని రాజుకుంది.

బయట మా ఇంటిముందు కొళాయి నీళ్లు పట్టుకుంటూ "పీడపోయింది. రౌడీ నాయాలు. మరీ అంత రౌడీతనమా. వాళ్లమ్మ థియేటర్ దగ్గర దోసెలు పోస్తన్నదంట. దానికి పెండ్లి లేదంట. మొగుడు లేకనే కొడుకును కనిందట. వాడు రౌడీ అయి కూర్చున్నాడు"

చచ్చినవాన్ని శాపనార్థాలు పెడుతున్నారు ధైర్యంగా. రాజు విసురుగా బయటకు వెళ్లాడు. ఇగో... మీకు రౌడీ అంటే ఎవరో తెలుసా. రౌడీల్ని గుర్తుపట్టే జానం లేనపుడు వూరికే నీళ్లు పట్టుకుపోండి. అని తిట్టేసి వచ్చాడు."

ఇందులో చివరి వాక్యమే కథకు ప్రాణంగా నిలించింది. కథలోని ఆయువుపట్టునంతా ఒకే వాక్యంలో మెరిపించాడు. ఇట్లా కథను నడిపించడం అద్భుతమైన శిల్పరహస్యం. సమాజంలో అసలు రౌడీలెవరు? రౌడీల్లేని రాజకీయ పార్టీ ఒక్కటైనా ఉన్నదా? పార్టీల ఆధిపత్య కుమ్ములాటల్లో ఎన్ని గ్రామాలు వల్లకాడయ్యాయో! నెత్తురు చిందని ఊరు ఒక్కటైనా ఉందా? దేశమంతా. కులబలం, ఆర్థిక బలం, అధికారం, పలుకుబడి ఉన్నవాళ్లంతా కింది కులాల వాళ్లను ఎట్లా పావులుగా వాడుకుంటారో అర్థం చేయించిన కథ ఇది. కథ పూర్తయ్యాక మనలో అలజడి చెలరేగక తప్పదు. వాళ్లమ్మ కళ్లల్లో పారే కన్నీటి నది మళ్ని నిలువెల్లా ముంచెత్తక తప్పదు. గురు వెంటాడతాడు. జీవితాంతం. మానని గాయంలా.

రాళ్లసీమలో చిగురించిన రాప్తాడు గోపాలకృష్ణ ఏ విమర్శకుడి తూనికరాళ్ల దగ్గరా ఆగిపోలేదు. ఏ తక్కెడా తన అక్షరాల కన్నీటిని, గుండె తడి బరువును తూచలేవని అతనికి తెలుసు. అందుకే సాగిపోయాడు గోపి. ఏరువాక తొలకరై. చిమ్మచీకట్లలో వెలిగే మిణుగురై. సాగిపోయాడు. ఆరుద్ర పూవులా. అంతరంగాల్ని అల్లుకుంటూ. పెనవేసుకుంటూ. ఇంకెప్పటికీ మనకు ఎదురవ్వని గోపీ, తన అక్షరాలతో కరచాలనం చేశాడు. తన కథలపై కరచాలనం చేసే కరుకు గుండెల్నీ మీటుతూ. తన అక్షరాలతో గోడల్ని ధ్వంసం చేస్తూ. వెళ్లిపోయాడు. వెనుదిరగకుండా.

★ రచయిత: అధ్యాపకులు, నిజాం కళాశాల

## పుస్తక సమీక్ష

# అక్షరానికి కమిటైన అధ్యాపకుడి అంతరంగం

డా.మెంతబోయిన సైదులు

మహద్ చెరువులో నీళ్లు తాగడానికి అంబేద్కర్ పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. పోతుంది అనుకున్న అంటరానితనం రాజస్థాన్ లో ఇంద్ర కుమార్ మేఘవాల్ అనే చిన్నారి విద్యార్థిని చచ్చేదాకా కొట్టింది. పోతుంది అనుకున్న అంటరానితనం, హత్రాస్‌లో అమ్మాయి వెన్ను విరగొట్టి, నాలుక తెగ్గొట్టి, అర్ధరాత్రి శవాన్ని కాల్చేసింది. పోతుంది అనుకున్న అంటరానితనం కత్తులతో నరికేసి ప్రణయ్ భార్యను విధవరాలిని చేసి, బిడ్డను అనాధను చేసింది. ఇవన్నీ భౌతికంగా బయటకు కనిపించే అంటరానితనం తాలూకా వివరాలు. కానీ ప్రతిరోజు ఏదో ఒకచోట మేధోపరమైన అంటరానితనం జరుగుతూనే ఉంది. అది ఎలా ఉంటుంది? అది చేసే గాయం ఎట్లా ఉంటుంది? అది ఎన్ని రకాలుగా ఉంటుంది? అది మనకు తెలియకుండా మన మధ్యనే ఎలాంటి పాత్ర పోషిస్తుంది? అనే ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఈ పుస్తకంలో జవాబులు దొరుకుతాయి అదే... ఈ అకడమిక్ అన్ టచ్ బులిటి పుస్తకం.

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ లిచింతకింది కాశీం రాసిన ఈ పుస్తకం గురించిన విశ్లేషణాత్మక సమీక్ష వ్యాసం. ఇది చదివినప్పుడు పుస్తకం చదవాలనే ఆత్రుత అభిలాష కలుగుతుంది.అక్షర జ్ఞానం ఉన్న, ఉన్నత విద్యావంతులు, ప్రొఫెసర్లు అకడమిక్ విషయంలో విద్యావ్యవస్థలో ఏవిధంగా అంటరానితనమును పెంచి పోషించి సమాజంలో అందలం ఎక్కిస్తూ, దాని ఫలితాలను చూసి మురిసిపోతున్నారో విశదీకరిస్తుంది. ఈ "అకడమిక్ అన్ టచ్ బులిటి".

అకడమిక్ అనగా విద్యాశాఖకు సంబంధించిన, విద్వత్సభ కు సంబంధించిన, విద్యా సంబంధిత, విద్యావిషయక అనే అర్థాలను మనం నిఘంటువు లో చూడవచ్చు. రచయిత విశ్వవిద్యాలయంలో ఒక ప్రొఫెసర్‌గా, ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీకి ప్రిన్సిపల్‌గా ఉన్నాడు కాబట్టి విద్యా సంస్థలలో అంటరానితనం విద్యార్థుల పైన, అధ్యాపకుల పైన ఏ విధంగా ఉంటుంది అనే విషయాన్ని కూలంకషంగా వివరించాడు.

ప్రొఫెసర్ కాశీం అనగానే అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తిగా, బోర్ కొట్టకుండా గంటల తరబడి రోమాలు నిక్కబొడిచేలా మాట్లాడుతూ ఆహుతుల చేత హర్షధ్వానాలు చేయించగల ఉపన్యాసకుడిగా మాత్రమే మనకు తెలుసు, కానీ తన మనసు పొరలలో, కనిపించని అంటరాని గాయాలు ఈ పుస్తకంలో ఎన్నో కనిపిస్తాయి. ఇరవై సంవత్సరాలలో తాను అనుభవించిన భౌతిక, మానసిక అంటరానితనం తన ఒక్కడిదే కాదంటూ, నాలాంటి ఎందరిదో అని "కాగితం మీద అక్షరానికి కమిటైన అధ్యాపకుడి కలం నుండి వెలువడిన పుస్తకమే ఈ "అకడమిక్ అన్ టచ్ బులిటీ"

### ఒకసారి పుస్తకంలోకి తొంగి చూస్తే

"ఆయన ఎస్సీ అని మీకు తెలుసు కదా? టీచర్స్ అసోసియేషన్ లో జనరల్ సెక్రటరీ పోస్ట్ చాలా ముఖ్యమైనది మీకేమైనా అవసరం వస్తే ఆయన దగ్గరకువెళ్ళవల్సివస్తది". (పుట: 9), ఉస్మానియా యూనివర్సిటీలో (ఔటా OUTA)ఎలక్షన్స్ సందర్భంగా ఒక అగ్రకుల ప్రొఫెసర్ నుండి వినిపించిన మాటలు.అకడమిక్ ప్రమాణాలు నెలకొల్పినా, మేధావుల్ని దేశానికి అందించినా, శాస్త్రీయ పరిశోధన చేసినా, భిన్న భావజాల ప్రకటనకు వేదిక అయినా, ఎంతటి ఉన్నతమైన చరిత్ర కలిగినా, దేశంతో పాటు యూనివర్సిటీలు కూడా నేడు కుల పునాదుల పైన నిర్మించబడినవి అని చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఆ కుల పునాదులకు పగుళ్లు రాకుండా, కుల కాంక్రీట్ ను, సిమెంట్ ను ఉపయోగించి నేడు విద్యావ్యవస్థలో, యూనివర్సిటీలలో మరింత బలిష్టంగా అంటరాని తనాన్ని ప్రతినిత్యం కాపాడుకుంటున్న అగ్రకుల అధ్యాపక బృందాల ప్రవర్తనను, ఆలోచనా విధానాన్ని, కుహనా మేధావి తనాన్ని ఉస్మానియా యూనివర్సిటీ మెట్లపై నగ్నంగా నిలబెట్టాడు రచయిత "అకడమిక్ అన్ టచ్ బులిటి" అనే వ్యాసంలో.

యూనివర్సిటీలో ఉద్యమాలు సహజం కానీ "ఏదైనా అవాంఛనీయసంఘటన జరిగినప్పుడు, వామపక్షాలు, ఉపాధ్యాయ సంఘాలు, నాలుగో తరగతి ఉద్యోగులు, అగ్రకులం వాళ్ళు , అందరూ ఏకమై పోతారు. దళిత విద్యార్థులను ఒంటరి వాళ్ళని వేసి వేధింపులకు గురిచేసి వారి జీవితాలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నారు". దీనికి ఉదాహరణగా హైదరాబాద్

కేంద్రీయ విశ్వవిద్యాలయం లో జరిగిన సంఘటన ను వివరిస్తూ సెంట్రల్ యూనివర్సిటీ చదువులతో పాటు, విద్యార్థి సంఘాలు, ప్రొఫెసర్లు ఏ విధంగా ఉంటారు కుల ప్రభావం ఏవిధంగాఉ ందో తెలియజేస్తారు. విద్యార్థుల్లో ప్రశ్నించే గళాలు ఉంటే వారిని ప్రణాళిక బద్ధంగా చదువులకు ఎలా దూరం చేయాలో, అగ్రకులాల ఐక్యత ఎలా ఉంటుందో దృశ్యాన్ని చూపిస్తారు. కనీస అర్హత మార్కులు వేయకపోవడం, స్కాలర్షిప్ తో చదివే వాళ్ళు అని , వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తూ చదువులకు దూరం చేసి వారి జీవితాలతో ఆడుకుంటారు. ఈ విషయాన్ని కూలంకషంగా ఉదాహరణతో సహా వివరించాడు రచయిత "సెంట్రల్ యూనివర్సిటీలో ఏం అరుగుతోంది" అనే వ్యాసంలో.

మనదేశంలోకి విదేశీ విశ్వ విద్యాలయాలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఎందుకు వస్తున్నాయి. అవి పెట్టుబడిదారుల చేతుల్లో ఏ విధంగా బందీ అవుతున్నాయి, విద్యా వ్యాపారంలో జరిగే అవినీతి, అక్రమాలను పూర్తిస్థాయిలో గణాంకాలతో సహా వివరించారు. "విదేశీ విశ్వ విద్యాలయాలు ఎందుకు" అనే వ్యాసంలో. నేడు ప్రతిరోజు గురుకులాలలో, ట్రిబుల్ ఐటీ బాసరలో ఫుడ్ పాయిజన్ అయ్యి విద్యార్థులు అనారోగ్యం,కు గురి కావడం చివరకు చనిపోవడం లాంటివి ప్రతిరోజు దినపత్రికల్లో చూస్తున్నాం. కానీ 2016 నుండి సంక్షేమ గురుకులాలు ఏ విధంగా ఉన్నవి. అంతకుముందు 1983-84 ఎన్టీఆర్ ప్రభుత్వం నుండి 2014 వరకు ఏ విధంగా ఉ న్నాయి అనే విషయాలతో విశ్లేషణాత్మకంగా కొనసాగింది ఈ వ్యాసం. సంక్షేమ, గురుకుల విద్య ద్వారా దళిత విద్యార్థులు సమాజంలో మేధావులుగా తయారవ్వడాన్ని జీర్ణించుకోలేని అగ్రవర్ణాల తీరును నిరసించాడు రచయిత."గురుకులాలు క్షేమంగానే ఉన్నాయా" అనే వ్యాసంలో. 20 సెప్టెంబర్ 2013 ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యోగంలో ప్రవేశించినప్పుడు జరిగిన అవమానం అంటరానితనానికి నిలువెత్తు సాక్ష్యం. ఊరు వదిలినా, పట్టణం వచ్చినా యూనివర్సిటీ ప్రొఫెసర్లైనా నీడలా వెంటాడి, నీ గతాన్ని గుర్తు చేస్తుంది కులం. యూనివర్సిటీలలో మార్పు తేవడానికి ప్రయత్నించిన కాశీం గారికి వెన్నుదన్ను మద్దతు కన్నా అవమానాలు ఎక్కువయ్యాయి.

**నా కవితా వధూటి వదనంబు నెగాదిగజూచి రూపురే/ ఖా కమనీయ వైఖరులు గాంచి భళీ భళీ యన్న వారే మీ/ దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో/బాకున గృమ్మినట్లగును పార్థివ చంద్ర వచింప సిగ్గగున్/**

అనే ఉత్పలమాల పద్యములో గుర్రం జాషువా గారు చెప్పిన సందర్భం. కాశీం గారి జీవితానికి సరిగ్గా సరిపోతుంది అని చెప్పవచ్చు.

ఆచార్య కాశీం గారిని ఉస్మానియా "యూనివర్సిటీ ఉ ద్యోగంలోకి రాకుండా. ప్రయత్నించారు. వచ్చినా కూడా నెల రోజులు డిపార్ట్మెంట్లో ఎవరూ సరిగా పలకరించలేదు. కూర్చోవడానికి కుర్చీ కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉ ంచలేదు. తను కూర్చున్న చైర్ ముందుకు రాసుకోవడానికి ఒక టేబుల్ రావడానికి నెల రోజులు పట్టిందంటే అంటరాని తనం ఎంతలా ఉస్మానియా యూనివర్సిటీని మింగేసిందో అర్థం. చేసుకోవచ్చు. కులం ఎంతలా అగ్రకుల మెదళ్ళలో నాటుకుపోయింది, అగ్రకుల తత్వం దాని వెన్నంటే ఉండి ఎంతలా పెంచి పోషిస్తుంది, అనే విషయం తన అనుభవం ద్వారా అర్థవంతంగా వివరిస్తాడు రచయిత. యూనివర్సిటీలో ఒక ఎస్సీ, డిపార్ట్ మెంట్ హెడ్ అయితే కూడా చైర్లో కూర్చోవద్దనే నీచపు బుద్ధిని ప్రదర్శించిన అగ్రకుల ఆచార్యుల నోళ్లను, మెదళ్లను యాసిడ్తో కడగాల్సిన అవసరం ఉందనిపిస్తుంది. విశ్వవిద్యాలయాలు అగ్రహారాలుగా మారాయనే నిజాన్ని రచయిత చెప్పడం అగ్రకులాల ఆధిపత్యాన్ని తెలియజేస్తుంది.

"ఏమమ్మా ఆ కుర్చీలో ఎందరో గొప్ప వాళ్ళు కూర్చున్నారు దానిలో కూర్చునే అర్హత మనకు ఎక్కడిది. ఇన్నాళ్లు నేనే ఆ కుర్చీలో కూర్చోలేదు. నీవు కూర్చుంటావా?" అని (పుట 83) ఒక బ్రాహ్మణ ప్రొఫెసర్, దళిత మహిళా ప్రొఫెసర్ను ప్రశ్నించిన తీరును, కులం పేరుతో దూషించిన తీరు కు ఆమె ఇచ్చిన సమాధానం శాఖ అధ్యక్షులు అయినప్పుడు కూర్చునే అర్హత ఉంటుంది కదా మీరు కూర్చోక పోవడం మీ వ్యక్తిగతం నేను కూర్చుంటాను అని సమాధానం ఇచ్చింది అక్కడే ప్రారంభమైంది వివక్ష. ఆ సంఘటన మొత్తాన్ని తర్వాత జరిగిన విషయాలను "అకడమిక్ అన్ టచ్ బులిటి" అనే వ్యాసంలో వివరంగా చెప్పారు రచయిత. ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా ఉన్న సందర్భాలను మనం ఈ పుస్తకంలో చూడవచ్చు.

"విద్య అంబేడ్కర్ ప్రాసంగికత" అనే వ్యాసంలో విద్యావంతులు అంటే అక్షర జ్ఞానం ఉన్నవాళ్లు అనే మాటతో రచయిత విభేధించాడు. ఇది వేద కాలం నుండి శ్లోకాలు రాజ్యమేలుతున్న సమయంలో బ్రాహ్మణులు కులాలకు చదువు లేకుండా చేసి "విద్య లేని వాడు వింత పశువు" అనే సామెతను పుట్టించారనీ దానికి విరుగుడుగా, చెప్పులు కుట్టడం, నాగలి దున్నడం, కుండలు తయారు చేయడం, బట్టలు నేయడం, లాంటి ఉత్పత్తి కులాల నైపుణ్యం ను విద్య కాదనడం రచయిత సమర్థించలేదు. అందుకు కారణాలు కూడా వివరించడం

పాఠకుణ్ణి ఆలోచింపజేస్తుంది. విద్య పట్ల అంబేద్కర్‌కు, ఉన్న దృక్పథం, గాంధీజీకి ఉన్న అవగాహనను ఉదాహరణగా చెప్తూ చెప్పిన వివరణ , సమాజం ఇంకా మారాలి అనే రచయిత ఆలోచన ను తెలియజేస్తుంది. అంబేద్కర్ చిన్నప్పుడు గణితంలోని సమస్య ను సాధిస్తానంటే బోర్డు వెనకాల ఉన్న మా భోజనాలు మైల వడతాయని తన ప్రతిభను అణచివేసిన విషయాన్ని అన్ టచ్ బులిటీ విశ్వరూపాన్ని ఉదాహరణలతో రచయిత వివరించాడు.

భారతదేశంలో హంటర్ కమిషన్ కు పూలే ఇచ్చిన నివేదికల సారాంశాన్ని, సైమన్ కమిషన్ కు అంబేద్కర్ ఇచ్చిన నివేదికల వివరణలు చిన్న పిల్లాడికి కూడా అర్థం అయ్యేంత సరళంగా వివరించాడు రచయిత. అంబేద్కర్ కు భారతదేశంలో విద్య గురించి, తాను పది సంవత్సరాలు విదేశాల్లో చదివిన చదువు గురించి స్పష్టమైన అవగాహన ఉంది. అందుకే "మనం నాగరికత అందించిన భౌతిక ప్రయోజనాలనైనా వదులుకోవచ్చునేమో గాని విద్య ద్వారా లభించే సర్వోత్కృష్టమై ఫలితాలను, ఫలాలను సంపూర్ణంగా అనుభవించే హక్కును మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కోల్పోకూడదు. సమాజం లో వెనుకబడ్డ కులాలవారు విద్య లేకుండా తమ ఉనికికి భద్రత లేదన్న విషయం ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు" (పుట 88) అనే విషయాన్ని అంబేద్కర్ వివరించాడని రచయిత ఉదహరించడం ప్రశంసనీయం.

"నాకు అమ్మా నాన్న లేరు" అనే వ్యాసంలో విక్టోరియా మెమోరియల్ స్కూలు గురించి మనకు తెలియని ఎన్నో విషయాలు చెప్పాడు రచయిత. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ దాతృత్వంతో అనాథ పిల్లల దదువు కోసం ఈ పాఠశాల ఏర్పడిన విధానం, అనాధ బాల జాలికల చదువుల గురించి 114 సంవత్సరాల క్రితం ఒక ఫ్యూడల్ ప్రభువు అనాథల కోసం ప్రభుత్వ ఆధీనంలో ఒకపాఠశాల నెలకొల్పడం సాధారణ విషయం ఏమీ కాదు"(పుట 70) అనే విషయాన్ని రచయిత అద్భుతంగా వివరించారు. 73 ఎకరాలు ఉన్న ఒక పాఠశాల స్థలం 1956 నుండి నేటి వరకు ఎలా అమ్మకాలు, లీజులతో పెట్రోల్ బంకులు, రైతు బజార్లు, బ్యాంకులకు స్వాధీనమై ఎంత దారుణ స్థితిలో ఉందో చెప్పే విషయాలు, నిజంగా పాఠశాలలోని పిల్లలకే కాదు ఆ స్థలానికి కూడా "అమ్మా నాన్న లేరనే" విషయాన్ని రచయిత చెప్పడం హృదయ విదారకంగా అనిపిస్తుంది. పాలకులపై కోపం కూడా వస్తుంది.

ఇదే కాకుండా రిజర్వేషన్లను అడ్డుకోవడం గవర్నమెంట్ కాలేజ్, కెజీ టు పీజీ విద్య, ఉపాధ్యాయుల నియామకం, బిసీ విద్య, పూలేఆలోచనలు గురించిన విశ్లేషణాత్మక వ్యాసాలు యూనివర్సల్ అన్ టచ్ బులిటి, ఫెలోషిప్ అన్ టచ్ బులిటీ, ఎడ్యుకేషన్ ఈజ్ ది పవర్ ఫుల్ వెపన్. ఇలా మొత్తం 20 వ్యాసాలను క్రోడీకరించి ఒక మంచి పుస్తకంగా అందించారు ప్రొఫెసర్ కాశీం గారు.

**ముగింపు**

రచయిత ప్రొఫెసర్ కాశీం గారు తాను అనుభవించిన అన్‌టచ్‌బులిటీ తనది మాత్రమే కాదని ఈ దేశంలో అంటరానితనమును ప్రతినిత్యం గాలిపీల్చినంత, మంచి నీళ్లు తాగినంత సహజంగా అనుభవిస్తున్న అందరి ప్రతినిధిగా చెప్పినట్లు ఉంటుంది. ముందు మాటనే అంటరాని వాక్యం గా పరిచయం చేస్తూ ఈ దేశంలో ఉన్న అంటరాని హృదయాలకు ఈ పుస్తకాన్ని ఇంకితం ఇవ్వడం సందర్భోచితంగా అనిపిస్తుంది. ప్రొఫెసర్ కాశీం గారు పాలమూరు మట్టి పరిమళాన్ని, నల్లమల పోరాట పటిమను. ప్రశ్నించే తత్వాన్ని, అక్షరాలతో పాటు ఆహ్వానించాడు. అందుకే చివరి శ్వాస వరకు కలం, గళం ప్రశ్నలను ఎక్కు పెడుతూనే ఉంటాయని వివరిస్తాడు. ఐ ఎస్ బి.ఎన్.నెంబర్‌తో ముద్రించబడిన ఈ పుస్తకం తన 12వ రచన. జనవరి 3, 2020న ప్రచురించబడింది. అంటరాని వరుస క్రమంతో విషయ సూచికను ప్రారంభించడంలోనే మనకు అంటరానితనం చేసే గాయాలు కనిపిస్తాయి.

కవర్ డిజైన్ కూడా తెల్లటి అట్టపై నల్లనిచేతిముద్ర, ఈ దేశ కుల పునాదుల పై నిరసన ను ఎర్రని అక్షరాలు ప్రశ్నించే తత్వాన్ని, పుస్తకం చివరి అట్టా బ్లూ కలర్ తో అంబేద్కర్ భావజాలాన్ని అందిపుచ్చుకున్నట్టుగా రచయిత మనస్తత్వానికి దగ్గరగా అనిపిస్తుంది. 20 సంవత్సరాల నుండి రాసిన వ్యాసాలను భద్రపరిచి ఎంపిక చేసుకుని వాటినుండి 20 వ్యాసాలను ఒక పుస్తకంగా ముద్రించడం అంటే ప్రొఫెసర్ కాశీం గారికి ఉన్న నిబద్ధత ఇక్కడ ప్రస్ఫుటమతుంది.

చరిత్రను పుటల్లోకి ఎక్కించాలనే అవసరాన్ని గుర్తించి, భావితరాలకు అందించాలనే గురుతర బాధ్యతకు మనం నమస్కరించకుండా ఉండలేం. అందుకే నేడు యూనివర్సిటీలలో పరిశోధనలు చేస్తున్న, విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి చదవాల్సిన పుస్తకం "అకడమిక్ అన్ టచ్ బులిటీ" అని నేను భావిస్తున్నాను. సమాజాన్ని చైతన్యపరిచే ఇలాంటి మరిన్ని పుస్తకాలు రచయిత కలం నుండి జాలువారాలని కోరుకుందాం.

T

పరిశోధన
పరిచయం

# తెలంగాణ భాషా స్వరూపం

డా. రాగుల సుధాకర్

**1. పరిశోధన శీర్షిక** (Title of Research):


తెలంగాణ భాష స్వరూపం అను పరిశోధన గ్రంథం తెలంగాణ ఉద్యమంలో నుండి వచ్చింది. తెలంగాణ విశ్వవిద్యాలయంలో డా. నాళేశ్వరం శంకరంగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి 2022లో ఈ గ్రంథాన్ని సమర్పించాను.

**2. పరిశోధన నేపథ్యం** (Background of Research)

తెలంగాణలో 1948 వరకు భాష విషయంలో, సంస్కృతి విషయంలో అనేక ఉద్యమాలు వచ్చినయి. 1956 లో ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. 1969 లో జై తెలంగాణ ఉద్యమం,1972 లో జై ఆంధ్ర ఉద్యమం వచ్చాయి. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య అస్తిత్వం విషయంలో అనేక ఉద్యమాలు వచ్చాయి 1956 నుండి 2014 వరకు ఈ ఉద్యమాలు నడిచాయి. ఆంధ్ర పాలనలో విద్యా, సాహిత్య, రాజకీయ, పత్రిక, సినిమా రంగాలలో తెలంగాణకు చాలా అన్యాయం జరిగింది. అందు వలన ఈ పరిశోధన చేశాను.

**3. పూర్వపరిశోధనలు సమీక్ష** (Review of Literature)

రవ్వా శ్రీహరి-నల్లగొండ జిల్లా పదకోశం, నలిమెల భాస్కర్ తెలంగాణపదకోశం, అప్పం పాండయ్య -మహబూబ్ నగర్ జిల్లా తెలుగు సామాజిక భాషా శాస్త్ర పరిశీలన కపిలవాయి లింగమూర్తి-పామర సంస్కృతం పాలమూరు మాండలికం, ముదిగంటి సుజాతారెడ్డి-తెలంగాణ వ్యవహారపదకోశం, భూతం ముత్యాలు-మాండలీకం (తెలంగాణ కులవృత్తి పదకోశం), యస్వీ. సత్యనారాయణ (సంపా) తెలంగాణ పదకోశం, కాలువ మల్లయ్య 'గుమ్మి' (తెలంగాణ వాడుక భాష పలుకులు, పలుకుబడులు), గుండెడప్పు కనకయ్య - తెలంగాణ భాషా సౌందర్యం, యస్. చంద్రయ్య తిమ్మాజిపేట మండల మౌఖిక భాష- వర్ణనాత్మక వ్యాకరణం మొదలైన గ్రంథాలను, ఏ. భారతి - తెలంగాణ కథలు భాషా పరిశీలన, మంత్రి మల్లేష్- తెలంగాణ మాండలిక నవలలు భాషా పరిశీలన, పరిశోధన గ్రంథాలను పరిశీలించి పరిశోధన చేశాను.


తెలంగాణ భాషా స్వరూపం
(పిహెచ్.డి. పట్టాకోసం తెలంగాణ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)
పరిశోధకు
రాగుల సుధాకర్
505512 Ph.D-TSD-01
పర్యవేక్షణ
డా. నాళేశ్వరం శంకరం
తెలుగు అధ్యయన శాఖ
తెలంగాణ విశ్వవిద్యాలయం
డిచ్‌పల్లి, నిజామాబాదు-503 322
తెలంగాణ, భారతదేశం
డిసెంబర్-2021

**4. పరిశోధన పరిధి** (Research Limit)

ఈ పరిశోధనను జిల్లా స్థాయిలో వచ్చిన పదకోశాలను, మాండలిక పదకోశాలను సాహిత్య గ్రంథాలను పత్రికా వ్యాసాలను పరిశోధనకు పరిధిగా ఎంచుకున్నాను.

**5. పరిశోధన పద్దతి** (Research Methodology)

ఈ పరిశోధనను వర్ణనాత్మక పద్దతిలో వివరించాను. పదాల పరిచయం, పదాల విశ్లేషణ, తులనాత్మక సంబంధం తెలియజేశాను.

**6. పరిశోధన లక్ష్యం** (Research Aim)

ఈ పరిశోధనను తెలంగాణ భాష, సంస్కృతి, అస్తిత్వంను, చరిత్రలో తెలంగాణ భాషాచరిత్రను తెలియజేయాలనే ఉద్దేశ్యంతో చేశాను.

**7. అధ్యాయాల విభజన** (Chapter Division)

నా పరిశోధనా అంశాన్ని 6 అధ్యాయాలుగా విభజించాను, 1 తెలంగాణ భౌగోళికాంశాలు చరిత్ర, 2 తెలంగాణ జీవన వృత్తులు సంస్కృతి భాష, 3 తెలంగాణ భాషాంశాలు, 4 తెలంగాణ అన్య దేశ్యాలు, 5 తెలంగాణ జాతీయాలు సామెతలు–భాష, ముగింపు, పరిశోధనా ఫలితాలు, ఉపయుక్త గ్రంథసూచి అనుబంధం.

**8. పరిశోధన ఫలితాంశాలు** (Research Findings)

అ). తెలంగాణ పదం పుట్టుక, ప్రయోగం వివిధ గ్రంథాలలో, శాసనాలలో ఉపయోగించిన విధానం, తెలంగాణ చరిత్రకు సంబంధించిన విషయాలు తెలియజేశాను.

ఆ). జీవన వృత్తులు:– కుమ్మరి వృత్తి ఎసల, కంచుదు,కాగు, గుర్గి, దుత్త అను పదాలు, మ్యాదరివృత్తి – గంప, తట్ట, గుల్ల అను పదాలు. వొడ్డె వృత్తి–కట్టురాళ్ళు, కంకర, కడీలు అను పదాలు.వడ్రంగి వృత్తి–పీట, బండి, కొడవలి పిడి, గొడ్డలికామ అను పదాలు, కమ్మరి వృత్తి–కొడవలి, గొడ్డలి, కొంకి పల్లు, గడ్డపార అను పదాలు అవుసుల వృత్తి పుస్తె, గుండ్లు, గేంటీలు కమ్మలు అను పదాలు. యాదవ, బేస్త, ఉప్పరి కంచరి, గౌడ, నేతపని, కోమటి, ఎరుకల, చర్మకార వృత్తులకు సంబంధించినపదాలను తెలియజేశాను. వ్యవసాయానికి సంబంధించిన పదాలు గుడ్డం, ర్యాగడి, మడి, నారు, గెట్టు, కాల్వ, గొర్రు, దంతె, జంబు, నాగలి వాడుకలో ఉన్నాయి. నీటి పారుదలకు సంబంధించిన పదాలు, ఆచారాలు, కాలవాచకాలు, కొలతలు అనుపదాలు ఉన్నాయి.

ఇ). భాషాంశాలు:– వర్ణాలు ప్రయోగాలలో ఖ, ఛ, ఠ, థ, ఫ, ఘ, ఝ, ఢ, ధ, భ,శ, ష అను సంస్కృత వర్ణాలు తెలుగులో వచ్చిచేరిన విధానం తెలుస్తుంది. ధ్వని మార్పులు : రెండు–రొండు, అక్కర–అక్కెర , ఓపిక–ఓపికె, నామ వాచకాలు: పదాల చివర అవ్వ,అయ్య అనునవి చేరుతాయి. ఉదా. రామవ్వ, ఎల్లయ్య, సర్వనామలకు పదాదిన'గ' కారంచేరుతుంది. ఉదా. ఇది–గిది, అది–గది అను పదాలు ఉన్నాయి. సంఖ్యా వాచకాలు నూరు, ఇన్నూరు, మున్నూరు. సర్వనామాలు ఈమె, ఈనా, ఇది, అది. నామ ప్రత్యయాలు తోటి–మాతోటి, లోపట–ఇంటి లోపట కెళ్ళి–ఎక్కడికెళ్ళి , అనునవి ప్రయోగంలో ఉన్నాయి.

క్రియలు:– ఎళ్లినం, వస్తున్నం, వస్తాం, ఉరుకు, గెదుము. వాక్యం: సామాన్య వాక్యాలు – ఆమె మంచి మనిషి (క్రియారహిత వాక్యం), నేను పొలం దున్నిన (క్రియసహిత వాక్యం), సంశ్లిష్ట వాక్యం–సత్తయ్య పొలం దున్ని అలసి పోయిండు, సంయుక్త వాక్యం–అతను పొలం దున్నిండు, మల్ల గడ్డి కోసిండు. ఈవిధంగా తెలంగాణలో వద ప్రయోగాలున్నాయి.

ఈ). మాండలిక పదాలు:అంగడి, అంబలి, అగ్గువ, అలుగు. జంట పదాలు : అంటుకు సొంటుకు అగ్గడు బగ్గడు. ధ్వన్యనుకరణ పదాలు–గలగల, సలసల. మాండలిక పద బేదాలు :తెలంగాణలో 'బర్రె' అను పదానికి రాయలసీమలో 'ఎనుము' అని ఆంధ్రాలో 'గేదె' అను ప్రయోగాలు ఉన్నాయి.

ఉ). సంస్కృత పదాలు తెలంగాణలో ప్రయోగించిన విధానం:– దశకం – దస్కం, నిత్యం – నిత్తె. ప్రాకృత పదాలు–చంద్రుడు–ఛందో, రాతిరి–రత్తి, ఉర్దూ పదాలు–ఇకమత్–ఉపాయం, ఖతం–పూర్తి, అను ప్రయోగాలు ఉన్నాయి.

ఊ). జాతీయాలు –ఇంటింటికి మంటిపొయ్యి, తాకులుతినుట, సామెతలు: దుక్కి కొద్ది పంట బుద్ది కొద్దిసుఖం, పోయిలకు లేకున్నా పోకడ లావు అను జాతీయాలు, సామెతలు ప్రయోగంలో ఉన్నాయి.

**9. భావి పరిశోధకులకు సూచనలు** (Suggestions for upcoming Researchers)

అ)తెలంగాణ భాష విషయంలో పూర్వం పదకోశాలు వచ్చినవ్పటికీ ఇంకా గ్రామాలలో ఎన్నో వదాలు సేకరించవలసిన బాధ్యత భావి పరిశోధకులకు ఉంది.

ఆ)తెలంగాణ జానపద సాహిత్యంలో పాటలను, కళలను పరిశోధన చేస్తే అనేక పదాలు తెలుస్తాయి.

ఇ) తెలంగాణలో మాండలికంలో వచ్చిన కవిత్వంను, కథలను, నవలలను పరిశోధన చేస్తే అనేక పదాలు తెలుస్తాయి.

**పరిశోధకుని వివరాలు:** డా. రాగుల సుధాకర్. లక్ష్మాపూర్ గ్రామం, రామాయంపేట మండలం, మెదక్ జిల్లా. తెలంగాణ–502115. ఫోన్:9493995655; email: ragulasudhakar42@gmail.Com.

**రచయిత:** తెలుగు అధ్యాపకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376



"If there is magic on the planet, it is contained in water."

Loren Eisley
American Anthropologist

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007